www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
సోమవారం | 22-7-2024 | పేజీలు: 12 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 97
శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, బహుళపక్షం, తిథి: పాడ్యమి మ. 1.12 తదుపరి విదియ; నక్షత్రం: శ్రవణం రా. 10.21 తదుపరి ధనిష్ఠ; వర్జ్యం: రా. 2.00-3.28; దుర్ముహూర్తం: మ. 12.47-1.38, మ. 3.21-4.13; అమృతఘడియలు: మ. 12.45-2.14; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.55; సూర్యాస్తమయం: 6.47
విజయవాడ సిటీ**
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

బై బైడెన్

అమెరికా అధ్యక్ష ఎన్నిక నుంచి జోబైడెన్ ఔట్
డెమోక్రాట్ల ఒత్తిడికి తలొగ్గిన అధ్యక్షుడు
వారాంతంలో జాతినుద్దేశించి ప్రసంగిస్తా: బైడెన్
కమలాహ్యారిస్‌కు మద్దతిస్తానని వ్యాఖ్య 2
రేసులో కమలాహ్యారిస్ ముందంజ


ఐటీ ఉద్యోగులకు 14 గంటల షాక్!
బిల్లుకు కర్ణాటక కాంగ్రెస్ సర్కారు ఓకే!!
కంపెనీల ప్రతిపాదనకు అంగీకారం
నేడు కేబినెట్ ఆమోదం.. తర్వాత అసెంబ్లీలో
ఉద్యోగుల సంఘం ఫైర్.. కార్మిక మంత్రితో భేటీ
మరోసారి చర్చిస్తామని మంత్రి వెల్లడి
ఐటీలో వారానికి 70 గంటలు పనిచేయాలని గతంలో 'ఇన్ఫోసిస్' నారాయణమూర్తి సూచన

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కర్ణాటక ప్రైవేటు ఐటీ కంపెనీలు, పరిశ్రమల్లో స్థానికులకు 50 శాతం నుంచి వంద శాతం ఉద్యోగాలివ్వాలంటూ బిల్లు తెచ్చిన సిద్దరామయ్య నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం.. మరో వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఐటీ ఉద్యోగులకు పనిగంటలను 14 గంటలకు పెంచేందుకు సిద్ధమైంది. దేశంలో అత్యధిక ఐటీ సంస్థలు, వాటి అనుబంధ కంపెనీలు బెంగళూరు, మైసూరు నగరాల్లోనే ఉన్న సంగతి తెలిసిందే. రోజుకు 14 పనిగంటల ప్రతిపాదనలను ఐటీ కంపెనీలు ఇటీవలే ప్రభుత్వానికి పంపాయి. సిద్దూ సర్కారు మరో ఆలోచన లేకుండానే వాటి అమలుకు సిద్ధమైంది. పని సమయాన్ని
మిగతా 2వ పేజీలో...

ఉగ్ర గోదారి
ధవళేశ్వరం వద్ద ఉధృతంగా ప్రవాహం

అల్లూరి జిల్లాలోని మండల కేంద్రమైన చింతూరులో ఇళ్లలోకి చేరిన వరద నీరు

ధవళేశ్వరం బ్యారేజీ వద్ద గోదావరి ఉరుకులు

మొదటి ప్రమాద హెచ్చరిక జారీచేసే అవకాశం
భద్రాచలం వద్ద ఇప్పటికే తొలి హెచ్చరిక జారీ
చింతూరు వద్ద జాతీయ రహదారిపైకి వరద
తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు నిలిచిన రాకపోకలు
8.18 లక్షల క్యూసెక్కులు దిగువకు విడుదల
ఘాట్లలో స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు
కోనసీమ జిల్లాలో నేడు, విలీన మండలాల్లో నేడు, రేపు బడులకు సెలవులు
ఉధృతంగా శబరి.. చింతూరు-మారేడుమిల్లి ఘాట్ బంద్
రాష్ట్రంలో 48 వేల హెక్టార్లలో వరి పైరు మునక
ప్రాథమికంగా అంచనా వేసిన వ్యవసాయ శాఖ


(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)
గోదావరి వరద ఉధృతమవుతోంది. తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం బ్యారేజీ వద్ద మొదటి ప్రమాద హెచ్చరిక దిశగా పరుగులు పెడుతోంది. ఆదివారం సాయంత్రం 6గంటలకు బ్యారేజీ వద్ద నీటిమట్టం 10.10 అడుగులకు చేరింది. పాండ్ లెవెల్ 13.75 మీటర్లుగా ఉంది. బ్యారేజీ నుంచి రాత్రి 9గంటలకు 8,18,853 క్యూసెక్కులు సముద్రంలోకి వదిలేస్తున్నారు. ఈ ప్రవాహం 10లక్షల క్యూసెక్కులు దాటినా.. బ్యారేజీ నీటిమట్టం 11.75 అడుగులకు చేరినా మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేస్తారు. సోమవారం తెల్లవారుజామునకే మొదటి హెచ్చరిక జారీచేసే అవకాశం ఉన్నట్టు ఇరిగేషన్ అధికారులు చెబుతున్నారు. కాగా, భద్రాచలం వద్ద ఆదివారం రాత్రి 43 అడుగులకు గోదావరి నీటిమట్టం చేరడంతో మొదటి ప్రమాద హెచ్చరిక
మిగతా 11వ పేజీలో...

అతివృష్టి.. అనావృష్టి
దేశంలోని 9 రాష్ట్రాల్లో వానజాడ కరువు
ఆరు రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

బిరబిరా కృష్ణమ్మ
ఆల్మట్టి నుంచి భారీగా ప్రవాహం
శ్రీశైలానికి 80 వేల క్యూసెక్కులు
తుంగభద్రకు 1,12,101 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
74.58 టీఎంసీలకు చేరిన నీటి నిల్వ
రాయలసీమ ఆయకట్టు రైతుల్లో ఆశలు 11

కరువుతీరా వాన
రాష్ట్రంలో 50 శాతం అధిక వర్షపాతం
ఖరీఫ్‌లో వరి, వాణిజ్య పంటలకు మేలు

బలహీనపడనున్న అల్పపీడనం
కోస్తా, సీమకు వర్ష సూచన

ప్రకాశం బ్యారేజీ దాటి దిగువకు కృష్ణమ్మ పరుగులు


అభివృద్ధి.. జనాకర్షకం
- బడ్జెట్ రూపకల్పనలో మోదీ 3.0 సర్కార్ ప్రాధాన్యాలివే
- ఆంధ్రప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు చేయూతనిచ్చే వరాలు

మౌలిక సదుపాయాలకు భారీగా నిధులు
ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.మూడున్నర లక్షలకు పెంచే అవకాశం
గృహ రుణాలపై ఇస్తున్న రాయితీ పెంపు?
గ్రామీణ ప్రాంత ఎంఎస్ఎంఈలకు అండ
అగ్నివీర్ పథకంలో మార్పులు చేసే చాన్స్
మధ్య తరగతికి ఊరట కల్పించే చర్యలు
గృహ నిర్మాణ రంగానికి ప్రోత్సాహకాలు
కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాల వెల్లడి!



బడ్జెట్ అనగానే ఏటా ఆదాయపన్ను శ్లాబుల్లో ఏవైనా మార్పులు వస్తాయేమోనని ఆశగా ఎదురుచూడ్డం.. ఏ మార్పులూ లేకపోవడం చూసి నిరాశపడ్డం.. గడచిన పదేళ్లుగా ఇదే తంతు. ఇపుడు మరో బడ్జెట్‌కు వేళయ్యింది. ఎన్నికలకు ముందు మధ్యంతర బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన నిర్మలా సీతారామన్.. రేపు పూర్తిస్థాయి బడ్జెట్‌ను సభ ముందుంచేందుకు సిద్ధమయ్యారు. దీంట్లోనైనా వేతన జీవులకు, మధ్యతరగతికి ఊరట కల్పిస్తారా? సంస్కరణలతోపాటే సంక్షేమానికీ పెద్ద పీట వేస్తారా? మౌలిక సదుపాయాలకు భారీ నిధులు ప్రకటిస్తూనే.. జనాకర్షక విధానాలను ప్రకటిస్తారా? అంటే.. ఆర్థిక నిపుణులు అవుననే అంచనా వేస్తున్నారు. 2



శాసనసభ భేటీ నేటి నుంచే
గవర్నర్ ప్రసంగంతో ఉభయ సభలూ ప్రారంభం
తర్వాత బీఏసీ భేటీ.. ఎజెండా ఖరారు
రేపు ధన్యవాద తీర్మానంపై చర్చ.. ఆమోదం
తర్వాత అసెంబ్లీలో రోజుకో శ్వేతపత్రం
ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు బిల్లు కూడా 12

నేడు అసెంబ్లీకి మొక్కుబడిగా!
గవర్నర్ ప్రసంగాన్ని అడ్డుకుని మధ్యలోనే వెళ్లిపోనున్న జగన్ అండ్ కో
రేపటికల్లా ఢిల్లీలో ఉండాలని వైసీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆదేశం
ఎల్లుండి హస్తినలో ధర్నా.. గురు, శుక్రవారాల్లోనూ ఆయన అక్కడే
మొత్తంగా అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా.. శాంతిభద్రతలపై కావాలనే గగ్గోలు
ప్రతి ఘటనకూ రాజకీయ రంగు.. ముఖ్య నేతలు వద్దంటున్నా అదే తీరు
రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో జగన్ భేటీ.. రాష్ట్రపతి పాలన విధించాలని వినతి


అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): అధికారం కోల్పోయామన్న నిస్పృహ వైసీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్‌రెడ్డిలో ప్రస్ఫుటంగా కనిపిస్తోంది. టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చి 40 రోజులు కాకముందే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని.. వైసీపీ శ్రేణులపై దాడులు జరుగుతున్నాయని ఆయన పదే పదే ఆరోపిస్తున్నారు. అసెంబ్లీ సమావేశాలకు డుమ్మా కొట్టి
మిగతా 12వ పేజీలో...

అసెంబ్లీ వదిలేసి ఢిల్లీకా?
జగన్‌వి డైవర్షన్ డ్రామాలు: టీడీపీపీ 12
శ్వేతపత్రాల్లో తప్పులు బయటపడతాయనే ధర్నా బాట
పార్లమెంటులో రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై చర్చిస్తాం
ఐదేళ్ల ఆర్థిక విధ్వంసాన్ని దేశానికి వివరిస్తాం: లావు

నచ్చింది కాదు.. ఉన్నదే చదవాలి
ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో కొన్ని సబ్జెక్టులే
వాటినే మేజర్‌గా ఎంపిక చేస్తున్న అధికారులు
విద్యార్థులూ వాటినే తీసుకోవాల్సిన పరిస్థితి
గ్రామీణ ప్రాంతాల్లో కనిపించని ఫిజిక్స్
ఎంపికలో కాలేజీలకు లేని అవకాశం
సింగిల్ మేజర్‌తో పడిపోతున్న అడ్మిషన్లు
3.5 లక్షల సీట్లలో మూడో వంతూ భర్తీకాని వైనం

11

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఒకప్పుడు విద్యార్థులు నచ్చిన కోర్సులు చదువుకునేవారు. కానీ ఇప్పుడు అధికారులు ఎంపిక చేసిన కోర్సులే చదువుకోవాల్సిన దుస్థితి వచ్చింది. ఫలానా సబ్జెక్టు కావాలని ఎంపిక చేసుకోవడానికి బదులుగా.. కాలేజీలో ఉన్న సబ్జెక్టులు ఏంటో చూసుకుని వాటిలో ఏదో ఒకటి చదువుకోవాల్సి వస్తోంది. గత ప్రభుత్వం హడావుడిగా ప్రవేశపెట్టిన సింగిల్ మేజర్ డిగ్రీ విధానమే ఈ దుస్థితికి కారణం! దీని ఫలితంగా అడ్మిషన్లు దారుణంగా పడిపోతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో 3.5లక్షల సీట్లుంటే.. ఇప్పటికీ 1.2లక్షల దరఖాస్తులు కూడా దాటలేదంటే పరిస్థితి ఎంతగా దిగజారిపోయిందో అర్థం చేసుకోవచ్చు!.


3
అమెరికాలో తెనాలి విద్యార్థిని మృతి
ఉన్నత చదువులకు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో తుదిశ్వాస
మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు
స్పందించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్

విశాఖలో వైసీపీకి షాక్ 11
12 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు అవుట్
ఏడుగురు టీడీపీలోకి, ఐదుగురు జనసేనలోకి
త్వరలో మరో ఆరుగురు చేరే అవకాశం!

మళ్లీ పాత మండలాలకే
తహసీల్దార్ల పునర్నియామకంలో గందరగోళం


ఎన్నికల ముందు 656 మంది బదిలీ
చాలామంది వైసీపీతో అంటకాగారని ఆరోపణలు
తాజాగా వారిని సొంత జిల్లాలకు పంపాలని రెవెన్యూ శాఖ స్పెషల్ సీఎస్ ఆదేశాలు
గతంలో పనిచేసిన డివిజన్‌కు వద్దని స్పష్టీకరణ
ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసిన సీసీఎల్ఏ
కలెక్టర్ల గ్రూపుల్లో మాత్రం భిన్నంగా మెసేజ్
గతంలో పనిచేసిన చోటే పోస్టింగ్ ఇవ్వాలట

(అమరావతి-ఆంధ్రజ్యోతి)
ఎన్నికల సమయంలో వైసీపీ నేతలతో అంటకాగారన్న ఆరోపణలతో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు బదిలీ అయిన తహసీల్దార్లను ఇప్పుడు మళ్లీ అవే మండలాల్లో నియమించబోతున్నారు. తప్పు చేశారని భావించి అక్కడి నుంచి తప్పించిన వారిని ప్రభుత్వం మారాక కూడా అదే పోస్టులోకి తీసుకోవడం ఏమిటో అర్థంకాక జిల్లా కలెక్టర్లు, అధికారులు జుట్టు పీక్కుంటున్నారు. తహసీల్దార్ల
మిగతా 2వ పేజీలో...


2
కేరళలో నిఫా వైరస్ బాలుడి మృతి
కోజికోడ్‌లో పలువురి ఐసొలేషన్
ప్రత్యేక బృందాన్ని పంపనున్న కేంద్రం
పుణె నుంచి మొబైల్ ల్యాబ్
బాలుడికి దగ్గరగా ఉన్న 63 మందికి పరీక్షలు
గుజరాత్‌ను వణికిస్తున్న చాందీపుర వైరస్
50 కేసుల నమోదు.. 16 మంది మృతి!
అప్రమత్తమైన ఆరోగ్య శాఖ.. నివారణకు చర్యలు

ఐటీ ఉద్యోగులకు 14 గంటల షాక్!

(మొదటి పేజీ తరువాయి)



14 గంటలకు పెంచుతూ.. కర్ణాటక షాప్స్, కమర్షియల్ ఎస్టాబ్లిష్‌మెంట్ బిల్లు-2024 (సవరణ)ను తీసుకొచ్చేందుకు సిద్ధమైంది. సోమవారం కేబినెట్ భేటీలో చర్చించి.. ప్రస్తుత శాసనసభ సమావేశాల్లోనే బిల్లును ప్రవేశపెట్టే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. ఐటీ, ఐటీఈఎస్, బీపీవోలో పనిచేసే ఉద్యోగుల పని గంటలను 12 నుంచి 14 గంటలకు పెంచాలని కార్మికశాఖ నిర్ణయించింది. ప్రస్తుతం పది గంటల వర్కింగ్ అవర్స్, రెండు గంటలు ఓవర్ టైం.. మొత్తం 12 గంటలు పని చేస్తున్నారు. దీనిని 12 గంటల వర్కింగ్ అవర్స్ రెండు గంటల ఓవర్‌టైంకు సవరించాలని బిల్లులో ప్రతిపాదించారు. ఈ పని గంటలు వరుసగా మూడు నెలల్లో 125 గంటలకు మించరాదని పేర్కొన్నారు. ఆ రెండు గంటల ఓవర్‌టైంకు జీతమివ్వరు. ఈ నిర్ణయంపై కర్ణాటక ఐటీ/ఐటీఈఎస్ ఎంప్లాయీస్ యూనియన్ (కేఐటీయూ) మండిపడింది. ఈ సవరణ బిల్లు చట్టమైతే మూడు షిఫ్టుల స్థానంలో రెండు షిఫ్టుల విధానం వస్తుందని.. ఐటీ రంగంలో పనిచేసే 20 లక్షల మంది ఉద్యోగుల్లో మూడో వంతు మందిని తీసేసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేసింది. ఉద్యోగులపై పనిఒత్తిడి పెరుగుతుందని, రెండు గంటలు అదనంగా పనిచేస్తే వారు పలు అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటారని తెలిపింది. దీనిపై కార్మిక మంత్రి సంతోష్‌లాడ్, ఐటీబీటీ శాఖ అధికారులతో ఉద్యోగుల సంఘం కార్యదర్శి సుహాస్ అడిగ, అధ్యక్షుడు సూరజ్ నిడియం భేటీ అయ్యారు. 14 పనిగంటల ప్రతిపాదనపై తీవ్రంగా మండిపడ్డారు. కార్మికుడి వ్యక్తిగత జీవితాన్ని హరించేలా, ప్రాథమిక హక్కులను కాలరాసేలా నిబంధనలు తెస్తున్నారని మండిపడ్డారు. మంత్రి లాడ్ స్పందిస్తూ.. నిర్ణయం తీసుకునేముందు మరోసారి చర్చిస్తామని తెలిపారు. వారం క్రితమే ప్రైవేటు సంస్థలు, పరిశ్రమల్లో కన్నడిగులకు 50-100 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ కేబినెట్‌లో తీర్మానించి తీవ్ర విమర్శలు రావడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన సంగతి తెలిసిందే. . కాగా, ఐటీ దిగ్గజం ఇన్ఫోసిస్ వ్యవస్థాపకుడు నారాయణమూర్తి కొన్ని నెలల కిందట.. వారానికి 70 గంటలు పనిచేస్తే దేశ ఆర్థిక ప్రగతి వేగవంతం అవుతుందని సూచించారు. అభివృద్ధి చెందిన దేశాల్లో ఇదే విధానం ఉందని వ్యాఖ్యానించారు. దీనిపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పుడు దాదాపు ఇదే సూచనను బిల్లు రూపంలో తెచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సమాయత్తం కావడం గమనార్హం.

'సినిమా'పైనా చూపు

బెంగళూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం కర్ణాటక సినిమా, సాంస్కృతిక కళాకారుల బిల్లు-2024ను శాసనసభలో ఇటీవల ప్రవేశపెట్టింది. సినిమా టికెట్ల చార్జీలు పెంచేందుకు ప్రభుత్వం కుట్ర పన్నిందని సినీ కళాకారులు మండిపడుతున్నారు. సినిమా టికెట్లు, ఓటీటీ చార్జీలు పెంచడం ద్వారా ప్రేక్షకులపై భారం మోపనున్నారన్న విమర్శలు న్నాయి. సినిమా టికెట్లపై 2% పన్ను పెంచి దోపిడీకి పాల్పడి ప్రజలకు వినోదాన్ని దూరం చేసేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని బీజేపీ ఆరోపించింది.

సివిల్స్‌లో దివ్యాంగుల కోటా అవసరమా?

స్మితా సబర్వాల్ వివాదాస్పద వ్యాఖ్య

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఐఏఎస్, ఐపీఎస్ లాంటి పోస్టుల ఎంపికలో దివ్యాంగులకు రిజర్వేషన్ అవసరమా? అని సీనియర్ ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్ ప్రశ్నించారు. సివిల్ సర్వీసుల్లో ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ఎక్కువ గంటలు పని చేయాల్సిన ఐఏఎస్, ఐపీఎస్ వంటి పోస్టుల్లో దివ్యాంగ కోటా ఎందుకని ఆమె ప్రశ్నించారు. వైకల్యం ఉన్న వారిని గౌరవిస్తున్నానని, కానీ వైకల్యం ఉన్న పైలట్‌ను విమానయాన సంస్థలు నియమించుకుంటాయా? వైకల్యం ఉన్న సర్జన్ సేవలను మీరు విశ్వసిస్తారా? అని ప్రశ్నించారు. ఆదివారం ఆమె తన ట్విట్టర్ ఖాతా ద్వారా ఈ అంశంపై చేసిన వ్యాఖ్యలు వివాదస్పదమయ్యాయి.

అభివృద్ధి.. జనాకర్షకం

ఆదాయపన్ను మినహాయింపు పరిమితిని రూ.3.5 లక్షలకు పెంచే అవకాశం

గృహ రుణాలపై ఇస్తున్న రాయితీ పెంపు?

కేంద్ర బడ్జెట్‌పై మధ్యతరగతికి ఆశలు

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): మోదీ 3.0 ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టనున్న కేంద్ర బడ్జెట్‌లో అభివృద్ధి-సంక్షేమంతో పాటు ఆర్థిక లోటు తగ్గించేందుకు చర్యలు ఉంటాయని ఆర్థిక మంత్రిత్వ శాఖ వర్గాలు తెలిపాయి. లోక్‌సభలో బీజేపీ సంఖ్యాబలం తగ్గడం, మిత్రపక్షాలపై ఆధారపడాల్సి రావడం, ఈ ఏడాది ఆఖరులో మూడు కీలక రాష్ట్రాల్లో ఎన్నికల వంటివాటి నేపథ్యంలో.. సంస్కరణలకు, జనాకర్షక విధానాలకు, రాష్ట్రాల అవసరాలకు సమానంగా ప్రాధాన్యమిస్తూ ఈ బడ్జెట్ రూపకల్పన జరిగిందని ఆ వర్గాలు వివరించాయి. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, బిహార్‌ను దృష్టిలో ఉంచుకుని బడ్జెట్‌లో పలు చర్యలను ప్రకటించవచ్చునని సూచనప్రాయంగా వెల్లడించాయి. ఇప్పటికి వరుసగా ఆరుసార్లు బడ్జెట్‌ను ప్రవేశపెట్టిన ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. ఎప్పటిలాగానే ఈసారి కూడా మౌలిక సదుపాయాల కల్పనకు పెట్టుబడులను భారీగా పెంచనున్నారు. అందులో భాగంగా రైల్వే, రహదారులు, టెలి కమ్యూనికేషన్లు, ఆటోమొబైల్ రంగం, ఆరోగ్య సంరక్షణ, రేవుల అభివృద్ధికి భారీ ఎత్తున నిధులు పెరగనున్నాయి. ఈ బడ్జెట్‌లో రెవెన్యూ వ్యయం.. జీడీపీలో 7.7 శాతానికి, మూలధన వ్యయం 3.5 శాతానికి చేరుకుంటుందని భావిస్తున్నారు. అలాగే.. స్థూల ఆర్థిక లోటును 5.6 శాతానికి తగ్గించడం లక్ష్యంగా ఆర్థిక మంత్రి చర్యలు చేపట్టనున్నట్టు సమాచారం. మొత్తమ్మీద.. మోదీ గత రెండు ప్రభుత్వాల్లో లేనట్టుగా ఈసారి జనాకర్షక విధానాలకు కూడా పెద్ద పీట వేయనున్నట్లు ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు. ముఖ్యంగా మధ్యతరగతివారిని, మహిళలు, రైతులు, వృద్ధులను ఆకట్టుకునేందుకు చర్యలు ప్రకటిస్తారని అంచనాలు వినపడుతున్నాయి. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం ఈసారి బడ్జెట్‌లో..



ఆదివారం అఖిలపక్ష సమావేశానికి వెళ్తున్న రక్షణమంత్రి రాజ్‌నాథ్, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి రిజిజు

- సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి రంగాల (ఎంఎస్ఎంఈ) పటిష్ఠతకు పలు చర్యలు ప్రకటించనున్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఎంఎస్ఎంఈ రంగానికి చేయూతనిచ్చే అవకాశాలున్నాయి. స్టార్టప్ ఇండియా సీడ్ నిధి క్రింద ఈ రంగానికి నిధులు పెరిగే అవకాశం ఉంది.
- చైనాతో సరిహద్దుల్లో తరచూ ఉద్రిక్తతలు ఏర్పడుతున్న నేపథ్యంలో.. ఈసారి రక్షణ రంగ బడ్జెట్ రూ.6 లక్షలకు పైగా ఉండవచ్చని అంచనా.
- అగ్నిపథ్ పథకంపై మిత్రపక్షాల నుంచి కూడా తీవ్ర విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆర్మీ నిపుణుల నుంచి వచ్చిన సంస్కరణలను దృష్టిలో ఉంచుకుని అగ్నిపథ్‌లో మార్పులు వచ్చే అవకాశాలున్నాయి.
- ఆదాయపన్ను కనీస మినహాయింపు పరిమితిని రూ.3 లక్షల నుంచి రూ.3.5 లక్షల వరకు పెంచవచ్చు. ఆదాయపన్ను చట్టంలోని సెక్షన్ 80డి కింద ఆరోగ్య బీమా ప్రీమియంలకు మినహాయింపు పరిమితిని మరింత పెంచే చాన్స్ అలాగే, మధ్యతరగతిని ఆకట్టుకునేందుకు గృహరుణాలపై సబ్సిడీని మరింత పెంచవచ్చు.
- ఆయుష్మాన్ భారత్ క్రింద రూ.5 లక్షల వరకూ బీమాను 70 ఏళ్లు దాటినవారికి కూడా వర్తింపజేస్తామంటూ బీజేపీ తన ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన హామీని ఈ బడ్జెట్‌లో నెరవేర్చవచ్చని భావిస్తున్నారు. మహిళలకు కూడా ఈ పథకం క్రింద ఆరోగ్య సేవలను పెంచే అవకాశాలున్నాయి.
- ముద్రా యోజన పరిమితిని రూ.20 లక్షలకు పెంచడంతో పాటు సురక్షితం కాని ఎంఎస్ఎంఈ రుణాలను రూ. 2 కోట్లనుంచి రూ. 5 కోట్లకు పెంచవచ్చు. స్టార్టప్‌లపై ఆర్థిక భారం తగ్గించేందుకు మరిన్ని పన్ను రాయితీలు కల్పించవచ్చు.
- రియల్ ఎస్టేట్ రంగానికి పరిశ్రమ హోదా కల్పించి.. స్వదేశీ, విదేశీ సంస్థల నుంచి పెట్టుబడులను ఆకర్షించేందుకు చర్యలను ప్రకటించే అవకాశాలు లేకపోలేదు. మెట్రో సిటీల్లో శాటిలైట్ టౌన్‌షిప్‌ల ఏర్పాటుతో పాటు అందుబాటు ధరల్లో ఉండేలా గృహ నిర్మాణాన్ని ప్రోత్సహించే చర్యలు ప్రకటించవచ్చు.
- కిసాన్ సమ్మాన్ నిధి, ప్రధాన పంటలకు కనీస మద్దతు ధరల పెంపు, గిడ్డంగుల అభివృద్ధి, నీటి పారుదల ప్రాజెక్టులకు, ఆహారోత్పత్తుల పరిశ్రమలకు నిధుల పెంచే అవకాశాలున్నాయి.
- పునరుత్పాదక ఇంధన రంగానికి బడ్జెట్ లో నిధులు పెరగవచ్చని భావిస్తున్నారు. సోలార్, హైడ్రో, పవన విద్యుత్ ప్రాజెక్టులకు మరిన్ని ప్రోత్సాహకాలు కల్పించవచ్చు.
- విద్యారంగం, నైపుణ్య అభివృద్ధికి బడ్జెట్ లో కేటాయింపులు గణనీయంగా పెరుగుతాయని భావిస్తున్నారు. ప్రభుత్వ ప్రైవేట్ భాగస్వామ్యం ద్వారా నైపుణ్యాభివృద్ధికి, ఉపాధి అవకాశాల కల్పనకు చర్యలు తీసుకోవచ్చునని అంచనాలున్నాయి.


చిట్యాల-జగ్గయ్యపేట లైన్‌కు మోక్షం!

హైదరాబాద్, జూలై 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రంలో ప్రతిపాదించిన పలు రైల్వే అభివృద్ధి ప్రాజెక్టులకు ఆశించిన స్థాయిలో నిధుల కేటాయింపులుంటాయని దక్షిణ మధ్య రైల్వే అధికారులు భావిస్తున్నారు. ప్రధానంగా పలు కొత్త ప్రాంతాలను రైల్వేలైన్‌కు అనుసంధానం చేసేందుకు రూ.4,104 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిపాదించిన చిట్యాల-జగ్గయ్యపేట రైల్వేలైన్ పనులకు మోక్షం లభించే అవకాశం ఉంది. అలాగే 2,588 కి.మీ దూరానికి డబ్లింగ్, ట్రిప్లింగ్ తదితర అభివృద్ధి పనులతో పాటు మరో 11 ప్రాజెక్టులకు రూ.32,695 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన ప్రతిపాదనలకు కేంద్రం బడ్జెట్‌లో నిధులు కేటాయించే అవకాశం ఉంది.

ఏపీ, బిహార్ కు బడ్జెట్ లో చేయూత!

సొంతంగా మెజారిటీ సాధించలేక.. లక్ష్యానికి అల్లంత దూరంలో నిలిచిపోయిన బీజేపీకి టీడీపీ, జేడీయూ అండగా నిలిచి మోదీ 3.0 సర్కారు ఏర్పడడంలో కీలకపాత్ర పోషించిన నేపథ్యంలో ఈసారి బడ్జెట్‌లో ఏపీ, బిహార్‌కు ఆర్థికంగా చేయూతనిచ్చేలా కొన్ని ప్రకటనలు చేసే అవకాశాలున్నాయని అంచనా. చంద్రబాబు ఏపీ సమగ్రంగా కోలుకునేందుకు ఆర్థిక ప్రణాళికను ఆశిస్తుండగా, నితీష్ కుమార్ బిహార్ లో మౌలిక సదుపాయాల అభివృద్ధిని ఆశిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. రెండు రాష్ట్రాలకూ లబ్ధిచేకూర్చేలా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక సహాయం, విదేశీ సహాయ ప్రాజెక్టులకు రుణాల చెల్లింపు ద్వారా మద్దతు, నిర్దిష్టమైన నష్టపరిహార ప్యాకేజీని రూపొందించేందుకు నిపుణుల కమిటీ నియామకంతో పాటు రైల్వే ప్రాజెక్టులకు నిధుల పెంపు వంటివాటికి బడ్జెట్‌లో చోటు ఉంటుందని భావిస్తున్నారు. ఈ ప్రకటనల వల్ల ఏపీ ఆశిస్తున్న రాజధాని, పోలవరం ప్రాజెక్టుల నిర్మాణానికి కేంద్రం మద్దతు ఉంటుందనే అంచనాలున్నాయి.

లోకం తీరు



ఉద్యోగాల భర్తీలో కోటాల రద్దు

విద్యార్థుల నిరసన నేపథ్యంలో బంగ్లాదేశ్ సుప్రీంకోర్టు సంచలన తీర్పు

ఢాకా, అగర్తల, జూలై 21: బంగ్లాదేశ్ వ్యాప్తంగా తీవ్ర హింసాకాండకు దారి తీసిన రిజర్వేషన్లపై ఆ దేశ సుప్రీంకోర్టు కీలక తీర్పును వెలువరించింది. మహిళలు, వెనకబడిన జిల్లాలకు ఇస్తున్న రిజర్వేషన్లను పూర్తిగా తొలగించటమేగాక.. సమరయోధుల కుటుంబీలకు ఇస్తున్న 30 శాతం రిజర్వేషన్‌ను 5 శాతానికి తగ్గించింది. మైనారిటీలకు, దివ్యాంగుల కోటాను 2 శాతానికి పరిమితం చేసింది. ప్రభుత్వ ఉద్యోగాలలో 93శాతం ఖాళీలను ప్రతిభ ఆధారంగా భర్తీ చేయాలని, మిగిలిన 7శాతంలో 5 శాతం సమర యోధుల కుటుంబసభ్యులకు, 2 శాతం మైనారిటీలు, ట్రాన్స్‌జెండర్లు, దివ్యాంగులకు కేటాయించాలని ఆదివారం తీర్పు చెప్పింది. కోటాల రద్దుకోసం విద్యార్థుల ఉద్యమానికి నేతృత్వం వహిస్తున్న విద్యార్థిసంఘం సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తూనే, రిజరేషన్లను పూర్తిగా రద్దు చేసే వరకూ తమ ఉద్యమాన్ని కొనసాగిస్తామని ప్రకటించింది.

శరణార్థులకు ఆశ్రయమిస్తాం: మమత

కోల్‌కతా, జూలై 21: బంగ్లాదేశ్‌లో ఉద్యోగాల్లో రిజర్వేషన్ల కోటాపై కొన్ని రోజులుగా హింసాత్మక ఘటనలు జరుగుతున్న నేపథ్యంలో అక్కడి నుంచి వచ్చే శరణార్థులకు రాష్ట్రంలో ఆశ్రయం కల్పిస్తామని పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ తెలిపారు. బంగ్లాదేశ్ వ్యవహారాల గురించి మాట్లాడబోనని, కానీ సాయం కోరి తలుపు తట్టే బంగ్లాదేశీయులకు ఆశ్రయమిస్తామని చెప్పారు. కాగా, బంగ్లాదేశ్ నుంచి వచ్చే శరణార్థులకు ఆశ్రయం కల్పిస్తామంటూ మమతా బెనర్జీ చేసిన ప్రకటనను కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఇది కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని, ఇలాంటి విషయాల్లో రాష్ట్ర ప్రభుత్వాలకు ఎలాంటి అధికారం ఉండదని స్పష్టం చేసింది. మమతాబెనర్జీ చేసిన వ్యాఖ్యలు అర్థం పర్థం లేనివని కొట్టిపారేసింది.

కేరళలో నిఫా వైరస్ సోకిన బాలుడి మృతి

కోజికోడ్‌లో పలువురి ఐసొలేషన్

ప్రత్యేక బృందాన్ని పంపనున్న కేంద్రం

కోజికోడ్, జూలై 21 : కేరళలోని మలప్పురం జిల్లా పండిక్కడ్‌లో ప్రమాదకర నిఫా వైరస్ సోకిన 14 ఏళ్ల బాలుడు కోజికోడ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఈమేరకు ఆ రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ ప్రకటించారు. ఆ బాలుడికి ఆదివారం ఉదయం 10.50 గంటలకు తీవ్ర గుండెపోటు వచ్చిందని, చికిత్స చేసి రక్షించేందుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయన్నారు. అంతర్జాతీయ నిబంధనల ప్రకారం అతడికి అంత్యక్రియలు జరుగుతాయన్నారు. ఆ బాలుడు చికిత్స పొందిన కోజికోడ్ వైద్య కళాశాలలో ముగ్గురు వ్యక్తులను ఐసొలేషన్‌లో ఉంచినట్లు మంత్రి చెప్పారు. అలాగే మంజేరి వైద్య కళాశాలలో నలుగురు హై రిస్క్ కేటగిరీలో ఉన్న వ్యక్తులు చేరారని, వారిలో ఒకరు ఐసీయూలో ఉన్నారని తెలిపారు. మృతి చెందిన బాలుడికి దగ్గరగా మసలిన 246 మందిలో 63 మందిని హై రిస్క్ కేటగిరీగా గుర్తించామన్నారు. వారందరికీ వైద్య పరీక్షలు చేయనున్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో వారికి వైద్య పరీక్షలు చేసేందుకు తగిన ల్యాబ్‌లు ఉన్నాయని, అలాగే పుణె జాతీయ వైరాలజీ ఇన్‌స్టిట్యూట్ నుంచి ఒక మొబైల్ ల్యాబ్ రానున్నట్లు మంత్రి చెప్పారు. నిఫా వైరస్ బయటపడిన పండిక్కడ్‌తోపాటు రెండు పంచాయతీల్లోని 33,000 ఇళ్లలో జ్వరాలపై పరిశీలన చేయనున్నట్లు చెప్పారు. పండిక్కడ్‌కు మూడు కిలోమీటర్ల వరకు ఆంక్షలు విధించినట్లు తెలిపారు. ఆస్ట్రేలియా నుంచి తెప్పించి పుణె వైరాలజీ ఇన్‌స్టిట్యూట్‌లో భద్రపరచిన మోనోక్లోనల్ యాంటీబాడీలు కూడా రాష్ట్రానికి చేరినట్లు మంత్రి వీణా జార్జ్ వెల్లడించారు. కాగా కేరళ రాష్ట్ర ప్రభుత్వానికి సహకరించేందుకు ఒక ప్రత్యేక బృందాన్ని పంపనున్నట్లు కేంద్ర ఆరోగ్య శాఖ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపింది. నిఫా వైరస్ ప్రబలిన ప్రాంతంలో అందుకు కారణాలను గుర్తించేందుకు ఈ బృందం సహకరిస్తుంది. కోజికోడ్‌లో చనిపోయిన బాలుడి నమూనాలను పుణెలోని వైరాలజీ ల్యాబ్‌కు పంపగా నిఫా వైరస్‌గా నిర్ధారించినట్లు కేంద్ర ఆరోగ్య శాఖ వెల్లడించింది. చనిపోయిన బాలుడికి దగ్గరగా మసలిన వారిని గుర్తించి కచ్చితంగా క్వారంటైన్ చేయాల్సిందిగా కేరళ ప్రభుత్వానికి సూచించినట్లు తెలిపింది. గబ్బిలాల్లో(ఫ్రూట్ బ్యాట్) నిఫా వైరస్ ఉంటుంది. అవి తగిలిన చెట్ల పండ్లను తిన్న వారికి ఈ వైరస్ సోకుతోంది. కేరళలో కోజికోడ్ జిల్లాలో 2018, 2021, 2023లో, ఎర్నాకుళం జిల్లాలో 2019లో నిఫా వైరస్ ప్రబలింది. కోజికోడ్, వయనాడ్, ఇడుక్కి, మలప్పురం, ఎర్నాకుళం జిల్లాల్లోని గబ్బిలాల్లో నిఫా వైరస్ యాంటీ బాడీలను గుర్తించారు.



గుజరాత్‌ను వణికిస్తున్న చాందీపుర వైరస్

అహ్మదాబాద్, జూలై 21: చాందీపుర వైరస్ గుజరాత్‌ను వణికిస్తోంది. రాష్ట్రంలో 50 చాందీపుర వైరస్ కేసులు, ఈ వైరస్ అనుమానిత లక్షణాలతో 16 మంది మృతిచెందారని గుజరాత్ ఆరోగ్యశాఖ మంత్రి రుషికేశ్ పటేల్ వెల్లడించారు. సబర్ కాంత జిల్లాలోని హిమ్మత్‌పూర్‌లో పరిస్థితి ఆందోళనకరంగా ఉందని, ఇప్పటి వరకు ఇక్కడ 14 చాందీపుర వైరస్ కేసులు నమోదవగా వారిలో ఏడుగురిని ఆస్పత్రికి తరలించాల్సి వచ్చిందని చెప్పారు. గుజరాత్ వెలుపల కూడా ఈ వైరస్ కేసులు మూడు కనిపించాయని, దీంతో ఈ వైరస్ కేసులు ఇతర రాష్ట్రాలకూ వ్యాపించిందని పటేల్ పేర్కొన్నారు. వైరస్ వ్యాప్తి నేపథ్యంలో ఆరోగ్యశాఖను అప్రమత్తం చేశామని చెప్పారు. ముఖ్యమంత్రి భూపేంద్ర పటేల్ కూడా చాందీపుర వైరస్ పరిస్థితిని సమీక్షించారు. జిల్లాల్లో మలాథియాన్ పౌడర్‌ను పిచికారీ చేయాలని ఆదేశించారు. తొలిసారిగా 1966లో మహారాష్ట్రలోని చాందీపురలో గుర్తించారు. ఇది 15 ఏళ్లలోపు పిల్లల్లో ఎక్కువగా వ్యాపిస్తుంది. దీని వల్ల మెదడువాపు సంభవిస్తుంటుంది. ఈ వైరస్ దోమల ద్వారా వ్యాప్తి చెందుతుంది.

మళ్లీ పాత మండలాలకే!

(మొదటి పేజీ తరువాయి)

పునర్‌నియామకంపై భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ ఇచ్చిన ఆదేశాలు ఈ గందరగోళానికి దారితీశాయి. వీటిని అమలు చేస్తే గత ప్రభుత్వంలో తహసీల్దార్లు చేసిన తప్పులను మాఫీ చేసి తిరిగి పాత స్థానాలనే కట్టబెట్టాల్సి ఉంటుంది. వైసీపీ నేతలతో అంటకాగిన అధికారులు తమ మైత్రి స్వేచ్ఛగా కొనసాగించడానికి ప్రభుత్వం అధికారికంగా లైసెన్స్ ఇచ్చినట్లవుతుందని, ఇంక మార్పు ఏమిటనే ప్రశ్నలు అధికారవర్గాల నుంచి వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో సాధారణ ఎన్నికల సమయం నాటికి అనేక మండలాల్లో వైసీపీ నేతలు, తహసీల్దార్ల మైత్రి తారస్థాయికి చేరింది. తహసీల్దార్లపై ఒత్తిడి తీసుకొచ్చి కొందరిని అదిరించి, బెదిరించి వైసీపీ నేతలు విలువైన అసైన్డ్, చుక్కల, అనాధీనం, లంక భూములను దోచుకున్నారు. దొంగ ఓట్లను చేర్చడం, టీడీపీ, జనసేన, వామపక్షాల ఓట్లను తొలగించేలా కుట్రలు పన్నారు. దీనిపై టీడీపీ, జనసేన, ఇతర పార్టీలు పెద్ద ఎత్తున ఆందోళన చేశాయి. ఈ నేపథ్యంలో దాదాపు 656 మంది తహసీల్దార్లను అప్పటి సీసీఎల్‌ఏ సాయిప్రసాద్ బదిలీ చేశారు. ఒక జోన్ వారిని మరో జోన్‌కు మార్చారు.

మెసేజ్‌తో గందరగోళం: ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయి కూటమి ప్రభుత్వం వచ్చాక తమను సొంత ప్రాంతాలకు మార్చాలన్న డిమాండ్లను తహసీల్దార్లు ప్రభుత్వం ముందుంచారు. మరోవైపు బొప్పరాజు వెంకటేశ్వర్లు నేతృత్వంలోని రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ కూడా ఇదే అంశంపై ఇటీవల రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్, ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ సిసోడియాను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ నేపథ్యంలో తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపించి పోస్టింగ్‌లు ఇవ్వాలని, ఎవరికీ సొంత డివిజన్‌లలో (ఇంతకు ముందు పనిచేసిన డివిజన్)లో పోస్టింగ్‌లు ఇవ్వకూడదని సీసీఎల్‌ఏను ఆదేశిస్తూ 19న సిసోడియా ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జోన్ల వారీగా తహసీల్దార్లను సొంత జిల్లాలకు పంపిస్తూ సీసీఎల్‌ఏ జి. జయలక్ష్మీ ఉత్తర్వులు ఇచ్చారు. వీటిని జిల్లా కలెక్టర్లు, సబ్ కలెక్టర్, ఆర్డీఓల గ్రూపుల్లో పోస్టుచేశారు. అయితే సీసీఎల్‌ఏ ఉత్తర్వులకు భిన్నంగా కలెక్టర్ల గ్రూపుల్లో ఓ మెసేజ్ పెట్టారు. 'ఎన్నికల కారణంగా ఇతర జిల్లాలకు బదిలీ అయిన తహసీల్దార్లు సొంత జిల్లాలకు వచ్చాక వారికి ఇంతకుముందు పనిచేసిన మండలంలోనే పోస్టింగ్ ఇవ్వండి' అన్నది ఆ మెసేజ్ సారాంశం. దీంతో దేన్ని పాటించాలో కలెక్టర్లకు అర్థం కావడం లేదు. అలాగని ఏ ఆదేశం పాటించాలో స్పష్టత కోరే సాహసం చేయలేరు. ఎలాగూ సాధారణ బదిలీ ఉత్తర్వులు లేవు కాబట్టి తిరిగి వచ్చినవారిని గతంలో పనిచేసిన మండలాల్లోనే పోస్టింగ్ ఇస్తూ కలెక్టర్లు ఉత్తర్వులు ఇస్తున్నారు. ఇందుకోసం ప్రస్తుతం ఆయా మండలాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లను మరో మండలానికి బదిలీ చేస్తున్నారు. దీంతో తాజాగా బదిలీ అయిన వారు గగ్గోలు పెడుతున్నారు. ఆరు నెలలు కాకముందే తమను మరోచోటకు మార్చడం ఏమిటని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వారికో రూలు.. వీరికో రూలా?

ఎన్నికల సమయంలో ఎన్నికల కమిషన్ జిల్లా కలెక్టర్, ఎస్పీ, ఆర్డీఓ, డీఆర్‌ఓ, జాయింట్ కలెక్టర్ వంటి వారిని బదిలీ చేసింది. వారు అదే చోట ఉంటే ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా సాగవన్న కారణంతోపాటు పరిపాలనా అంశాలతో బదిలీలు చేశారు. అందులో కొందరు వైసీపీ పెద్దలతో అంటకాగారు. దొంగ ఓట్ల నమోదుకు సహకరించారు. మరికొందరు అడ్డగోలు పనులు చేసి బదిలీ అయ్యారు. ఆ సమయంలో రాష్ట్ర డీజీపీనే మార్చారు. ఎన్నికల తర్వాత కూటమి ప్రభుత్వం వచ్చాక తిరిగి ఆయా జిల్లాలకు కలెక్టర్, ఎస్పీలుగా బదిలీ చేసిన అధికారులను నియమించలేదు. వారికి మరో చోట పోస్టింగ్ ఇచ్చేశారు. అలాంటిది ఎన్నికల ముందు తీవ్ర ఆరోపణలతో బదిలీ అయిన తహసీల్దార్లను ఇప్పుడు తిరిగి సొంత మండలాలకు తీసుకొచ్చి పోస్టింగ్ ఇవ్వడం ఏంటనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. ఐఏఎస్, ఐపీఎస్‌లకు ఒక రూలు, తహసీల్దార్లకు మాత్రం మరో రూలా? ఇదెక్కడి చోద్యం? అంటూ సీనియర్ అధికారులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రీ పాట్రియేషన్ సమయంలో తహసీల్దార్లను వారి సొంత డివిజన్‌లో పోస్టింగ్ ఇవ్వకూడదని రెవెన్యూ స్పెషల్ సీఎస్ సిసోడియా ఆదేశాల్లో పేర్కొన్నారు. ఆ ఉత్తర్వులనే సీసీఎల్‌ఏ రీ పాట్రియేషన్ ఆర్డర్‌లో పేర్కొన్నారు. అందుకు భిన్నంగా వాట్సప్ గ్రూపుల్లో మెసేజ్ చేయడం తీవ్ర గందరగోళం, కలకలానికి దారితీసింది. అసలు సీసీఎల్‌ఏ ఏం చెప్పదలుచుకున్నారో తమకు అంతుచిక్కడం లేదని పలువురు కలెక్టర్లు పేర్కొంటున్నారు.

బై బైడెన్..!

అమెరికా అధ్యక్ష ఎన్నిక నుంచి జోబైడెన్ ఔట్

డెమోక్రాట్ల ఒత్తిడికి తలొగ్గిన అధ్యక్షుడు

వారాంతంలో జాతినుద్దేశించి ప్రసంగిస్తా: బైడెన్

కమలాహ్యారిస్‌కు మద్దతిస్తానని వ్యాఖ్య



వాషింగ్టన్, జూలై 21: అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ వెనక్కి తగ్గారు. అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొన్నారు. "నేను అధ్యక్ష ఎన్నికల నుంచి తప్పుకోవాలంటే.. ఆ దేవుడే దిగి రావాలి. లేదంటే.. నేను అనారోగ్యం బారిన పడడమో.. రైలు ఢీకొని చనిపోవడమో జరగాలి" అంటూ.. శనివారం వరకు భీష్మించుకున్న బైడెన్.. ఆదివారం ఒక్కసారిగా మనసు మార్చుకున్నారు. దేశ ప్రయోజనాల కోసం పోటీ నుంచి తప్పుకొంటున్నట్లు ప్రకటించారు. ఈ వారాంతంలో జాతినుద్దేశించి ప్రసంగించనున్నట్లు వెల్లడించారు. నిజానికి రిపబ్లికన్ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్‌పై హత్యాయత్నానికి ముందే.. ఆయన విజయావకాశాలు 60% దాకా ఉండగా.. కాల్పుల ఘటన తర్వాత 78శాతానికి పెరిగిపోయాయి. అప్పటి నుంచి డెమోక్రాట్లు బైడెన్ ఉంటే ఓటమి తప్పదని ప్రకటనలు చేస్తూ వచ్చారు. ఇప్పుడున్న పరిస్థితుల్లో ట్రంప్‌ను ఎదుర్కోవడం బైడెన్ వల్ల కాదంటూ.. మాజీ అధ్యక్షుడు బరాక్ ఒబామా, ఇతర సీనియర్లు వ్యాఖ్యానించారు. ఇలా డెమోక్రాట్ల నుంచి తీవ్ర ఒత్తిడి వస్తున్నా.. 'తగ్గేదే లే' అన్న బైడెన్ అనూహ్యంగా ఆదివారం తన నిర్ణయాన్ని ప్రకటించారు. గురువారం రాత్రి తనకు కొవిడ్-19 సోకిందని ప్రకటించిన బైడెన్.. ప్రస్తుతం తన ఇంట్లో స్వీయ-క్వారంటైన్‌లో ఉన్నారు. తన తాజా నిర్ణయంపై ఓ లిఖితపూర్వక ప్రకటన చేశారు. "ప్రియమైన అమెరికన్లకు.. అమెరికా అధ్యక్షుడిగా సేవ చేయడం నా జీవితంలో గొప్ప గౌరవం. గడిచిన మూడున్నరేళ్లలో మనం చాలా అభివృద్ధిని సాధించాం. ఈరోజు అమెరికా ప్రపంచంలోనే శక్తిమంతమైన ఆర్థిక శక్తిగా ఉంది. దేశ పునర్నిర్మాణంలో మనం ఎంతో కృషి చేశాం. డ్రగ్స్‌ను నిరోధించాం. తుపాకీ సంస్కృతికి చెక్ పెట్టేలా చట్టాన్ని తీసుకువచ్చాం. మొట్టమొదటిసారిగా ఆఫ్రికా మూలాలున్న అమెరికా మహిళను సుప్రీంకోర్టులో నియమించాం. కొవిడ్ సమయంలో ఆత్మనిర్భరంతో ముందుకు వెళ్లాం. ఆర్థిక ఒడిదుడుకులు లేకుండా జాగ్రత్తలు తీసుకున్నాం. ముఖ్యంగా ప్రజాస్వామ్యాన్ని కాపాడుకున్నాం. పార్టీ నిర్ణయం మేరకు.. దేశ ప్రయోజనాల కోసం ఇప్పుడు అధ్యక్ష ఎన్నికల బరి నుంచి తప్పుకొంటున్నా" అని పేర్కొన్నారు. అదే సమయంలో ఎక్స్‌లో ఓ పోస్టు పెట్టారు. "నా ప్రియతమ డెమోక్రాట్లకు.. నా నామినేషన్‌ను ఆమోదించకుండా.. పరిపాలనపైన దృష్టి పెట్టాలనుకుంటున్నాను. ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ ఈ మూడున్నరేళ్ల పాలనలోనాకు ఎంతగానో సహకరించారు. నా వారసురాలిగా ఆమోదిస్తున్నాను. ఆమెకు పూర్తిస్థాయిలో మద్దతిస్తాను. కలిసికట్టుగా ట్రంప్‌ను ఓడిద్దాం" అని పిలుపిచ్చారు.

పాతిక రోజుల క్రితం..

జూన్ 27న ట్రంప్‌తో జరిగిన డిబేట్‌లో బైడెన్ తీవ్రంగా తడబడ్డారు. అందులో ట్రంప్‌దే పైచేయి అయింది. అప్పటి నుంచే బైడెన్ కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. తర్వాత పలు సభల్లోనూ తడబడుతూ.. తప్పులు మాట్లాడారు. దీంతో.. ఆయన అనారోగ్యంతో బాధపడుతున్నారని, మానసికంగా స్థిరంగా లేరని సొంత పార్టీ నేతలే విమర్శించారు. ఆయన రేసులో ఉంటే ఓటమి ఖాయమని, స్వచ్ఛందంగా వైదొలగాలని ఒబామా , డెమోక్రాట్ సెనేట్ మెజారిటీ లీడర్ చక్‌షుమోర్, డెమోక్రటిక్ హౌస్ లీడర్ హకీమ్ జాఫ్రీస్ స్వరం పెంచారు. ఏకంగా 30 మంది కాంగ్రెస్ సభ్యులు ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. దీంతో బైడెన్ తలొగ్గక తప్పలేదు.

రేసులో కమలాహ్యారిస్ ముందంజ

ఆమె అభ్యర్థిత్వంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు

బైడెన్‌తో పోలిస్తే కమలను ఓడించడం సులువన్న ట్రంప్?



అభ్యర్థిత్వం నుంచి తప్పుకొన్నట్టు బైడెన్ ప్రకటించారు సరే! మరి.. ఆయన స్థానంలో అధ్యక్ష పదవికి పోటీ పడబోయే అభ్యర్థి ఎవరు? ప్రస్తుత ఉపాధ్యక్షురాలు కమలా హ్యారిస్ అభ్యర్థిత్వానికి మద్దతిస్తానని బైడెన్ చెప్పారుగానీ.. అది ఆయన అభిప్రాయం మాత్రమే. అభ్యర్థిగా ఎవరు ఉండాలనేది డెమొక్రాట్లందరూ కలిసి తీసుకోవాల్సిన నిర్ణయం. కమలా హ్యారిస్ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ ఇప్పటికే కొందరు బహిరంగ వ్యాఖ్యలు కూడా చేశారు. 'బైడెన్‌ను తప్పుకోవాలని డిమాండ్ చేస్తున్నామంటే.. కమలాహ్యారిస్ అభ్యర్థిత్వాన్ని ఒప్పుకొంటున్నట్టు కాదు' అన్నది వారి వాదన. సాధారణంగా.. అధ్యక్ష పదవికి తమ పార్టీ నుంచి ఎవరు పోటీలో ఉండాలో తేల్చుకోవడానికి అమెరికాలో పార్టీలు ప్రైమరీలు, కాకస్‌లు నిర్వహిస్తాయి. ప్రైమరీలంటే.. బ్యాలెట్ ద్వారా జరిపే ఓటింగ్. కాకస్ అంటే చర్చల ద్వారా జరిపే ఓటింగ్. డెమొక్రాట్ సభ్యుల్లో ఎవరి మద్దతు ఎవరికి ఉందో? ఎవరికి అత్యధికుల మద్దతు ఉందో? ప్రైమరీలు, కాకస్‌ల ద్వారా తేలిపోతుంది. ఆ తర్వాత జరిగే పార్టీ జాతీయస్థాయి సదస్సులో ఎక్కువ మంది మద్దతు పొందిన అభ్యర్థి పేరును లాంఛనంగా ప్రకటిస్తారు. షెడ్యూలు ప్రకారం డెమొక్రాట్ల జాతీయ స్థాయి సదస్సు ఆగస్టు 19న జరగనుంది. సమయం ఇంత తక్కువగా ఉన్న నేపథ్యంలో అన్ని రాష్ట్రాల్లో ప్రైమరీలు నిర్వహించడం సాధ్యం కాదు కాబట్టి కొన్ని రాష్ట్రాల్లో నిర్వహించి (మినీ ప్రైమరీలు) అభ్యర్థిని ప్రకటించే అంశంపై డెమొక్రాట్లు చర్చలు జరుపుతున్నట్టు సమాచారం. డెమొక్రాట్ పార్టీ నుంచి అధ్యక్ష అభ్యర్థిత్వాన్ని ఆకాంక్షిస్తున్నవారిలో మిషిగన్ గవర్నర్ గ్రెచెన్ విట్మర్, క్యాలిఫోర్నియా గవర్నర్ గవిన్ న్యూసమ్ ఉన్నారు. కానీ, వారికి కమలాహ్యారిస్‌ను మించి మద్దతు రాకపోవచ్చని పార్టీ సభ్యులే అభిప్రాయపడుతున్నారు. మిషెల్ ఒబామా పేరు కూడా వినిపిస్తోంది. అంతిమంగా పార్టీసభ్యులు వీరిలో ఎవరిని ఎంచుకుంటారో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికైతే రేసులో కమలాహ్యారిసే ముందంజలో ఉందని చెప్పొచ్చు. ఒకవేళ ఆ పార్టీ సభ్యులు కమలాహ్యారిస్‌నే అభ్యర్థిగా ఎంచుకుంటే మాత్రం అమెరికా చరిత్రలోనే అదో మైలురాయిగా నిలిచిపోతుంది. ఒక నల్లజాతి, భారతీయ మూలాలు కలిగిన మహిళ అధ్యక్ష పదవికి పోటీ పడడం చరిత్రాత్మకమే అవుతుంది!! కాగా.. బైడెన్‌తో పోలిస్తే కమలా హ్యారిస్‌ను ఓడించడం తనకు చాలా సులువు అవుతుందని డోనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యానించినట్టు సీఎన్ఎన్ వార్తాసంస్థ రిపోర్టర్ ఒకరు 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.


వేణుదత్తాత్రేయ స్వామికి అభిషేకం చేస్తున్న చంద్రబాబు

గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ముఖ్యమంత్రి

» వేణు దత్తాత్రేయ స్వామి వారికి చంద్రబాబు పూజలు

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): రామదూత స్వామి ఆధ్వర్యంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఓ కన్వెన్షన్ హాలులో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. వేణుదత్తాత్రేయ స్వామివారికి చంద్రబాబు అభిషేకం, పాదుకా పూజ చేశారు. రామదూత స్వామివారి ఆశీర్వచనం తీసుకున్నారు. ఈ సందర్భంగా వేద పండితులు చంద్రబాబు, ఆయన కుటుంబం కోసం ప్రత్యేక పూజలు జరిపారు.


అమ్మవారికి ఆషాఢ సారె తీసుకొచ్చిన మహిళలు

కిటకిటలాడిన ఇంద్రకీలాద్రి

» ఆషాఢ పౌర్ణమి, శాకంబరీ ఉత్సవాలకు భారీగా వచ్చిన భక్తులు

విజయవాడ (వన్‌టౌన్), జూలై 21: ఆషాఢ పౌర్ణమి, శాకంబరీ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆదివారం ఇంద్రకీలాద్రికి భక్తులు పోటెత్తారు. ఓ దశలో ఆలయ ప్రాంగణం మొత్తం కిక్కిరిసిపోయింది. ఆదివారం ఒక్కరోజే 65 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారని ఆలయ వర్గాలు తెలిపాయి. భక్తుల రద్దీ దృష్ట్యా మధ్యాహ్నం 12.15 గంటల తరువాత దర్శనం టికెట్ల జారీ నిలిపివేసి భక్తులను క్యూలైన్లలో ఉచితంగా అనుమతించారు. రాత్రి 7 గంటల నుంచి దర్శనం టికెట్ల జారీని పునరుద్ధరించారు.


ప్రత్యేక అలంకరణలో సత్యసాయి మహాసమాధి

సత్యసాయి సేవలు స్ఫూర్తిదాయకం

» హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లా

పుట్టపర్తి, జూలై 21: సత్యసాయిబాబా సేవలు మానవాళికి స్ఫూర్తిదాయకమని హిమాచల్‌ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్‌శుక్లా కొనియాడారు. పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివప్రతాప్‌శుక్లా మాట్లాడుతూ.. సత్యసాయి ఆధ్యాత్మిక గురువుగా కోట్లాది భక్తుల పూజలు అందుకుంటున్నారన్నారు. వచ్చే ఏడాది సత్యసాయి శతజయంతి ఉత్సవాలను పురస్కరించుకుని ట్రస్టు చేపట్టిన శ్రీసత్యసాయి దివ్యాంగజన్ ప్రాజెక్టును ఆయన ప్రారంభించారు.


స్వర్ణాల చెరువు వద్ద భక్తుల కోలాహలం

నెల్లూరులో ముగిసిన రొట్టెల పండుగ

» ఆరు లక్షల మంది వచ్చి ఉంటారని అంచనా

నెల్లూరు, జూలై 21 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఐదు రోజుల పాటు జరిగిన బారాషాహీద్ దర్గా రొట్టెల పండుగ ఆదివారం ముగిసింది. చివరి రోజు కూడా స్వర్ణాల చెరువు తీరం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి భారీ సంఖ్యలో భక్తులు రొట్టెల పండుగకు తరలివచ్చారు. విద్య, ఉద్యోగ, సంతాన రొట్టెలకు చివరి రోజు డిమాండ్ ఏర్పడింది. గతేడాదితో పోలిస్తే ఈసారి రొట్టెల పండుగకు వచ్చిన భక్తుల సంఖ్య పెరిగింది. ఐదు రోజుల్లో మొత్తం ఆరు లక్షల మందికిపైగా పాల్గొని ఉంటారని అధికారులు అంచనా వేస్తున్నారు.

కంప్యూటర్ల.. కొను‘గోల్‌మాల్’

» ఆర్‌డబ్ల్యూఎస్‌లో అడ్డగోలుగా అవినీతి

» టెండర్లు పిలవకుండా వ్యవహారం

» బెజవాడలో రిటైలర్ దగ్గర రూ.5 కోట్లకు 480 కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలు

» టెండర్లు పిలిస్తే కోటిన్నర తగ్గే అవకాశం

» ఆ ‘నొక్కుడు’ సొమ్ము ఎవరు కొట్టేశారో?

» ఇప్పటికే ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం ఖాతా నిధుల దుర్వినియోగంపై పవన్‌కు ఫిర్యాదు

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన అక్రమాలు అన్నీ ఇన్నీ కావు. తవ్వే కొద్దీ బయటపడుతున్నాయి. గ్రామీణ నీటి సరఫరా విభాగం (ఆర్‌డబ్ల్యూఎస్)లో కంప్యూటర్ల కొనుగోలు పేరుతో జరిగిన గోల్‌మాల్ తాజాగా వెలుగు చూసింది. టెండర్లు పిలవకుండా అడ్డగోలుగా కంప్యూటర్లు, ప్రింటర్లు కొనుగోలు చేశారు. విజయవాడలోని ఓ ఎలక్ట్రానిక్స్ రిటైల్ షోరూమ్‌లో రెట్టింపు ధరలకు కొనుగోలు చేసి ‘సొమ్ము’ చేసుకున్నట్టు సమాచారం. కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలు పేరిట ఏకంగా రూ.5 కోట్ల మేర చెల్లింపులు చేయటం వెనుక అవినీతి చోటు చేసుకుందని, కోటిన్నర రూపాయలు చేతులు మారాయని తెలుస్తోంది. స్టేట్ వాటర్ శానిటేషన్ మిషన్ (ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం) నిధులతో ఉన్నతాధికారుల కనుసన్నల్లో ఈ వ్యవహారం జరిగినట్టు సమాచారం. ఇప్పటికే ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం పథకం నిధులు పక్కదారి పట్టాయని, వాటిపై విచారణ జరపాలని గ్రామీణాభివృద్ధి శాఖ బాధ్యతలు చూస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు కూడా అందింది. దీనిపై విచారణ ప్రారంభించే లోపే ఈ కుంభకోణం వెలుగులోకి వచ్చింది.

నిబంధనలు బేఖాతర్

ఆర్‌డబ్ల్యూఎస్ పరిధిలో రూ.5 లక్షలు మించి పని చేపడితే టెండర్లు పిలుస్తారు. అలాంటిది రూ.5 కోట్ల వ్యయంతో కంప్యూటర్లు కొనుగోలు చేసేటపుడు టెండర్లు పిలవాలన్న విషయాన్ని కూడా ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు మరిచిపోయారు. కనీసం కంప్యూటర్ల తయారీ సంస్థలతో అయినా సంప్రదించి వీలైనంత తక్కువ ధరకు ఇవ్వగలుగుతారా? అన్న విషయాన్ని కూడా ఆరా తీయలేదు. ఎలాంటి టెండర్లు లేకుండా విజయవాడలో బీసెంట్ రోడ్డుకు సమీపంలో ఉన్న ఓ భారీ ఎలక్ట్రానిక్స్ రిటైల్ షోరూమ్‌లో ఒక్క కొటేషన్ తీసుకుని దానిని ఓకే చేసి కొనుగోలు చేశారు.

ఆ కోటిన్నర ఎవరి జేబులోకి?

ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు కొనుగోలు చేసిన కంప్యూటర్లను చూస్తే... హెచ్‌పీ ఎలైట్ ఎస్‌ఎఫ్‌ఎఫ్ 600 జీ9 డెస్క్‌టాప్ పర్సనల్ కంప్యూటర్‌తో పాటు లేజర్‌జెట్ ప్రో ఎంఎఫ్‌పీ ఎం329డీడబ్ల్యూ ప్రింటర్‌ను కొనుగోలు చేశారు. డెస్క్‌టాప్ పీసీకి సంబంధించి సీపీయూ కాన్ఫిగరేషన్స్ చూస్తే 12వ జనరేషన్ ఇంటెల్ (ఆర్) కోర్ (టీఎం) ఐ5-12500 3.00 జిగా హెడ్జ్ ప్రాసెసర్, 8జీబీ ర్యామ్, టైప్ 64 బిట్ ఆపరేటింగ్ సిస్టమ్, ఎక్స్ 64 బేస్డ్ ప్రాసెసర్‌లతో కూడిన వాటిని కొనుగోలు చేశారు. ఇవన్నీ రిటైల్‌గా చూసినా, ఈ-మార్కెట్‌లో చూసినా ఒక్కొక్కటీ రూ.లక్ష లోపే వస్తాయి. బల్క్‌గా తీసుకుంటే ఇంకా చాలా తక్కువకు వస్తాయి. అదే కంపెనీ దగ్గర నేరుగా తీసుకుంటే 30 నుంచి 40 శాతం డిస్కౌంట్ ఇస్తారు. టెండర్లు పిలిస్తే ఇంకా తక్కువకు వస్తాయి. విజయవాడలో కొనుగోలు చేసిన ఎలక్ట్రానిక్స్ షోరూమ్ నిర్వాహకుడు హెచ్‌పీ కంపెనీకి డీలర్ కాబట్టి కనీసం తన మార్జిన్‌లో 20శాతం పైగానే డిస్కౌంట్ ఇస్తారు. దాదాపు 480 కంప్యూటర్లు, ప్రింటర్ల కొనుగోలు ధరలో కనీసం రూ.కోటిన్నర తగ్గుతుంది. అంటే.. మూడున్నర కోట్లు అయ్యే వ్యయానికి 5 కోట్లు ఖర్చు చేశారు. ఆ కోటిన్నర ఎవరి ఖాతాలోకి వెళ్లిందన్నది తేలాల్సి ఉంది. చాలా కార్యాలయాలకు ఇప్పటికీ కంప్యూటర్లు రాలేదని తెలుస్తోంది.

ఆ ఉద్యోగే ‘కీ’లకం

కంప్యూటర్ల కొనుగోలు వ్యవహారంలో సంబంధిత విభాగాల ఉన్నతాధికారులపై తీవ్ర ఆరోపణలు వస్తున్నాయి. గొల్లపూడిలోని ఈఎన్‌సీ కార్యాలయంలో ఉన్నతాధికారులకు ప్రీతిపాత్రమైన సూపరింటెండెంట్ పాత్ర ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన గత రెండు దశాబ్దాలకు పైగా ఈఎన్‌సీ కార్యాలయంలోనే తిష్ట వేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం నిధుల నుంచి చెల్లించటానికి వీలుగా సూపరింటెండెంట్ చెక్ రాయించినట్టు వెలుగుచూసింది. ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం ఖాతాకు సంబంధించిన చెల్లింపుల వ్యవహారాలు ఏపీ నగదు పుస్తకంలో జమ కాలేదు. ఈ వ్యవహారాలన్నీ చూడాల్సింది కూడా సూపరింటెండెంటే కావటం గమనార్హం. ఆ ఉద్యోగి వ్యవహారంతో ఈఎన్‌సీ కార్యాలయంలో పలువురు భయాందోళనలు చెందుతున్నారు. సూపరింటెండెంట్ దగ్గర ఈ విషయాన్ని సహోద్యోగులు ప్రస్తావిస్తే.. ‘నేను పోవాలంటే నాతో పాటు ఇప్పుడు పనిచేస్తున్నవారు, గతంలో రిటైరైన వారు కూడా పోతారు’ అని వ్యాఖ్యానించినట్టు తెలిసింది. ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం ఖాతాల వ్యవహారంపై సమగ్ర విచారణ చేపడితే వాస్తవాలు వెలుగులోకి వస్తాయి.

డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డికి ‘కెప్టెన్ చైర్’

» గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగంలో విశేష కృషికి జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయం గుర్తింపు


డాక్టర్ నాగేశ్వర్ రెడ్డి

హైదరాబాద్ సిటీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఏఐజీ ఆస్పత్రుల చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి అరుదైన గౌరవం దక్కింది. గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో ఆయన చేసిన విశేష కృషికి గుర్తింపుగా అమెరికాలోని జాన్స్ హాప్‌కిన్స్ విశ్వవిద్యాలయం ప్రతిష్ఠాత్మక, చారిత్రక ప్రాధాన్యత ఉన్న ‘కెప్టెన్ చైర్’ను అందజేసింది. ఈ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక ప్రొఫెసర్ సర్ విలియం ఓస్లర్.. 1874 నుంచి తమ రంగాల్లో విశేష కృషి చేసిన అధ్యాపకులు, పూర్వ విద్యార్థులకు ‘కెప్టెన్ చైర్’ను అందజేయడమనే సంప్రదాయం నెలకొల్పారు. ఈ విశ్వవిద్యాలయం గ్యాస్ట్రో ఎంటరాలజీ, హెపటాలజీ విభాగం డైరెక్టర్ అన్నీ మేరీ లెన్నాన్.. డాక్టర్ నాగేశ్వర్ రెడ్డికి ‘కెప్టెన్ చైర్’ను అందజేశారు. ప్రత్యేకమైన కలపతో కళాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ కుర్చీ.. నైపుణ్యానికి ప్రతీకగా తళుకులీనుతూ ఉంటుంది.

యువ వైద్యుల్లో ‘న్యూరోకాన్’ స్ఫూర్తి

» ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ వీసీ డాక్టర్ బాబ్జీ కితాబు

» ముగిసిన ఏపీ న్యూరోకాన్-2024



జేఎంకే మూర్తి దంపతులను సన్మానిస్తున్న విజయ తదితరులు

గుంటూరు (మెడికల్), జూలై 21: మూడు రోజుల పాటు గుంటూరులో జరిగిన ఏపీ న్యూరోకాన్-2024 వైద్య సదస్సు యువ వైద్యులకు ఎంతో స్ఫూర్తిదాయకంగా నిలిచిందని డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్ డాక్టర్ కొరుకొండ బాబ్జీ కొనియాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రఖ్యాత న్యూరాలజిస్టులు, న్యూరో సర్జన్లు వివరించిన మెళకువలు, చికిత్సల్లో నూతన అంశాలు యువ వైద్యులకు ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ (ఏపీ ఎన్ఎస్ఏ) 31వ వార్షిక సదస్సు ‘ఏపీ న్యూరోకాన్’ ముగింపు సభ ఆదివారం జరిగింది. ఈ సభలో డాక్టర్ బాబ్జీ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఏపీ ఎన్ఎస్ఏ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ పి.విజయ, సదస్సు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ వీఆర్ తారక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా బాబ్జీ

సమావేశంలో భాగంగా ఏపీ న్యూరో సైంటిస్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర నూతన అధ్యక్షుడుగా వీసీ డాక్టర్ కే బాబ్జీ ఎంపికయ్యారు. డాక్టర్ విజయ నుంచి ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఉపాధ్యక్షుడిగా ఎన్‌వీ సుందరాచారి, కార్యదర్శిగా ఏవీ రమణమూర్తి, సంయుక్త కార్యదర్శులుగా వీవీ రమేశ్‌చంద్ర, వి.వెంకటరాజు ఎంపికయ్యారు.

ముగిసిన ‘అడిగోపుల’ అంత్యక్రియలు

కొడవలూరు, జూలై 21: ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం అంత్యక్రియలు నెల్లూరు జిల్లా కొడవలూరు మండలం కొత్తవంగల్లులో ఆదివారం ముగిశాయి. శుక్రవారం తిరుపతిలో వెంకటరత్నం మరణించగా, కుటుంబ సభ్యులు పార్థివదేహాన్ని ఆదివారం కొత్తవంగల్లులోని ఆయన స్వగృహానికి తీసుకువచ్చారు. సీపీఎం జిల్లా నాయకులు వెంకటరత్నం మృతదేహం వద్ద నివాళులర్పించారు. సొంత వ్యవసాయక్షేత్రంలో ఆయన కుమారుడు శ్రీకాంత్ అంత్యక్రియలు నిర్వహించారు.

ముగిసిన జవాన్ వెంకటేశ్వర్లు అంత్యక్రియలు

» ప్రభుత్వ లాంఛనాలతో నిర్వహణ

అవుకు, జూలై 21: విధుల్లో ఉండగా ప్రమాదవశాత్తు గన్ పేలి మృతి చెందిన సీఐఎస్ఎఫ్ జవాన్ పెట్నికోట వెంకటేశ్వర్లు అంత్యక్రియలు ఆదివారం అధికార లాంఛనాలతో ముగిశాయి. వెంకటేశ్వర్లు మృతదేహాన్ని సీఐఎస్ఎఫ్ వాహనంలో ఆదివారం తెల్లవారుజామున 2:30 గంటలకు బీడీఎల్ ఎస్ఐ డీఎస్ రవి నంద్యాల జిల్లా అవుకు మండలం జూనూతల గ్రామానికి తీసుకొచ్చారు. అశ్రునయనాల నడుమ వెంకటేశ్వర్లు అంతిమయాత్ర సాగింది.


వెంకటేశ్వర్లు మృతదేహం వద్ద గౌరవ వందనం చేస్తున్న పోలీసులు

ఏపీ నిట్‌కు పోస్టులు మంజూరు

» 120 బోధన, 140 బోధనేతర సిబ్బంది నియామకానికి గ్రీన్ సిగ్నల్

భీమవరం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలోని ఆంధ్రప్రదేశ్ నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (నిట్)కి కేంద్ర మానవవనరుల శాఖ కొత్త పోస్టులు మంజూరు చేసింది. తాజాగా 120 బోధన, 140 బోధనేతర సిబ్బందిని నియమించుకోవడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీ నిట్ ప్రారంభమైన తర్వాత రెగ్యులర్ ప్రాతిపదికన ఇప్పటిదాకా 67 మంది బోధన, 70 మంది బోధనేతర సిబ్బందిని భర్తీ చేశారు. రెండేళ్ల క్రితమే కొత్త పోస్టులకోసం దరఖాస్తు చేసుకున్నప్పటికీ అనుమతి లభించలేదు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైసీపీ ప్రభుత్వం కూడా ఏపీ నిట్‌పై శ్రద్ధ చూపలేదు. ప్రస్తుతం బోధన, బోధనేతర రంగాల్లో 260 పోస్టుల భర్తీకి ఏపీనిట్‌కు కేంద్రం ఆమోదం తెలిపింది. త్వరలోనే భర్తీ ప్రక్రియను చేపట్టనున్నారు. ఏపీనిట్‌లో తగినంత బోధన సిబ్బంది లేరన్న కారణంతో సీట్ల సంఖ్యను కుదించారు. ఏటా 750 మంది విద్యార్థులకు ప్రవేశాలు కల్పించాల్సి ఉంటే ఈసారి 450 మందికే అవకాశం కల్పించారు.

ఇంజనీరింగ్ అడ్మిషన్లకు తుది షెడ్యూలు

» రేపటి నుంచి రిజిస్ట్రేషన్లు

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఇంజనీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు ఈఏపీసెట్ తుది కౌన్సెలింగ్‌కు సాంకేతిక విద్యా శాఖ షెడ్యూలు విడుదల చేసింది. ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు విద్యార్థులు రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చని తెలిపింది. 23 నుంచి 26వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన జరుగుతుందని, 24 నుంచి 26 వరకు ఆప్షన్ల ఎంపిక, 27న ఆప్షన్ల మార్పునకు అవకాశం ఉంటుందని వివరించింది. 30న సీట్ల కేటాయింపు జరుగుతుందని తెలిపింది. 31 నుంచి ఆగస్టు 3వ తేదీ లోగా విద్యార్థులు కాలేజీల్లో రిపోర్టు చేయాల్సి ఉంటుందని స్పష్టం చేసింది.



అనూష్ మంగళ్‌కు ప్రెసిడెంట్ అవార్డు ప్రదానం చేస్తున్న క్రిస్ గోపాలకృష్ణన్, సజ్జన్ జిందాల్, కేఎన్ సత్యనారాయణ

ఘనంగా తిరుపతి ఐఐటీ స్నాతకోత్సవం

ఏర్పేడు, జూలై 21: ఏర్పేడు వద్ద ఉన్న తిరుపతి ఐఐటీలో ఆరో స్నాతకోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఇన్ఫోసిస్, యాక్సెంచర్స్ సహ వ్యవస్థాపకుడు క్రిస్ గోపాలకృష్ణన్, బోర్డు ఆఫ్ గవర్నర్స్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్ సజ్జన్ జిందాల్ హాజరయ్యారు. క్రిస్ గోపాలకృష్ణన్ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానంతో కోపైలెట్‌గా ఎదగాలని విద్యార్థులకు సూచించారు. సజ్జన్ జిందాల్ మాట్లాడుతూ..దేశాన్ని 2047 నాటికి వికసిత్ భారత్‌గా మార్చేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని చెప్పారు. అతిథుల చేతుల మీదుగా ఐఐటీ డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ ప్రెసిడెంట్, గవర్నర్స్ అవార్డులను విద్యార్థులకు అందజేశారు.

అమెరికాలో తెనాలి విద్యార్థిని మృతి


» ఉన్నత చదువులకు వెళ్లి.. రోడ్డు ప్రమాదంలో దుర్మరణం

» మృతదేహాన్ని స్వదేశానికి రప్పించాలని తల్లిదండ్రుల వేడుకోలు

» స్పందించిన కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రి మనోహర్


జెట్టి హారిక

తెనాలి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లిన గుంటూరు జిల్లా తెనాలి విద్యార్థిని రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందారు. తెనాలి ఐతానగర్‌కు చెందిన జెట్టి హారిక (25) న్యూట్రిషన్ ఫుడ్ సైన్స్‌లో పీజీ చేసేందుకు గతేడాది ఆగస్టులో అమెరికా వెళ్లారు. శనివారం యూనివర్సిటీ నుంచి కారులో ఇంటికి వెళ్తుండగా లోగాన్ కౌంటీలోని ఒక్లహోమా హైవే పెట్రోల్-74 దగ్గర వరుసగా మూడు కార్లు ఢీకొనటంతో హారిక అక్కడికక్కడే మరణించారు. యూనివర్సిటీ నిర్వాహకులు ఆదివారం ఉదయం ఫోన్ చేసి విషయం తెలియజేశారని తెనాలిలోని ఆమె తల్లిదండ్రులు జెట్టి శ్రీనివాసరావు, నాగమణి కన్నీటి పర్యంతమయ్యారు. కుమార్తె ప్రయోజకురాలై స్వదేశానికి తిరిగొస్తుందన్న ఆశతో ఉన్నామని, ఆమె ఇకలేదనే వార్త జీర్ణించుకోలేకపోతున్నామంటూ కన్నీటి పర్యంతమయ్యారు. వీరిది మధ్యతరగతి కుటుంబం. కష్టపడి కూడబెట్టిన డబ్బుతో కుమార్తెను అమెరికాకు పంపారు. మృతదేహాన్ని స్వదేశానికి రప్పించే ఆర్థిక పరిస్థితి కూడా లేదు. మృతదేహం ఎక్కడుంది? ఎప్పుడు స్వదేశానికి వస్తుందనే సమాచారం కూడా ఎవ్వరూ ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అమెరికాలో ఎంఎస్ చేసేందుకు వెళ్లిన తెనాలికే తాడిబోయిన రవితేజ(28) మూడు రోజుల క్రితం స్విమింగ్‌పూల్‌లో మునిగి మరణించారు. రవితేజ ప్రమాదవశాత్తు స్విమింగ్ పూల్‌లో జారిపడి మరణించాడని ఆయన తల్లి జయలక్ష్మి కన్నీరుమున్నీరవుతూ వివరించారు. మృతదేహాన్ని తెనాలికి తీసుకొచ్చే స్తోమత తనకు లేదని, ప్రభుత్వం సహకారం అందించాలని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, నాదెండ్ల మనోహర్‌ను వేడుకున్నారు. వీరి అభ్యర్థనకు స్పందించిన చంద్రశేఖర్, మనోహర్ ఇప్పటికే అమెరికాలోని అధికారులతో మాట్లాడామని, మృతదేహాలను స్వదేశానికి రప్పించేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. హారిక తల్లిదండ్రులను పరామర్శించి ధైర్యం చెప్పారు.



అద్భుతమైన ముద్దు

ఓ నా ప్రియమైన సహ యాత్రికుడా
ఎడారిలో దప్పిగొన్న బాటసారినై
నేను నీ వలే, మృగతృష్ణ చెంత నిలిచి కనే
పగటికలలను నీ స్వప్నంలో దర్శించు

వీలైతే ఒక అద్భుతమైన
ప్రేమగల ముద్దును, జీవితేచ్ఛను
సుగంధ పుష్పాన్ని చేసి
నేను నిదురించే సమయాన
నా చెంత విడిచి వెళ్ళు

నా నుదుటిపై ప్రేమగా ముద్దుపెట్టు
వేదనామయ పురా జ్ఞాపకాల
మరుభూముల ఎడారైన నా శిరస్సుపై
హిమనదులు ప్రవహించి
కొత్త ఆశలు చిగురు వేస్తాయేమో

నా దిగులు కళ్లపై వెచ్చటి ముద్దుపెట్టు
లోలోన ఉప్పొంగే కన్నీటి సముద్రాలు
మాయమై, కాసిన్ని కమ్మటి కలల్ని
ప్రగాఢ సుఖ నిద్రను ఇవ్వగలదేమో

నా పెదవులపై ముద్దుపెట్టు
ఎన్నో మార్లు గాయపడి మౌనమై
మాయమైన నా మాటలు
ప్రణయపూరిత జీవ రహస్యాన్ని కనుగొని
చిరునవ్వై వెలుగుతాయేమో

నా అరచేతులపై ముద్దుపెట్టు
చిక్కుబడి, అగమ్యగోచరమైన
నా జీవన రేఖలను చెరిపివేసి
నీలాకాశాన్ని అందుకునే సత్తువగల
కొత్త రెక్కలు వికసిస్తాయేమో

నా పాదాలపై ముద్దుపెట్టు
నడచి నడచి అలసినా ఆగని
గమ్యరాహిత్యాపు పరుగులను వీడి
మరో అద్భుత సాహసోపేత
నూతన ప్రయాణానికి
దారులు కనుగొనగలవేమో

■ విమల

సాహిత్య విమర్శకి కొత్త దిశ

రెండేళ్ళ క్రితం వెలువడిన సాహిత్యవ్యాసాల సంపుటి 'దిక్చక్రం' లోని మొత్తం 48 వ్యాసాల్లో పర్యాప్తమై వున్న రచయిత విస్తృత విషయ పరిజ్ఞానం, దేశవిదేశాల సాహిత్య అధ్యయనసారం మనల్ని ఆశ్చర్య పరుస్తుంది. రెండు కథాసంపుటాలు వెలువరించిన కథారచయితగా, అనువాదకుడిగా మాత్రమే మనకు పరిచితుడైన, ఒక నాన్ అకడెమిక్ ఐన ఆడెపు లక్ష్మీపతి, అకడెమిక్ పండితులకు, పరిశోధకులకు తీసిపోని స్థాయిలో, వివిధ సాహితీప్రక్రియలు- కవిత్వం, కథ, నవల, నాటకం- గురించి, నూతన, పాశ్చాత్యసాహితీ ధోరణులైన మ్యాజికల్ రియలిజం, పోస్ట్ మోడర్నిజం, ఎగ్జిస్టెన్షియలిజం గురించి... పలు రచనల ప్రస్తావింపులతో అనేక అంశాలు సులభశైలిలో చెప్పినతీరు, వర్తమాన తెలుగుకవిత్వం, కథ, నవలలని- కొందరి రచనలు దృష్టాంతంగా తీసుకుని- కొత్త కోణంలో, కొండొకచో నిర్మొహమాటమైన వ్యాఖ్యానాలతో విశ్లేషించిన పద్ధతి అనన్యసామాన్యం. ఎంతో జ్ఞానతృష్ణ వుంటే తప్ప ఇంత లోతైన, విస్తారమైన అధ్యయనం సాధ్యం కావు.

రచయిత పాశ్చాత్య సాహిత్యాన్ని, విమర్శ గ్రంథాల్ని విరివిగా చదివి ఉండటమే కాక ఆ అధ్యయన ప్రభావంతో అలవడిన సరికొత్త చూపుతో తెలుగు సాహిత్యాన్ని విశ్లేషించేందుకు చేసిన ప్రయత్నం 'దిక్చక్రం' ప్రతి పేజీలో మనకు కనపడుతుంది. లక్ష్మీపతి ఈ గ్రంథాన్ని చాలా విశిష్టమైన తెలుగు పదజాలంతో రాశారు. కొన్నివ్యాసాలు చదువుతుంటే ఈ తెలుగు కంటే ఇంగ్లిష్ లోనే హాయిగా ఉంటుందేమో అనిపించేలా తెలుగులోని పారిభాషిక పదాలు వాడారు. కానీ కించిత్ శ్రమ తీసుకుని చదివితే సగటు పాఠకులకు, విద్యార్థులకు ఈ పుస్తకం నుంచి అపురూపమైన సాహిత్య సమాచారజ్ఞానం లభిస్తుంది.

'దిక్చక్రం'లోని వ్యాసాలు కవిత్వం, కథలు, నవలలు, కొత్త రచనా రీతులు, వాదాలు, తాత్విక ధోరణులు అని నాలుగు విభాగాలుగా విభజించి ఉన్నాయి. మొదటి మూడు విభాగాల్లో తెలుగులో తనకు నచ్చిన కొన్ని గ్రంథాల్ని తీసుకొని వాటిని తనవైన తూనికరాళ్ళతో పరిశీలించి చక్కని విమర్శ చేశారు లక్ష్మీపతి. కవిత్వవిభాగంలో, డా.ఏనుగునర్సింహారెడ్డి 'మూలమలుపు' సంపుటిలోని కవితలు విస్తారమైన వస్తువిభిన్నతను ప్రదర్శిస్తూ కవిలోని సునిశిత పరిశీలనాశక్తికి, అమితమైన స్పందనాశీలతకు తార్కాణంగా నిలుస్తాయంటారు. ఈ వ్యాసంలో కవిత్వంపై, కవిత్వనిర్మాణంపై సూచనలు, దేశవిదేశాల ప్రముఖ కవుల కొన్ని కవిత్వ చరణాలు ఉన్నాయి. డా.బాణాల 'కుంపటి' దీర్ఘకవితపై రాస్తూ కంసాలి వృత్తిపని, గ్రామీణ సమిష్టిచిత్రంలో ఆ వృత్తిబాధ్యత, కుటుంబ సంబంధాలు, చిన్ననాటి జ్ఞాపకాలు, సాదాసీదా వ్యక్తిత్వాలు, కల్లోలాలు, జీవనసంక్షోభాల్ని చిత్రించడానికి కవి 'కుంపటి'ని ఎంతో ఔచిత్యవంతంగా కవితావస్తువుగా తీసుకున్నాడు అని ఉద్ఘాటిస్తాడు. బి.ఎస్.ఎం.కుమార్ 'నిషాలు, వృత్తాలు, వెళ్తురారిన కళ్ళు' కవిత్వ సంపుటికి ముందుమాటలో కుమార్ ప్రత్యేకమైన వ్యక్తీకరణ పద్ధతిని, శైలిని నిష్పాక్షికంగా అంచనా వేస్తూ, ఆ కవిత్వాన్ని వినసొంపైన స్వాప్నిక రాగాలాపనగా అభివర్ణిస్తూ అతని కవిత్వంలో anarchist expressions ఉన్నప్పటికీ ఆనదింపచేసే విషయాలు చాలా ఉన్నాయంటూ, అది దేనికి అనుకరణ కాదని, కవిపై ఎవరి ప్రభావంలేదని, అద్భుతమైన ప్రతీకల్తో, అనితరసాధ్యమైన మెటఫర్లతో చిక్కని కవిత్వం రాశాడని ప్రశంసిస్తాడు. కానీ సామాన్య పాఠకులకు అర్థం కానంత జటిలమైన కవిత్వం ఆమోదయోగ్యం కాదని అభిప్రాయపడతాడు.

సిద్ధార్థ 'బొమ్మలబాయి' నిండా గత దశాబ్దమున్నర కాలాన్ని రూపుకట్టిన కవిత్వముంది, వస్తువైవిధ్యం, తెలంగాణ అస్తిత్వపోయి, ఉద్యమ తీవ్రత, స్వచ్ఛమైన స్థానిక భాషావాడకం, స్పందనల విస్తృతి, వాటి వ్యక్తీకరణల వినూత్నత... ఇవన్నీ కుప్పలు తెప్పలుగా కనపడతాయి అంటూనే, సిద్ధార్థ గత కవిత్వ సంపుటి 'దీపశిల'తో పోలిస్తే 'బొమ్మలబాయి'లో చిక్కదనం, సూటిదనం లోపించినట్లుగా ఉందనీ, అయినా తెలంగాణ కవుల్లో సిద్ధార్థ నిస్సందేహంగా మొదట పేర్కొనదగ్గ ప్రయోగశీల కవి అని చెబుతాడు. తాను Eliotలా రాయలనుకుంటే ఫర్వాలేదుగాని DylanThomasలా, John Berrymanలా రాయలనుకుంటే కవి సామాన్య పాఠకులకు దూరం కాక తప్పదని తనదైన ధోరణిలో సున్నితంగా హెచ్చరిక చేస్తాడు.

'డా. అమ్మంగి కవిత్వం, అనువాదాల గురించిన వ్యాసంలో, డా.ఎలనాగ తన అనువాద పటిమని' 'Faded Leaves and Fire Flies'లో చాలా చక్కగా ప్రదర్శించారని, 'దోమశకం' లోని వ్యంగ్య ధ్వనిని 'Mosquito Era' లోనూ, 'చెట్టు ఆత్మఘోష' లోని ఆర్తిని, ఆవేదనను 'The Soliloquy of a Tree' లోనూ, 'చివరియుద్ధం' లోని డిజిటల్ యుగపు భీభత్సాన్ని 'The Final Battle' లోనూ సంపూర్ణంగా పునఃసృజియించారని కొనియాడతారు. ఈ వ్యాసంలో భాష పుట్టుక, తెలుగు భాష ఆవిర్భావ వికాసాల గురించిన విషయాలు ఆలోచనీయంగా వున్నాయి.

21 వ్యాసాలున్న కథల విభాగం లో ఆయన 'మెతుకు కథలు' సంకలనానికి రాసిన ముందుమాట ఉంది. 'తెలంగాణ కథా సాహిత్యానికి పరిపుష్టి అందించిన రచయితలు ఇక్కడ గణనీయంగా ఉన్నారనటానికి ఈ సంకలనం నిదర్శనం' అంటూ తెలంగాణా సాహిత్య వికాసానికి అవరోధంగా నిలిచిన అంశాల్ని ఏకరువు పెడతారు. ఉప్పల నరసింహం 'మట్టిమనిషి' కథా సంపుటికి రాసిన ముందుమాటలో అతని కథన నైపుణ్యాన్ని పొగుడుతూనే ఇతివృత్త నిర్మాణంలో చాలా తీర్చికైన శైలి, కథన పద్ధతిని అవలంబించడం మూలాన కొన్ని కథలు పాత వాటిలాగా ముక్క వాసన వేస్తుంటాయి అంటారు లక్ష్మీపతి. 'అలుపెరుగని అక్షరశిల్పి' వ్యాసంలో పులికంటి కృష్ణారెడ్డి కథా సాహిత్యాన్ని, బహుముఖ ప్రజ్ఞను క్లుప్తంగా విశ్లేషించి 'పులికంటి సాహితీ సంస్కృతి' పేరు మీద ఉత్తమ సాహిత్యకారుల్ని సత్కరించడాన్ని కొనియాడతారు. 'కూరాడు' కథా సంకలనాన్ని వస్తువైవిధ్యంగల కథల సమాహారంగా విశ్లేషిస్తారు, 'నూనెసుక్క' కథా సంపుటి ముందుమాటలో కొట్టం రామకృష్ణారెడ్డిని Promising short story writer అని అభినందిస్తారు. డా.అయోధ్యరెడ్డి 'అక్కన్నపేట రైల్వేస్టేషన్' కథల్ని విశ్లేషిస్తూ అవి తెలంగాణ జీవితాన్ని చక్కగా పట్టుకున్న కథలనీ, రచయిత కథాశిల్పంపట్ల మంచి పట్టు ఉన్న కథకుడనీ పేర్కొంటూనే, చివర్న కథల్ని ట్రాజెడీగా ముగించే ఆబ్సెషన్‌ను అయోధ్యరెడ్డి వదులుకోవాలని సూచన చేస్తారు. శీలా వీర్రాజు కథల్లోని మనస్తత్వ చిత్రణని ఆకట్టుకునేలా వివరిస్తారు. ఈ విభాగంలోని '2008 కథాసాహిత్య సింహావలోకనం', 'ఆధునిక సాహిత్య ప్రక్రియగా కథ - సంవిధాన, ఉపాంగాల పరిచయం', 'క్రొంగొత్త రంగులు కలబోసిన కాన్వాసు: కథ - 2002', 'సమకాలీన తెలుగు కథ ప్రయోగాలు (2000-2010)', 'సాహిత్యం - వస్తుశైలీ శిల్పాల పరిశీలన', 'సాహిత్యం నీతిశాస్త్రానికి ప్రత్యామ్నాయం కాదు, అరాచకాన్ని ప్రోత్స హించకూడదు'... తదితర వ్యాసాలు రచయితలకు పాఠ్యాంశాల్లాంటివి. కథ నిర్వచనం, మంచి కథని తూచే ప్రాతిపదిక, వస్తువు, ప్లాట్, శైలి, శిల్పం , ప్రయోగం... గురించిన వివరణలు, కథానిర్మాణ క్రమంలోని దశల్ని సూచించే 'ఫ్రేట్యాగ్స్ ట్రయాంగిల్', సమీక్ష-విమర్శల మధ్య తేడా, ఇతర భాషాకథల క్లుప్త పరిచయం... తదితర అంశాలన్నీ మన రచయితల అవగాహనని పెంచే విధంగా వున్నాయి.

నవలల విభాగంలో రాసిన ఏడు వ్యాసాల్లో ముఖ్యంగా 'తెలంగాణ నవల - శిల్పం' లో తెలంగాణా నవలలని సబ్జెక్ట్ వారీగా విభజించి ఇక్కడి రచయితలు రియలిజానికి ప్రాధాన్యం ఇస్తారని తేలుస్తారు. జ్వాలాముఖి నవల 'వేలాడిన మందారం' తెలుగులో మరణశిక్ష రద్దు గురించి రాసిన మొదటి నవలగా పేర్కొంటారు. దీన్ని గంభీరమైన ఇతివృత్తంతో ఉత్కంఠభరితంగా సాగిన నవలగా అభివర్ణిస్తారు.

> రచయిత పాశ్చాత్య సాహిత్యాన్ని, విమర్శ గ్రంథాల్ని విరివిగా చదివి ఉండటమే కాక ఆ అధ్యయన ప్రభావంతో అలవడిన సరికొత్త చూపుతో తెలుగుసాహిత్యాన్ని విశ్లేషించేందుకు చేసిన ప్రయత్నం 'దిక్చక్రం' ప్రతి పేజిలో మనకు కనపడుతుంది.



గోపీచంద్ ప్రసిద్ధ తాత్విక నవలలు అసమర్థుని జీవ యాత్ర, మెరుపుల మరకలు, చీకటి గదులు ప్రత్యేకతను వివరిస్తారు. నవీన్ 'అంపశయ్య' సమస్యల వలయంలో చిక్కుకున్న ఒక యువకుని సంఘర్షణను చిత్రించి subjective mind and objective worldల మధ్య వుండే కార్యకారణ సంబంధ సార్వకాలీనతను స్ఫురింప చేస్తున్న నవలగా తెలుగు సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచి ఉంటుందంటారు. అసలు సమస్యను స్పృశించడమే రచయిత కర్తవ్యం అంటూ సలీం నవల 'వడగనీడ' గురించి రాస్తూ ఈ నవల మంచి రచయిత రాసింది అయినప్పటికి సమస్య అసలు మూలాల్ని స్పృశించని వెలితి ఈ నవలలో కొట్టొచ్చినట్టు కన్పిస్తుందని ఖరాఖండిగా చెబుతారు. మరో వ్యాసంలో, 'తానా' బహుమతి - 2017' అందుకున్న 'నీల', 'శప్తభూమి', 'ఒంటరి' నవలలపై న్యాయనిర్ణేతగా తన కామెంట్స్ రూపంలో క్లుప్తంగా విశ్లేషణ చేశారు. భాస్కరభట్ల కృష్ణరావు నవల 'వెల్లువలో పూచిక పుల్లలు'లో ఏ కోణంలో అస్తిత్వ వాద ఛాయలున్నాయో చెబుతారు.

14 వ్యాసాలుగా విస్తరించిన 'కొత్త రచనారీతులు, వాదాలు, తాత్విక ధోరణుల విశ్లేషణ' విభాగంలో విశ్వ సాహిత్యంలో అనేక మంది రచయితలు, అనేక ధోరణులకు సంబంధించిన వ్యాసాలు ఉన్నాయి. కాఫ్కా, బెకెట్, బోర్హెస్, కోర్తజార్, మార్క్వెజ్ వంటి ఆధునిక రచయితలపైన, మాజిక్ రియలిజం, ఎగ్జిస్టెన్షియలిజం తదితర అంశాలపై చాలా educativeగా , informativeగా రాశారు. 'దిక్చక్రం'కి ముందుమాట రాస్తూ కె. శివారెడ్డి 'ఆడెపు లక్ష్మీపతి గారు తెలుగు సాహిత్యానికి ఒక పెన్నిధి లాంటి అమూల్య గ్రంథాన్ని అందించారు' అన్న మాట అక్షరాలా నిజం.

■ బాణాల శ్రీనివాసరావు

✆ 94404 71423

తొలి గిరిజన కథకుడు భూషణం మాస్టారు కాదు

సువర్ణముఖి కథల మీద జూన్ 17 నాటి వివిధలో నాగరాజు గారు రాసిన వ్యాసం పరిపూర్ణంగా ఉంది. కానీ అందులో తొలి ఉత్తరాంధ్ర గిరిజన కథకులు అని భూషణం మాస్టారిని పేర్కొన్నారు. గిరిజన జాతుల జీవన సంస్కృతి, వారి పోరాటం, ఉద్యమ స్ఫూర్తితో ఉత్తరాంధ్ర గిరిజన కథ రాసిన భూషణం మాస్టారు తెలుగు కథ సాహిత్యంలో ఎప్పటికీ చిరస్మరణీయులే. కానీ దానికి ముందుగా తొలి గిరిజన కథ 'చెంచి'ను, ఆ రచయిత గూడూరు రాజేంద్రరావును కూడా మనం ఒక్కసారి మననం చేసుకోవాలి. ఇది ఆయన బొబ్బిలి సంస్థానంలో పని చేస్తున్నపుడు రాసిన కథ. అప్పటి పరిస్థితులు నేపథ్యంలో రాసిన కథ. నెల్లూరువాసి కావటంతో సహజసిద్ధంగా నెల్లూరు మాండలీకం వారి కథ నిండా అలుముకుంది. 1932 ఆగస్టు నెల భారతిలో 'చెంచి' కథ ప్రచురితమైన తర్వాత ఐదారు నెలలపాటు ఈ కథ మీద తెలుగు ప్రసిద్ధులందరూ చర్చించటం ఈ కథ విశేష స్థానాన్ని తెలియపరుస్తుంది. గిరిజన బతుకుల్లోని దైన్యస్థితిని, దోపిడీని, లైంగిక వేధింపులను, అప్పుల వాళ్ళ జలగ పీడనా సంస్కృతిని, చెంచి కథలో ప్రస్తావించారు.



రాజేంద్ర కథలే కాకుండా కవితలు నాటకాలు కూడా రచించారు. నెల్లూరు జిల్లా వాసి అయిన గూడూరు రాజేంద్రరావు నెల్లూరు విద్యాభ్యాసం అనంతరం మద్రాసులో ఎమ్మే చేస్తున్న రోజుల్లో షేక్స్పియర్ నాటకాలపై రాసిన విమర్శ ఆనాటి మద్రాస్ ప్రెసిడెన్సీ కాలేజీ ఆంగ్ల పండితుల అభిమానాన్ని పొందింది. వీరి ఆంగ్ల పాండిత్యాన్ని గమనించిన బొబ్బిలి రాజా తన సంస్థానంలో నియమించుకున్నారు. షేక్స్పియర్ మర్చంట్ ఆఫ్ వెనిస్‌లో షైలాక్ పాత్రను, వేదం వెంకటరాయ శాస్త్రి ప్రతాప రుద్రీయంలో ప్రతాపరుద్రుడుగాను ఇలా అనేక నాటకాల్లో నటించి కీర్తి పొందారు. 1904 సెప్టెంబర్ 25 తేదీన జన్మించిన వీరు 40 ఏళ్ల జీవిత కాలం పూర్తికాకుండానే 1945 జూలై 17వ తేదీ తనువు చాలించినా, తెలుగు కథా చరిత్రలో మర్చిపోలేని స్థానం పొందారు. ఆయన చెంచి కథ వెలువడి ఇప్పటికి 90 ఏళ్లు అయినప్పటికీ ఇంకా దానిపై పరిశోధనలు జరుగుతున్నాయి. వీరి రచనలు భారతి, శుభోదయం, స్వతంత్ర, జమీన్ రైతు పత్రికలలో 1932-40 ప్రాంతంలో విరివిగా వచ్చేవి. వీరికి ఏమాత్రం కీర్తి కండూతి లేకపోవటంతో, కేవలం సామాజిక నేపథ్యంలో వారు రాసిన కథలు చాలావరకు అందుబాటులో లేకుండా పోయాయి. వీరు నెల్లూరు, కడప, కర్నూలు, పెద్దాపురంలలో మున్సిపల్ కమిషనర్‌గా పనిచేయటం, బదిలీలు, పదోన్నతుల మధ్య జాగ్రత్త పరచలేకపోవటంతో వారి రచనలు చాలా వరకు వెలుగు చూడలేదని చరిత్రకారులు అభిప్రాయపడుతున్నారు.

■ ఈతకోట సుబ్బారావు

✆ 94405 29887

సింగిల్ పేజీ కథల పోటీ

వంశీ ఇంటర్నేషనల్ 52 ఏళ్ళు పూర్తి చేసుకున్న తరుణంలో సాహితీ కిరణం మాసపత్రిక సౌజన్యంతో సింగిల్ పేజీ కథల పోటీలు నిర్వహిస్తున్నది. మొదటి, రెండో, మూడో బహుమతులు వరుసగా రూ.5వేలు, రూ.3వేలు, రూ.2వేలు. కథ డిటిపిలో ఒక పేజీకి మించరాదు (ఫాంట్ 16, ఎ4 సైజ్ మాత్రమే). ఎంపిక చేయబడిన మరో 50కథలు అంటే మొత్తం 53 కథలను కలిపి వంశీ ఇంటర్నేషనల్ సంకలనంగా ప్రచురిస్తుంది. కథలు అందాల్సిన చివరి తేదీ జూలై 31. కథలు చేరాల్సిన చిరునామా: సాహితీ కిరణం, 11-13-154, అలకాపురి, రోడ్ నెం.3, హైదరాబాద్ - 500102. ఫోన్- 94907 51681.

పొత్తూరి సుబ్బారావు

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి అవార్డు

కె. శివారెడ్డి కవిత్వ స్ఫూర్తి అవార్డు'కు 2023వ సంవత్సరానికి గాను 'ఊహ చేద్దాం రండి' కవితా సంపుటి వెలువరించిన కవి దొంతం చరణ్ ఎంపికయ్యారు. ఆగష్టు 18న ఖమ్మంలో జరిగే కార్యక్రమంలో ఈ అవార్డు ప్రదానం జరుగుతుంది.

ఇబ్రహీం నిర్గుణ్

మా కథలు 2023

వేదగిరి రాంబాబు జయంతి సందర్భంగా, అక్టోబర్ 14న వెలువడనున్న మా కథలు 2023 సంకలనంలో ప్రచురణ కోసం 2023లో పబ్లిష్ అయిన కథలు పంపాలి. ఆఖరి తేదీ ఆగస్టు 15. చిరునామా: సి.హెచ్. శివరామ ప్రసాద్, కన్వీనర్, స్వగృహ అపార్ట్‌మెంట్, 'సి' బ్లాక్, జి-2, భాగ్యనగర్ కాలనీ, కూకట్‌పల్లి, హైదరాబాద్ - 500072. వివరాలకు ఫోన్: 9390085292.

శివరామ ప్రసాద్

కథలకు ఆహ్వానం

కస్తూరి మురళీకృష్ణ, కోడిహళ్ళి మురళీ మోహన్‌ల ఆధ్వర్యంలో ఈ దీపావళికి సైనికులు కథాంశంగా వెలువడనున్న కథా సంకలనంలో కోసం కథలను ఆహ్వానిస్తున్నాం. సైనికుల పోరాట పటిమను, కర్తవ్య దీక్షను, త్యాగనిరతిని, దేశభక్తిని విభిన్న కోణాలలో ప్రతిబింబం చేసే కథలు పంపాలి. ఇదివరకు పత్రికలలో ప్రచురితమైన కథలు కూడా పరిశీలిస్తాము. కొత్త కథలను సంచిక సాహిత్య వెబ్ పత్రికలో ప్రచురిస్తాము. కథలను అక్టోబర్ 31 లోగా చిరునామా: కస్తూరి మురళీ కృష్ణ, ఫ్లాట్ నెం.32, ఇం.నెం.8-48, రఘురాం నగర్ కాలనీ, దమ్మాయిగూడ, హైదరాబాద్ 500083కు లేదా ఈమెయిల్: sanchikastorycompilation@gmail.comకు పంపాలి.

కస్తూరి మురళీకృష్ణ

'కాలం కత్తి మొన మీద'

గార రంగనాథం కవిత్వ సంపుటి 'కాలం కత్తి మొన మీద' ఆవిష్కరణ సభ జూలై 28 ఉ.10గంటలకు విజయనగరం జిల్లా రాజాంలోగల విద్యానికేతన్ పాఠశాలలో పిల్లా తిరుపతి రావు అధ్యక్షతన జరుగుతుంది. సభలో బాల సుధాకర్‌మౌళి, సిరికి స్వామినాయుడు, కంచరాన భుజంగరావు అతిథులుగా పాల్గొంటారు.

రాజాం రచయితల వేదిక



డెలివరీ బాయ్

కాలంతో నువ్వో
నీతో కాలమో
తెలీదు కానీ
మీ పోటీ అబ్బుర పరుస్తుంది

సమస్త ప్రపంచాన్ని మోస్తూ నువ్వు
సకల వినిమయాన్ని కాంక్షిస్తూ నేను

నీ బిడ్డకు పాలు తాగిస్తావో లేదో కానీ
నా సుప్రభాతపు టీ/కాఫీ సేవనంలో
నువ్వు గుబాళిస్తావు
నువ్వు విసిరిన దిన పత్రికలో
ప్రపంచం మొత్తాన్ని దర్శిస్తాను
నీ బతుకు వెతను మాత్రం
పట్టనట్లు ఊరకుంటాను

"30 నిమిషాల్లో డెలివరీ లేకుంటే ఉచితం"

నా ఆర్డర్ నమోదవడమే ఆలస్యం
నువ్వక్కడ పరుగందుకుంటావు
ట్రాఫిక్ చిక్కుల్ని, రోడ్డు ప్రమాదాల్ని,
వాతావరణ భయాల్ని
ఛేదించే ప్రయత్నంలో నువ్వుంటే
నీ ఆలస్యంతో లభించే
ఉచితపు ఊహల్లో
నేను దొర్లుతుంటాను

నా జీవితపు ప్రతి సంతోష క్షణంలోను
నువ్వు వాహికవవుతావు
ఆహారం నుంచి దుస్తుల వరకు
ఎలక్ట్రానిక్స్ నుంచి కొత్తిమీరకట్ట వరకు
నా బతుకంతా నీ నెత్తినేసి
నేను బద్ధకాన్ని ఆహ్వానిస్తాను

నువ్వేమో బతుకుని కాలానికి కట్టి
గెలిచి నిలవాలని ఉరకలెత్తుతుంటావు
నా మోదం నీ ఖేదాల్ని గుర్తించదు

నీ పేరుతోనో, రూపుతోనో
మతాన్ని గుర్తించి అవమానించేందుకో
కుక్కల్ని వదిలేసి
నీ ప్రాణాలు తీసేందుకో
నేనస్సలు సిగ్గుపడను

నీ బతుకు భయం
మాకో ఆట లాగుంటుంది
కాలంతో జరిగే పోటీలో
నువ్వు జారిపడుతుంటావు
ఆసుపత్రిలోనో, ఆనక మార్చురీలోనో
తెల్లగుడ్డొకటి కప్పుకుంటావు

నువ్వు విద్యార్థివో
డ్రాపౌట్‌వో
నిరుద్యోగివో
రోగగ్రస్తుడివో
ఉద్యోగం పోగొట్టుకొని
రోడ్డున పడిన వాడివో
సంసార భారం మోసే కుటుంబ రావువో
చెల్లి పెళ్లి కోసమో, తల్లి వైద్యం కోసమో
రోడ్డెక్కిన త్యాగమయుడవో
ఎవరివో.... నువ్వెవరివో...

■ వి. ఆర్. తూములూరి

✆ 97052 07945

"నలభై ఏళ్ల నా సాహిత్య ప్రయాణానికి ఇదొక కనువిప్పు, కుదుపు!" - అఫ్సర్

"పొద్దుటి ఆహారంలో
రొట్టెను తాకగానే--
ప్రతి తునకలో గాజా కనిపిస్తోంది"

- ఇలా చిన్న చిన్న పద్యాల్లో గొప్ప భావసంచలనాన్ని దట్టించాడు అఫ్సర్. ఇటీవల రంజాన్‌కి 'Fasting hymns' పేరుతో రోజుకో పద్యం వంతున 30 పద్యాలు ప్రకటించాడు. ముస్లిం సమాజపు జీవన విధ్వంసాన్నీ దుఃఖాన్నీ, ఎదుర్కొంటున్న వివక్షనూ, యుద్ధం లోహపాదాల కింద నలుగుతున్న పాలస్తీనా కన్నీటినీ కవిత్వం చేశాడు. కవి లోతుగా గాయపడ్డ విషయానికి ప్రతి పద్యం సాక్ష్యం చెబుతుంది.

'ఉపవాస పద్యాలు' పేరుతో పి. శ్రీనివాస్ గౌడ్ అనువదించిన ఈ పద్యాలు రంగులకు అతీతంగా అందర్నీ చుట్టుకుంటాయి. సరళతను గాఢతను ఒకే దారంతో పేని అందించిన శ్రీనివాస్ గౌడ్ అనువాద ప్రతిభను అభినందించకుండా ఉండలేం. ఉపవాస పద్యాల పుట్టుక, మనుగడ, ప్రభావాల గురించి కవి, అనువాదకుడి మాటల్లోనే విందాం.

సాంబమూర్తి లండ

96427 32008

'Fasting Hymns' - ఎన్నాళ్ళుగానో గూడుకట్టుకున్న దుఃఖగీతాలుగా ఎందుకున్నాయి?

అనేక వ్యక్తిగత, సామాజిక అడ్డుగోడల వల్ల కొన్ని విషయాలు మనసు మూలల్లోనే వుండి పోతాయి. ఒక గట్టి సామాజిక సందర్భం వచ్చినప్పుడు వాటిని మనసు విప్పి చెప్పుకునే శక్తి రచయితకి వస్తుందేమో! రంజాన్ లాంటి పండగలు కేవలం ముస్లింల అనుభవం మాత్రమే కాదు. మన సమాజాల్లో అవి మతం అడ్డుగోడల్ని దాటి వచ్చిన సామరస్య సందర్భాలు. అయితే, ఒక డిసెంబర్ ఆరు తరవాత, మరో పాలస్తీనా విషాదం తరవాత ఆ పండగ నా లోపల చాలా దుఃఖాన్ని కూడా నింపింది. దాహార్తికి గుక్కెడు నీళ్ళు ఇస్తే పది పుణ్యాలు దక్కుతాయన్న విశ్వాసం రంజాన్ నెల. ఆ గుక్కెడు నీళ్ళు కూడా దొరక్క చనిపోతున్న పాలస్తీనా పసిపిల్లల ప్రాణాల గురించి ఆక్రోశంలో ఈ 'ఉపవాస పద్యాలు' పుట్టాయి. అవి పుట్టిన చరిత్రనీ, నేపథ్యాన్ని బట్టి చూస్తే, ఇవి రాజకీయ పద్యాలు అని వేరే చెప్పక్కర్లేదు కదా!




ఒక్కో పద్యంలో కవిగా మీరు తీసుకున్న ప్రత్యేక శ్రద్ధ గురించి చెప్పండి?

వీలైనంత సూటిగా, ఎలాంటి అలంకారాలూ లేకుండా, నిజానికి హైకూలు మాత్రమే రాయాలని మొదలు పెట్టాక, ఆ పరిమితుల్లో కొన్ని ఆలోచనలు ఇమడలేదు. మొదటి కవిత రాశాక మిత్రుడు అనంతు కొన్ని సూచనలు చేశారు. అదే సమయంలో శ్రీనివాస్ గౌడ్ స్పష్టత కోసం వేసిన ప్రశ్నలు నా వ్యక్తిగత పరిమితుల్ని దాటించడంలో ఉపయోగపడ్డాయి. అలా రాసే క్రమంలో వచ్చిన ప్రతి మార్పునూ నేను నిష్పూచీగా స్వీకరించాను. మరో మిత్రుడు ఎన్. వేణుగోపాల్ రాజకీయ అంశాల గురించి ఇంకా కొంచెం స్పష్టత రావాలని సూచించడంతో పాలస్తీనా గురించి చాలా చదవాల్సి వచ్చింది. ఇవన్నీ కవితలకి కొత్త రూపాన్ని ఇవ్వడంలో ఉపయోగపడ్డాయి. కవిత్వం అంటే మన లోపల మనం నలిగిపోవడం మాత్రమే కాదనీ, నలుగురినీ కలుపుకొచ్చే వాహిక అని ఇవి రాస్తున్నప్పుడు నాకు బాగా అర్థమైంది. పద్యాల అందం పద్యంలోనే కాకుండా, అవి సృష్టించే రాజకీయ సంభాషణల వల్ల చిత్రిక పెట్టుకుంటుందని తెలిసొచ్చింది. ఆ రకంగా గత నలభై ఏళ్ల నా సాహిత్య ప్రయాణానికి ఇదొక ఆశ్చర్యకరమైన కనువిప్పు, కుదుపు!

> కవిత్వం అంటే మనలోపల మనం నలిగిపోవడం మాత్రమే కాదనీ, నలుగురినీ కలుపుకొచ్చే వాహిక అని ఇవి రాస్తున్నప్పుడు నాకు బాగా అర్థమైంది. పద్యాల అందం పద్యంలోనే కాకుండా, అవి సృష్టించే రాజకీయ సంభాషణల వల్ల చిత్రిక పెట్టుకుంటుందని తెలిసొచ్చింది.

ఈ పద్యాలకు ముస్లిం సమాజం నుండి ఎటువంటి ప్రతిస్పందన వచ్చింది?

Fasting Hymns మొదట ఇంగ్లీషులో పెల్లుబికిన వాక్యాలు. అందువల్ల, ఇది ప్రపంచంలోని వివిధ భాషల వాళ్ళు, ముఖ్యంగా మిడిల్ ఈస్ట్ దేశాల వాళ్ళు, అమెరికాలోని సాహిత్య అభిమానులు విస్తృతంగా చదివారు. అవి రాస్తున్న క్రమంలోనే ఆయా భాషల్లోకి అనువాదం చేస్తామని వాళ్ళు అడిగారు. బహుశా, వచ్చే రంజాన్ నెలకి కనీసం పది భాషల్లో ఈ కవితలు వెలువడుతాయి. ముఖ్యంగా, అరబీ, ఫారసీ, హిబ్రూ భాషల్లో ఇవి త్వరలో రాబోతున్నాయి. ఈ అనుమతి కోరిన వాళ్ళు ఎక్కువగా ముస్లింలే అని చెప్పలేను. ముస్లిం వేదనని అర్థం చేసుకుంటూనో, లేకపోతే, ముస్లిం సమస్యల మీద పనిచేస్తున్న వాళ్ళు అనో చెప్పలేను. వాళ్ళల్లో ఎక్కువమంది సామాజిక సాంస్కృతిక శాస్త్రాల నిపుణులు. తెలుగు సమాజం కూడా ముస్లిం, ముస్లిమేతర అనే తేడా లేకుండా ఆ పద్యాల్ని అక్కున చేర్చుకుంది.శ్రీనివాస్ గౌడ్ ఎంతో శ్రద్ధతో వాటికి పుస్తక రూపం ఇచ్చాక, అవి ఎక్కువమందికి అందాయి.




"ముస్లిం సమాజ వేదనని ఒడిసిపట్టిన కవిత్వం"

పి. శ్రీనివాస్ గౌడ్

మీ ఇతర అనువాద సృజనతో పోలిస్తే 'ఉపవాస పద్యాలు' ఏవిధంగా విభిన్నం?

ముందు మూల రచన మన హృదయాలని కదిలించగలగాలి. అప్పుడే మనం దాని అనువాదానికి పూనుకుంటాం. ప్రపంచ వ్యాప్తంగా ముస్లిం సమాజం పట్ల ఇతర సమాజాలు వ్యవహరిస్తున్న తీరు పట్ల వేదన చెందిన కవికి రంజాన్ మాసం అనేది ఒక సందర్భం. నెపం. ఆ సందర్భాన్ని ఆసరా చేసుకొని ముస్లిం సమాజం పడుతున్న అనంత వేదనని, వాళ్ళు సామాజికంగా మారాల్సిన అవసరతను అల్పాక్షరాలలో ఒడిసిపట్టిన కవిత్వం ఇది. అందుకే వెంటనే అనువాదం చేసాను. ఇతర అనువాద రచనలు పుస్తకాలుగా రావలసివున్నా 'ఉపవాస పద్యాలు' ముందుగా రావడానికి ఆ పద్యాలకు వున్న తక్షణ అవసరత, తీక్షణత కారణం. ఇతర అనువాదాలకు ఇది ఏ విధంగా విభిన్నమంటే ఇవి వెంటనే ముస్లిం సమాజాలకు, మిగతా పౌర సమాజాలకు జాగు లేకుండా అందవలసినవి.



కొన్ని పదాల విషయంలో కొంచెం స్వేచ్ఛ తీసుకున్నట్టు అనిపించింది?


ఇవి ఇంగ్లీషులో వెలువడిన కవితలు. ముస్లిం పండుగల పారిభాషిక పదాలు అరబ్బీ భాషలో వుంటాయి. అందువల్ల వాటి అర్థాలు మిగతా వారికి అర్థం కావు. కాబట్టి అనువాదంలో మక్కీకి మక్కీ ఇవ్వడం వల్ల వాటి జీవం పోతుంది. కనుకే అవసరమయిన చోట తెలుగు/ అరబ్బీ పదాలు ఉపయోగించాను. అవసరమైన మేరకు ఫుట్ నోట్సు ఇచ్చాను.

అనువాదకుడిగా, కవిగా 'ఉపవాస పద్యాలు' మీకు ఎలాంటి సంతృప్తిని ఇచ్చాయి?

ఈ పద్యాలను చదివినప్పుడు హృదయం ద్రవించిన అనుభూతికి లోనయ్యాను. నా తక్షణ స్పందనగా వాటిని అనువాదం చేసాను. నేరుగా తెలుగు కవిత చదివిన అనుభూతిని ఇచ్చిందని పాఠకులు అనడం ఆ కవితలను అనువాదం చేసిన ఫలితాన్ని, సంతృప్తిని ఇచ్చింది. ఉపవాస పద్యాలు చదివిన దాన్ని బట్టి ఈ కవితల సారాన్ని ఏ ఒక్కరిలోనైనా ముస్లిం సమాజాన్ని చూసేవాళ్ళ దృక్పథంలో కించిత్ మార్పు వస్తే అది నిజమైన సంతృప్తి.



కృష్ణమ్మ పరుగులు






వర్షాలకు జిల్లాలోని వాగులు, ఏర్ల నుంచి వస్తున్న నీటితోనూ, ఎగువ ప్రాజెక్టుల నుంచి వదిలిన వరదతోనూ కృష్ణమ్మ గలగలా పారుతోంది. ప్రకాశం బ్యారేజీకి భారీగా నీరు చేరుతోంది. దీంతో అధికారులు బ్యారేజీ వద్ద 17 గేట్లను అడుగు మేర ఎత్తి 12,325 క్యూసెక్కుల నీటిని ఆదివారం సముద్రంలోకి వదిలారు.

కిక్కిరిసి..

- చివరి రోజు భారీగా తరలివచ్చిన భక్తులు
- ముగిసిన శాకంబరీ ఉత్సవాలు



దుర్గగుడిలో బారులు తీరిన భక్తులు



దుర్గామల్లేశ్వర స్వామి దేవస్థానంలో మూడు రోజుల పాటు నిర్వహించిన శాకంబరీ ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. ఈనెల 19వ తేదీన ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ ప్రాంగణాన్ని, దుర్గమ్మవారి మూల విరాట్, ఉపాలయాలనూ, దేవతల విగ్రహాలనూ... పండ్లు, కూరగాయలతో అలంకరించారు. ఈ ఉత్సవాల సందర్భంగా వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ప్రత్యేకంగా అందించిన కదంబ ప్రసాదాన్ని స్వీకరించి ఆనందించారు.

- వన్‌టౌన్

దర్శనం కష్టాలు

ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

- అన్ని మార్గాల్లో భక్తుల రద్దీ
- దర్శనానికి నాలుగు గంటలు
- వీఐపీ దర్శనాలతో సామాన్యులకు ఇబ్బందులు
- చేతులు ఎత్తేసిన సెక్యూరిటీ

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి వచ్చి భక్తులు ప్రత్యక్ష నరకాన్ని చూశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి చుక్కలు కనిపించాయి. ఆదివారం ఉదయం తొమ్మిది గంటలకు క్యూలైన్‌లోకి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి నాలుగు గంటలకుపైగా సమయం పట్టింది. ఇంద్రకీలాద్రిపై ఏది ప్రవేశ మార్గమో, ఏది బయటకు వెళ్లే మార్గమో తెలియలేదు. దేవస్థాన అధికారుల మధ్య సమన్వయం లేకపోవడం, సెక్యూరిటీ సిబ్బంది చేతులెత్తేయడంతో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు ఇక్కట్లు తప్పలేదు. చివరికి సహనం నశించిపోయిన భక్తులు అధికారులపై ధ్వజమెత్తారు. అక్కడే ఉన్న సిబ్బందిని నిలదీశారు. దీంతో సెక్యూరిటీ సిబ్బంది అక్కడి నుంచి వెళ్లిపోయారు.



రూ.500 దర్శనం వద్ద రాంగ్‌రూట్‌లో వెళుతున్న భక్తులు

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : ఇంద్రకీలాద్రిపై మూడు ఘట్టాలు ఒకేసారి వచ్చాయి. ఆదివారం గురుపౌర్ణమి. ఈనెల 19వ తేదీ నుంచి ఆలయంలో శాకాంబరీ ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాలను పూర్ణాహుతితో ముగించారు. ఈ రెండు కాకుండా కొద్దిరోజులుగా అమ్మవారికి మహిళలు భారీగా సంఖ్యలో ఆషాఢమాస సారె సమర్పిస్తున్నారు. వాళ్లంతా భక్త బృందాలుగా ఏర్పడికి ఇంద్రకీలాద్రికి చేరుకుంటున్నారు. గురుపౌర్ణమి, శాకాంబరీ ఉత్సవాల ముగింపు, సారె సమర్పణలు ఒకేసారి జరగడంతో భక్తులు లెక్కకు మించి వచ్చారు. ఈ మూడు అంశాలను అంచనా వేయడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఉత్తరాంధ్ర, రాయలసీమ, తెలంగాణ జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చారు.

రాకపోకలకు భక్తుల అవస్థలు

కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు కొండచరియలు విరిగి పడతాయన్న కారణంగా ఘాట్‌రోడ్డును అధికారులు పూర్తిగా మూసివేశారు. అధికారుల వాహనాలను, ఆలయ సిబ్బంది ద్విచక్ర వాహనాలను మాత్రమే పైకి అనుమతిస్తున్నారు. కాలినడకన వచ్చే భక్తులను నిలుపుదల చేశారు. దుర్గాఘాట్ వద్ద నుంచి దేవస్థాన బస్సుల్లో భక్తులను కొండపైకి తీసుకొస్తున్నారు. మరోపక్క కనకదుర్గ నగర్‌లో అభివృద్ధి పనులు సాగుతున్నాయి. దీంతో కనకదుర్గ నగర్ ఇరుకుగా మారింది. ఘాట్ రోడ్డును మూసివేయడంతో భక్తులకు కనకదుర్గ నగర్ మార్గంలోనే రాకపోకలు సాగించాల్సి వచ్చింది. ఈ మార్గంలో ఉన్న మహామండపం వద్ద లిఫ్టులు ఉన్నాయి. ఇక్కడి నుంచి వృద్ధులు, రూ.500 టికెట్ భక్తులను అనుమతిస్తామని బోర్డులు పెట్టారు. ఉచిత దర్శనం, రూ.100, రూ.300 దర్శనం భక్తులు క్యూలైన్ల నుంచి వెళ్లాలని మరో బోర్డు పెట్టారు.

క్యూలైన్లు కిటకిట

దర్శనానికి వచ్చే భక్తులు, సారె సమర్పించడానికి వచ్చిన భక్తులు క్యూలైన్లు నిండిపోవడంతో లిఫ్టుల వైపు వచ్చారు. దర్శనం పూర్తయిన భక్తులను తిరిగి లిఫ్టుల్లో తీసుకొచ్చి కింద వదిలారు. కొంతమంది భక్తులు మహామండపం మెట్లమార్గం నుంచి కిందికి దిగారు. ఈ భక్తులు బయటకు వెళ్లడానికి బారికేడ్లతో ఒక తాత్కాలిక క్యూను ఏర్పాటు చేశారు. దీనికి వ్యతిరేక మార్గంలో భక్తులు పైకి వెళ్లారు. లిఫ్టుల వద్ద, క్యూల్లో భక్తులు ఎక్కువగా ఉండడంతో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్త బృందాలు మెట్ల మార్గం నుంచి పైకి వెళ్లాయి. కిందికి దిగే భక్తులు, ఎక్కే భక్తులు ఈ మెట్ల నుంచి రావడంతో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి కనిపించింది. పాత మెట్ల నుంచి పూజ చేసుకుంటూ పైకి సారెతో వచ్చిన భక్తులు అక్కడున్న ఈవో కార్యాలయం వద్ద గూమిగూడిపోయారు. ఈ మార్గం మొత్తం ఆగిపోవడంతో పోలీసులు వారిని వెనక్కి తీసుకొచ్చి క్యూల్లోకి పంపాల్సి వచ్చింది. దర్శనం అయిన తర్వాత బయటకు వెళ్లాల్సిన భక్తులు గుడికి కుడివైపున ఉన్న మార్గం నుంచి బయట వెళ్లడానికి ప్రయత్నించారు. ఇక్కడ నుంచే వీఐపీ పేరుతో భక్తులు దర్శనానికి రావడం మొదలుపెట్టారు. ఇక్కడ గేటుకు సెక్యూరిటీ తాళాలు వేయడంతో భక్తులు నిలిచిపోయారు.



అంతరాలయం ముందు రాంగ్‌రూట్‌లో వెళుతున్న భక్తులు

అంచనాలో అధికారుల విఫలం

తాము గంటల తరబడి నిలబడితే వీఐపీ ముసుగులో ఎంతమందికి దర్శనాలు చేయిస్తారని క్యూల్లో ఉన్న భక్తులు ప్రశ్నించారు. దీంతో అక్కడున్న సెక్యూరిటీ సిబ్బంది వెళ్లిపోయారు. ఆలయానికి ఎదురుగా ఉన్న రాజగోపురం వద్ద భక్తులు భారీగా నిలిచిపోయారు. పోలీసులు, సెక్యూరిటీ నిలుపుదల చేసినా బారికేడ్లను దాటుకుని లోపలకు వెళ్లారు. అమ్మవారికి 12 గంటలకు ఇచ్చే నివేదన కారణంగా కొంతసేపు దర్శనాన్ని నిలుపుదల చేశారు. దీంతో భక్తుల సంఖ్య మరింతగా పెరిగిపోయింది. పరిస్థితిని అంచనా వేయడంలో అధికారులు విఫలమవ్వడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని భక్తులు విమర్శిస్తున్నారు. సెక్యూరిటీ సిబ్బంది విజిల్స్ చేయడం తప్ప భక్తులను క్రమపద్ధతిలో దర్శనానికి పంపలేదని ఆరోపించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలన్నా బేఖాతరు చేసి ఇతర శాఖలకు చెందిన ఉద్యోగులు తమ ఇష్టానుసారం రెవెన్యూలో పాతుకుపోయారు. తహసీల్దార్లు, ఆర్డీవోలుగా చెలామణి అవుతున్నారు. డబుల్ పదోన్నతులు అందుకుని మిగిలినవారి కంటే ఎక్కువ స్థానంలో ఉన్నారు. వీరివల్ల తమకు అన్యాయం జరుగుతోందని రెవెన్యూ ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో ఈ తరహాలో పలువురు తహసీల్దార్లు, ఆర్డీవోలుగా పనిచేస్తుండటం చర్చనీయాంశం అవుతోంది.

మేం కదలం!

10/99 రిక్రూట్‌మెంట్ వివాదంతో రెవెన్యూలో రచ్చ

- ఇతర శాఖల నుంచి వచ్చి ఉద్యోగులు రెవెన్యూలో తిష్ట
- ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పాగా
- రెండుచోట్లా పదోన్నతులతో ఆర్డీవోలుగా చెలామణి
- రెవెన్యూలో మొదటి నుంచి పనిచేస్తున్న వారికి అన్యాయం
- పాతుకుపోయిన వారికి ఫోకల్ పోస్టులు.. పనిచేసే వారికి నాన్ ఫోకల్ పోస్టులు
- వెళ్లిపోవాల్సిందేనని సుప్రీంకోర్టు ఆదేశించినా లెక్కచేయని పరిస్థితి
- ప్రభుత్వం దృష్టి పెడితేనే సమస్యకు పరిష్కారం



(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రెవెన్యూ శాఖలో అత్యంత వివాదాస్పదంగా మారిన 10/99 రిక్రూట్‌మెంట్ సందర్భంలో తలెత్తిన సమస్య ఇప్పటికీ రెవెన్యూ ఉద్యోగుల్లో చిచ్చు రేపుతూనే ఉంది. 1999లో రెవెన్యూలో ఖాళీలకు సంబంధించి ఇచ్చిన నోటిఫికేషన్ ప్రకారం చాలామంది ఆశావహులు పరీక్షలకు ప్రిపేర్ అయ్యారు. అప్పట్లో తగిన ఖాళీలు లేవన్న పేరుతో ఇతర శాఖలకు వెళ్లేందుకు ప్రభుత్వం అవకాశం కల్పించింది. దీంతో హయ్యర్ ర్యాంక్ కలిగిన వారంతా కోఆపరేటివ్, రిజిస్ట్రేషన్స్, ఎక్సైజ్, కమర్షియల్ టాక్సెస్ వంటి విభాగాల్లోకి వెళ్లారు.

కోర్టులో కేసు

రెవెన్యూలో తగినన్ని ఖాళీలు ఉన్నప్పటికీ తక్కువ సంఖ్యలో పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చారని పలువురు అప్పట్లో కోర్టులో కేసు వేశారు. ఈ క్రమంలో ఖాళీలు ఉన్నాయని అప్పటి ప్రభుత్వం కూడా కోర్టుకు నివేదించింది. దీంతో అప్పట్లో ఇతర డిపార్ట్‌మెంట్లకు వెళ్లిన వారంతా రెవెన్యూలోకి పలు దఫాలుగా వచ్చారు. ఇలా వచ్చినవారు గతంలో రెండు, మూడు పదోన్నతులు పొందినవారు కూడా ఉన్నారు. అక్కడ పదోన్నతులు అందుకోవటంతో పాటు ఆ స్థాయితో ఇక్కడ ఎక్కువ కేడర్‌లోకి ప్రవేశించారు. ఆ తర్వాత ఇక్కడ వచ్చిన పదోన్నతులతో కూడా పలువురు ఆర్డీవో క్యాడర్‌లో కొనసాగుతున్నారు. దీనివల్ల మొదటి నుంచి రెవెన్యూ శాఖలోనే పనిచేస్తున్న వారికి అన్యాయం జరుగుతోంది. ఇలా పైరవీలు చేస్తూ ఇక్కడే తిష్టవేసిన వారికి కోరుకున్న స్థానాలు కూడా దక్కుతున్నాయి. రెవెన్యూ గురించి అవగాహన, చట్టాల మీద పట్టు ఉన్నవారు నాన్‌ఫోకల్ పోస్టుల్లో కొనసాగుతున్నారు.

సుప్రీంకోర్టు ఆదేశాలు బేఖాతరు

ఇటీవలే సుప్రీంకోర్టు చాలా స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. గతంలో జరిగిన పొరపాట్ల కారణంగా తలెత్తిన గందరగోళాలను దృష్టిలో ఉంచుకుని మొదటిగా ఏ శాఖలో డిప్యూట్ అయ్యారో వారంతా తిరిగి వచ్చేయాలని, తమ శాఖల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. దీంతో కొంతమంది వెళుతున్నా.. ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల్లో పైరవీలు చేస్తున్నవారు మాత్రం కదలటం లేదు. కూటమి ప్రభుత్వం ఈ అంశంపై సీరియస్‌గా దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఎన్నో ఏళ్ల నుంచి అపరిష్కృతంగా ఉన్న సమస్యను పరిష్కరించేందుకు సుప్రీంకోర్టు అవకాశం కల్పించిన నేపథ్యంలో, ప్రభుత్వం కూడా తీర్పును గౌరవించేలా చర్యలు తీసుకోవటానికి వీలుగా ఆదేశాలను ఇవ్వాల్సిన అవసరం ఉంది.

కిడ్నీ వ్యాధితో ఇద్దరి మృతి



కనకపూడి దాసు   కనకపూడి భారతి

గంపలగూడెం, జూలై 21 : కిడ్నీ వ్యాధితో బాధపడుతూ ఆదివారం ఇద్దరు మృతి చెందారు. మండలంలోని అనుముల్లంక దళితవాడకు చెందిన కనకపూడి భారతి (58), కనకపూడి దాసు (52) పదేళ్లుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ విజయవాడలోని ప్రయివేటు వైద్యశాలలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించి మృతి చెందారు. భారతికి భర్త, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దాసుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. వారి మృతదేహాలను టీడీపీ నాయకుడు చిట్టిబొమ్మ నరసింహం, అత్తునూరు రామిరెడ్డి, అత్తునూరు అంజిరెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

పింకీ నెట్‌వర్క్ పెద్దదే...

తెలుగు రాష్ట్రాల్లో 50 మందికి పైగా సంబంధాలు

- అన్నీ గంజాయి బంధాలే
- లింక్‌లు లాగుతున్న టాస్క్‌ఫోర్స్

(ఆంధ్రజ్యోతి - విజయవాడ) విజయవాడ.. అవనిగడ్డ.. మచిలీపట్నం.. తాడేపల్లి.. మంగళగిరి.. ఈ ప్రాంతాలే కాదు రెండు తెలుగు రాష్ట్రాలను మల్లెతీగలా అల్లుకున్నాడు పింకీరౌత్. ఈ నెట్‌వర్క్ ద్వారా గంజాయిని కావల్సినంత మొత్తంలో సరఫరా చేశాడు. ఒడిస్సాలోని బరంపూర్‌కు చెందిన పింకీరౌత్ గ్యాంగ్‌ను విజయవాడ టాస్క్‌ఫోర్స్, యాంటీ నార్కోటిక్ సెల్ పోలీసులు అరెస్టు చేసిన విషయం తెలిసిందే. మొత్తం 15 నుంచి 90.05 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పింకీరౌత్ చిక్కడంతో అతడికి ఎక్కడెక్కడ గంజాయి నెట్‌వర్క్ ఉందన్న వివరాలను పోలీసులు లాగుతున్నారు. ఏడాది కాలంగా అతడు గంజాయి 'సాగు'లోకి దిగాడు. గిరిజనులకు పెట్టుబడి పెట్టి పంటను పండించడం, దాన్ని కొనుగోలు చేసి టీస్టాల్ ముసుగులో సరఫరా చేయడం మొదలుపెట్టాడు. పింకీరౌత్ కోసం విజయవాడ పోలీసులు కొన్ని నెలలుగా గాలిస్తూనే ఉన్నారు. ఎట్టకేలకు అతడు చిక్కడంతో ఎక్కడెక్కడ ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయో తేల్చే పనిలో పోలీసులు ఉన్నారు. పింకీరౌత్ సెల్‌ఫోన్ నంబర్‌ను సాంకేతికంగా విశ్లేషించారు. ఇందులో రెండు తెలుగు రాష్ట్రాల్లో 50 మందికిపైగా నంబర్లు ఉన్నాయని గుర్తించినట్టు సమాచారం. ఈ 50 మంది దఫదఫాలుగా పింకీరౌత్ నుంచి గంజాయిని కొనుగోలు చేశారు. ఒక్కొక్కరు నెలలో నాలుగు నుంచి ఐదుసార్లు సంభాషణలు జరిపినట్టు తేలింది. విజయవాడ, అవనిగడ్డ, మచిలీపట్నం, తాడేపల్లి, మంగళగిరి, గుంటూరు ప్రాంతాలకు చెందిన యువకులు పింకీరౌత్‌కు ఖాతాదారులుగా మారిపోయారు. దీంతోపాటు తెలంగాణలోని హైదరాబాద్, మేడ్చల్, మెదక్, రంగారెడ్డి జిల్లాల్లోని కొంతమంది నంబర్లు అతడి సెల్‌ఫోన్‌లో ఉన్నాయి. పోలీసులు ఇప్పటికే మేడ్చల్ జిల్లాకు చెందిన ఇద్దరు యువకులను అరెస్టు చేసి జైలుకు పంపారు. పింకీరౌత్ నెట్‌వర్క్‌లో ఉన్న వాళ్లందరిని అదుపులోకి తీసుకునే పనిలో టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఉన్నారు.

గ్రేడ్ 1 చెన్నైకు.. గ్రేడ్3 ఇక్కడికి

ఏడాది క్రితమే గంజాయి లావాదేవీల్లోకి దిగిన పింకీరౌత్ అనతికాలంలోనే ప్రముఖ డిస్ట్రిబ్యూటర్‌గా మారిపోయాడు. ఆంధ్రా ఒడిస్సా సరిహద్దుల్లో పోలీసులు చేరుకోలేని కొండ ప్రాంతంలో ఈ గంజాయి సాగును చేయిస్తున్నట్టు పోలీసులు గుర్తించారు. రెండు కొండలకు మధ్య ఉండే పోడు భూమిని చదును చేయించి గంజాయి గింజలను చల్లించేవాడు. కాపలాగా గిరిజనులను అక్కడే పెట్టేవాడు. వారికి అవసరమైన నిత్యావసర సరుకులను పింకీ సమకూర్చేవాడు. ఇక్కడ పండిన గ్రేడ్ 1 గంజాయిని చెన్నైకి పంపినట్టు సమాచారం. అక్కడి నుంచి ఈ గంజాయి నౌకల్లో శ్రీలంక, ఆఫ్రికా దేశాలకు వెళ్లినట్టు తెలిసింది. పంట చివరి దశకు వచ్చే సరికి ఉన్న గ్రేడ్ 3 గంజాయిని మాత్రం తెలుగు రాష్ట్రాల్లోని యువతకు విక్రయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. పింకీరౌత్ ఐదు దశల్లో గంజాయి నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నట్టు పోలీసులు గుర్తించారు. గంజాయి తాగడం అలవాటు పడిన దగ్గర నుంచి నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేసుకున్నాడు. సాధారంగా గంజాయికి అలవాటు పడినవారు చేతిలో డబ్బులు ఉన్నంత వరకు కొనుగోలు చేసి, ఎంజాయ్ చేస్తారు. డబ్బులు లేకపోయే సరికి వారు పెడ్లర్స్‌గా మారిపోతున్నారు. అప్పటి వరకు వారికి గంజాయిని సరఫరా చేసిన వ్యక్తులకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. వారితోపాటు గంజాయిని తీసుకురావడానికి వెళ్లినప్పుడు అక్కడున్న వారితో పరిచయాలు పెంచుకుంటున్నారు. తర్వాత ఏజెంట్‌గా మానేసి నేరుగా వాళ్లే వెళ్లి గంజాయిని కొనుగోలు చేస్తున్నారు. అక్కడి నుంచి తీసుకొచ్చి గ్రాముల లెక్కన ప్యాకెట్లలో యువతకు విక్రయిస్తున్నారు. ఇలా వ్యవహరించిన కొంతమంది నేరుగా పింకీరౌత్‌తో సంబంధాలు పెట్టుకున్నారు. అతడి నుంచే గంజాయిని కొనుగోలు చేసి సరఫరా చేయడం మొదలుపెట్టారు. కొంతమంది మాత్రం అతడికి సహాయకులుగా వ్యవహరించారు. వివిధ ప్రాంతాల నుంచి గంజాయి ఆర్డర్లు తీసుకుని అతడి వద్దకు వెళ్లేవారు. ఇలా చేసినందుకు జరిగిన వ్యాపారాన్ని బట్టి వారికి రౌత్ కమీషన్లు చెల్లించేవాడు. బరంపూర్ సరిహద్దుల్లో పింకీరౌత్ కోవకు చెందిన మరికొంతమంది ఉండొచ్చని టాస్క్‌ఫోర్స్ పోలీసులు భావిస్తున్నారు. పింకీ సెల్‌ఫోన్‌లో ఉన్న నంబర్ల వివరాలను ఆయా జిల్లాల్లోని పోలీసు అధికారులకు పంపుతున్నారు. ఈ నెట్‌వర్క్‌కు ఉన్న లింక్‌లను కత్తిరిస్తే ఎన్టీఆర్ జిల్లాలో గంజాయి గుప్‌గుప్‌లు ఉండవని అంచనా వేస్తున్నారు.

వైద్యం కోసం వచ్చి... రోడ్డు ప్రమాదంలో మృతి

ఆటోను అతివేగంతో ఢీకొట్టిన కారు

- ఇద్దరు మృతి..నలుగురికి తీవ్ర గాయాలు
- ఖమ్మంజిల్లా జగన్నాథపురంలో ఘటన
- మృతులు వత్సవాయి మండలం వాసులు

6లో..


వానలు తగ్గడంతో ప్రకాశం బ్యారేజీ వద్ద సెల్ఫీలు దిగుతున్న నగరవాసులు

తగ్గిన ముసురు

▸▸ జిల్లాలో 38 మి.మీ వర్షపాతం

విజయవాడ, జూలై 21(ఆంధ్రజ్యోతి) : గడచిన కొద్దిరోజులు జిల్లాను తడిపేస్తున్న వర్షం కాస్త తెరపు ఇచ్చింది. ఆదివారం జిల్లాలో చిరుజల్లులు కురిశాయి. జిల్లాలో అత్యధికంగా తిరువూరు మండలంలో 7.6 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. అత్యల్పంగా జి.కొండూరు, కంచికచర్ల, విజయవాడ రూరల్, తూర్పు, ఉత్తరం మండలాల్లో 0.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తిరువూరు 7.6, ఎ.కొండూరు 4.0, వత్సవాయి 3.6, గంపలగూడెం 3.4, విస్సన్నపేట 3.2, రెడ్డిగూడెం 2.6, మైలవరం 2.4, జగ్గయ్యపేట 1.6, పెనుగంచిప్రోలు 1.2, వీరులపాడు 1.2, చందర్లపాడు 1.0, నందిగామ 0.8, ఇబ్రహీంపట్నం0.8, విజయవాడ సెంట్రల్ 0.8, విజయవాడ పశ్చిమ 0.8, జి.కొండూరు 0.6, కంచికచర్ల 0.6 వర్షం కురిసింది. వర్షాలకు అంటువ్యాధులు ఎక్కడ ప్రబలుతాయోనని గ్రామీణ ప్రాంత ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వర్షాలకు విజయవాడ నగరంలో రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రయాణం నరకప్రాయంగా మారింది.


రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న రవీంద్రరాజు

పార్ట్ టైం అధికారుల గౌరవ వేతనం పెంచాలి

▸▸ గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు

కృష్ణలంక, జూలై 21 : రాష్ట్రంలోని పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారుల గౌరవ వేతనాన్ని రూ.4 వేలనుంచి 15వేలకు పెంచాలని కోరుతూ ఆదివారం రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను ఆయన కార్యాలయంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రవీంద్రరాజు మాట్లాడుతూ, పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారులకు రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు ఇచ్చి వారి కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. గత ప్రభుత్వంలో ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా తమ సమస్యలను పట్టించుకోలేదన్నారు. గత టీడీపీ హయాంలోనే వారికి రూ.4 వేల వేతనం ఇవ్వడం జరిగిందని, ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో వృద్ధాప్య, వితంతు, వికలాంగులకు రూ.4 వేలు, రూ.6 వేలు పెన్షన్ ఇస్తున్నందున 60 సంవత్సరాలు రైతులకు, ప్రజలకు సేవలందించిన రిటైర్ట్ పార్ట్ టైం గ్రామ రెవెన్యూ అధికారులకు కూడా గౌరవవేతనం రూ.4 వేల నుంచి 15 వేలకు పెంచాలని, అలాగే రేషన్, ఆరోగ్యశ్రీ కార్డులు మంజూరు చేయాలని మంత్రిని కోరారు. సానుకూలంగా స్పందించిన మంత్రి గ్రామ రెవెన్యూ అధికారులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు రవీంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు అప్పలనాయుడు, ఎం.బాహూజీ, అర్జునరావు, నళినీ, బాలాజీ రెడ్డి తదితరులున్నారు.

నూతన కార్యవర్గాల ఎన్నిక

సత్యనారాయణపురం, జూలై 21 : ఆంధ్రప్రదేశ్ వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం ఏకగ్రీవమైంది. అసోసియేషన్ కార్యవర్గ సమావేశం ఆదివారం హోటల్‌లో జరిగింది. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా చేజర్ల మారుతీచంద్ర(తాడేపల్లి), ఉపాధ్యక్షుడిగా గోలి ధనలక్ష్మి (గుంటూరు), ప్రధానకార్యదర్శిగా బర్రె హనీ ప్రవీణ్, (పాలకొల్లు), అదనపు కార్యదర్శిగా సిరాల చంద్ర (హిందూపురం), కోశాధికారిగా జ్ఞానసాగర్ (విజయవాడ), వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గంగూలి సుందరశేఖర్ (జంగారెడ్డిగూడెం), ఎగ్జిక్యూటివ్ మెంబర్‌లుగా రవితేజ, యోనా, ఎస్.నాగేశ్వరరావులు ఎన్నికయ్యారు. నూతన అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, ఉద్యోగులకు అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వార్డు వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు పాల్గొన్నారు.

అగ్రి ఇన్‌పుట్స్ మాన్యుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్



అగ్రి ఇన్‌పుట్స్ మానుఫ్యాక్చర్స్ అండ్ మార్కెటింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. స్థానిక హోటల్‌లో జరిగిన కార్యవర్గ సమావేశంలో కమిటీ గౌరవాధ్యక్షుడిగా సి.పీటర్‌పాల్, అధ్యక్షుడిగా ఎ.నాగేశ్వరరావు, కార్యదర్శిగా పొట్లూరి కృష్ణప్రసాద్, సంయుక్తకార్యదర్శిగా ఎ.హరికృష్ణ, ఉపాధ్యక్షులుగా జి.జగదీష్, కోశాధికారిగా ఎం.మోహనరావు ఎన్నికయ్యారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

అండర్-11 చెస్ విజేతలుగా కార్తికేయ, గుణశ్రీ

విజయవాడ స్పోర్ట్సు, జూలై 21 : ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గుడివాడలో ఆదివారం జరిగిన కృష్ణాజిల్లా అండర్-11 బాలబాలికల చెస్‌టోర్నీలో ఎం.కార్తికేయ 5 పాయింట్లతో విజేతగా నిలవగా, బి.వరుణ్‌తేజ్ 4 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచారు. బాలికల విభాగంలో వై.గుణశ్రీ 4 పాయింట్లతో విజేతగా, టి.ప్రణీత 3 పాయింట్లతో రన్నరప్ సాధించారు. తొలి 2స్థానాల్లో నిలిచిన బాలబాలికలను భీమవరంలో ఈనెల 27, 28న జరిగే రాష్ట్రస్థాయి చెస్ టోర్నీకి కృష్ణా నుంచి ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అసోసియేషన్ సెక్రటరీ ఎన్ఎం ఫణికుమార్ తెలిపారు. విజేతలకు బహుమతుల ప్రదానంలో లయన్స్ క్లబ్ ఆఫ్ గుడివాడ చైర్మన్ వి.కృష్ణకిషోర్, ప్రెసిడెంట్ వి.సతీష్‌బాబు ట్రెజరర్ టీవీఎస్ ప్రసాద్, సెక్రటరీ వేణుగోపాలస్వామి, టోర్నీ చీఫ్ ఆర్బిటర్ సుమన్, గన్నవరం చెస్ మేనేజర్ ఆనంద్ పాల్గొని అందజేశారు.

వైద్యం కోసం వచ్చి.. రోడ్డు ప్రమాదంలో మృతి

● ఇద్దరు మృతి..నలుగురికి తీవ్ర గాయాలు ● మృతులు వత్సవాయి మండల వాసులు

చింతకాని (ఖమ్మం), జూలై 21: వైద్యం కోసం ఖమ్మం వచ్చి...చికిత్స అనంతరం ఇంటికి తిరిగి వెళ్తుండగా అనుకోకుండా వచ్చిన ప్రమాదంతో ఇద్దరు మృతి చెందిన ఘటన మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామ సమీపంలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...ఎన్‌టీఆర్ జిల్లా వత్సవాయి మండలం కన్నెవీడు గ్రామానికి చెందిన కరిసే సుజాత అనారోగ్యంతో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం కుటుంబ సభ్యులు ఆమెను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి రెండు రోజుల క్రితం తీసుకొచ్చారు. చికిత్స అనంతరం ఆదివారం కుటుంబ సభ్యులు అందరూ ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. జగన్నాథపురం గ్రామం దాటిన తరువాత వారు ప్రయాణిస్తున్న ఆటోను అతివేగంతో వచ్చిన కారు బలంగా ఢీకొనడంతో ఆటో రోడ్డుకు ఓ వైపు ఎగిరిపడి తీవ్రంగా ధ్వంసమైంది. ప్రమాద దాటికి ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురు చెల్లా చెదురుగా పడిపోయారు. స్థానికులు ఘటనపై పోలీసులకు సమాచారం ఇవ్వడంతో చింతకాని ఎస్ఐ నాగుల్‌మీరా ఘటన ప్రాంతానికి చేరుకుని సిబ్బంది, స్థానికుల సహాయంతో క్షతగాత్రులను 108 వాహనంలో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కారు ఆటోను బలంగా ఢీకొనడంతో ఆటోలో ఉన్న కరిసే వెంకటరత్నం (50) ఘటన స్థలంలో మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన చెరుకుపల్లి హైమావతి (45) 108 వాహనంలో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందింది. ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురికి తీవ్రగాయాలైవని. ప్రమాదంలో మృతిచెందిన వెంకటరత్నం, హైమావతి వరుసకు అన్నాచెల్లెల్లు. మృతుడు కన్నెవీడు సొసైటీలో గుమస్తాగా పనిచేస్తున్నాడు. ఘటనాస్థలాన్ని సీఐ సాగర్ సందర్శించారు.



హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మోహన్, జస్టిస్ జ్యోతిర్మయిలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు




కొండంత భక్తితో..

▸▸ ఆషాఢ పౌర్ణమికి పోటెత్తిన భక్తజనం ▸▸ కిటకిటలాడిన కీలాద్రి


భక్తజనంతో కిటకిటలాడిన ఆలయ ప్రాంగణం

వన్‌టౌన్, జూలై 21 : ఆషాఢ పౌర్ణమి.. ఆదివారం శాకంబరీ ఉత్సవాల ముగింపు సందర్భంగా ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానం భక్తజనంతో కిటకిటలాడింది. ఉదయం నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. పౌర్ణమి కావడంతో భక్తులు వివిధ ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. దంపతులు ఖడ్గమాలపూజల్లో పాల్గొన్నారు. చండీహోమం తదితర ఆర్జిత సేవల్లో తరించారు. వివిధ ప్రాంతాలనుంచి పెద్ద సంఖ్యలో భక్త బృందాలు కోలాహలంగా అమ్మవారికి సారె సమర్పించారు. భక్తుల రద్దీ నియంత్రించేందుకు ఈవో, అధికారులు, సిబ్బంది చర్యలు తీసుకున్నారు. విశాఖపట్నం కనకమహాలక్ష్మి ఆలయ ఏఈవో రాంబాబు అమ్మవారికి సారె సమర్పించారు. శాకంబరీ ఉత్సవాలు ముగియడంతో అమ్మవారికి సమర్పించిన పండ్లు, కూరగాయలను భక్తులకు పంపిణీ చేశారు. సకల జనులు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆదివారం పండితులు సూర్యోపాసన సేవ, ఆదిత్యునికి అర్చనలు చేశారు. అరుణ పారాయణ, తర్పణ చేశారు.



దుర్గమ్మ సేవలో హైకోర్టు న్యాయమూర్తులు

హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ కృష్ణ మోహన్, జస్టిస్ వి.జ్యోతిర్మయిలు వారి కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం దుర్గమ్మను దర్శించుకున్నారు. వారికి అధికారులు ఆలయ మర్యాదలు అందచేశారు. దర్శనం అనంతరం వారికి ప్రసాదం, శేషవస్త్రం, ఆశీస్సులు, అమ్మవారి చిత్రపటం అందచేశారు.

వేడుకగా.. దుర్గమ్మ గిరి ప్రదక్షిణ



దుర్గమ్మ గిరి ప్రదక్షిణ ఆదివారం భక్తజనోత్సాహంతో వేడుకగా సాగింది. వానలు పడుతుండటంతో ప్రచార రథంతో గిరిప్రదక్షణ సాగింది. ఘాట్ రోడ్డు టోల్‌గేట్ వద్ద రథనికి బలిహరణలు ఇచ్చారు. ప్రచారరథంలో దుర్గమ్మవారికి లఘుపూజ చేసి హారతులు సమర్పించారు. ఈవో రామారావు దంపతులు, ఈఈ కోటేశ్వరరావు, ముఖ్య అర్చకుడు శ్రీనివాస శాస్త్రి, ఆలయ ఏఈవోలు, ఉద్యోగులు పాల్గొన్నారు. తప్పెట వాయిద్యాలు, కోలాటాలు, భక్తజన జేజేల మధ్య ప్రచార రథం గిరి ప్రదక్షిణ సాగింది.

తిరుపతమ్మ ఆలయంలో..



పెనుగంచిప్రోలు : పెనుగంచిప్రోలు తిరుపతమ్మ దేవస్థానంలో శాకంబరి ఉత్సవాన్ని ఆదివారం శోభయామానంగా నిర్వహించారు. తిరుపతయ్య, గోపయ్య స్వాములతోపాటు సహదేవతల విగ్రహాలను ఆలయ ప్రధాన అర్చకుడు మర్రిబోయిన గోపి బాబు ఆధ్వర్యంలో అర్చకులు పలురకాల పూలు, పండ్లతో అలంకరణ చేశారు. శాకంబరీ అలంకరణలో అమ్మవారిని తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ డిప్యూటీ కలెక్టర్ కె.రమేష్ నాయుడు, ధర్మకర్తల మండలి ఛైర్మన్ జంగాల శ్రీనివాసరావు, వాసులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వీరమ్మ తల్లి కరుణా కటాక్షాలతో..



ఉయ్యూరు : వీరమ్మ తల్లి కరుణా కటాక్షాలు, దయతో రాష్ట్రం, ప్రజలకు మేలు జరగాలని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఆషాడమాసం, వ్యాసపూర్ణిమ పురస్కరించుకుని ఉయ్యూరులో వీరమ్మతల్లికి ఎమ్మెల్యే బోడె ప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్‌తో కలిసి ఆదివారం ఆషాడమాస సారె సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, వీరమ్మతల్లి చల్లని దయ, సాయిబాబ ఆశీస్సులతో అందరూ సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించామన్నారు. ఉయ్యూరు ఛైర్మన్ వల్లభనేని సత్యనారాయణ, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విరాళం ఇవ్వగానే కార్డు..

విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : దుర్గామల్లేశ్వరస్వామి ఆలయానికి విరాళాలు ఇచ్చిన దాతలకు జారీ చేసే డోనర్ కార్డును వెంటనే ఇవ్వాలని అధికారులు నిర్ణయించారు. దీనికి ఆదివారం నుంచి శ్రీకారం చుట్టారు. అమ్మవారికి విరాళాలు ఇచ్చిన దాతలకు ఆలయ అధికారులు డోనర్ కార్డును జారీ చేస్తారు. ఈ కార్డును ఉపయోగించుకుని వారు అమ్మవారి దర్శనం చేసుకునే అవకాశం ఉంటుంది. విరాళం ఇచ్చిన వారం రోజులకు ఈ కార్డును దాతల చిరునామాకు పంపుతారు. ఈ సంప్రదాయానికి అధికారులు స్వస్తి చెప్పారు. ఇక నుంచి విరాళం ఇవ్వగానే కార్డును వారికి అందజేయాలని సంకల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఈవో రామారావు డోనర్ సెల్ ఛాంబర్‌లో ఆదివారం ప్రారంభించారు.

లభ్యంకాని ఎంపీడీవో ఆచూకీ

▸▸ కొనసాగుతున్న గాలింపు చర్యలు

ఉంగుటూరు/హనుమాన్‌జంక్షన్/పెనమలూరు, జూలై 21 : నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు ఆచూకీకోసం గన్నవరం, ఉంగుటూరు, బాపులపాడు మండలాల పరిధిలో ఏపీఎస్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, క్విక్‌రియాక్షన్‌టీమ్, పోలీస్‌బృందాలు సంయుక్తంగా ఏలూరుకాలువలో చేపట్టిన గాలింపు చర్యలు ఆదివారం కొనసాగాయి. గన్నవరం డీఎస్పీ ఆర్‌జీ జయసూర్య ఆధ్వర్యంలో ఆయా బృందాలు బోట్లు, పడవలు, డ్రోన్లసాయంతో గన్నవరం మండలం కేసరపల్లినుంచి ఉంగుటూరు మండలం తేలప్రోలు వరకు ఏలూరు కాలువతోపాటు బుడమేరును జల్లెడపట్టాయి. ఉంగుటూరు ఎస్సై రవిచంద్రకుమార్ సిబ్బందితో దావాజిగూడెం వంతెననుంచి చినవుటపల్లి వంతెన వరకు ఏలూరుకాలువ రెండువైపులా వున్న గట్ల వెంట గాలించారు. ఆత్కూరు ఎస్సై పైడిబాబు సిబ్బంది, ఇతర సహాయక బృందాలతో కలిసి పెదఅవుటపల్లినుంచి తేలప్రోలు వరకు బోటు సాయంతో ఏలూరుకాలువను రెండువైపులా జల్లెడపట్టారు. బాపులపాడు మండలం ఎ.సీతారాంపురం నుంచి పెరికీడు వంతెన వరకు వీరవల్లి ఎస్సై చిరంజీవి నేతృత్వంలో ఎస్డీఆర్ఎఫ్ సిబ్బందితో గాలింపు చర్యలు చేపట్టారు. గన్నవరం డీఎస్పీ జయసూర్య పర్యవేక్షణలో హనుమాన్‌జంక్షన్ సీఐ నవీన్‌నరసింహమూర్తి బృందం ఏలూరు పడమట లాకులు వరకు గాలించింది. ఎంపీడీవో ఆచూకీ దొరికేంతవరకు గాలింపుచర్యలు కొనసాగుతాయని పోలీసు ఉన్నతాధికారులు చెప్పారు. గన్నవరం, బాపులపాడు సీఐలు కేవీఎస్ వరప్రసాద్, ఏ.నవీన్‌నరసింహమూర్తి, గన్నవరం, ఉంగుటూరు, ఆత్కూరు, ఎస్సైలు శివప్రసాద్, రవిచంద్రకుమార్, పైడిబాబు, పాల్గొన్నారు. జంక్షన్ సర్కిల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్సైలు, సిబ్బంది, పెదపాడు ఎస్సై శుభశేఖర్ పాల్గొన్నారు.


వీరవల్లి వద్ద ఏలూరు కాలువలో గాలింపు

కుటుంబసభ్యులకు ఎస్పీ పరామర్శ

కొద్ది రోజులుగా అదృశ్యమైన నరసాపురం ఎంపీడీవో మండవ వెంకట రమణారావు కుటుంబసభ్యులను కృష్ణా జిల్లా ఎస్పీ గంగాధర్‌రావు ఆదివారం పరామర్శించారు. ఆయన భార్య, కుమారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కానూరులో ఎంపీడీవో ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో మాట్లాడారు.

ఇతర రాష్ట్రాల్లోనూ దర్యాప్తు..

మచిలీపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : పశ్చిగోదావరి జిల్లా నరసాపురం మండలం ఎంపీడీవో మండవ వెంకటరమణ ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. ఎస్పీ ఆర్ గంగాధరరావు ఆదివారం పెనమలూరు సమీపంలోని కానూరులోని ఎంపీడీవో ఇంటికి వెళ్లి ఎంపీడీవో కుటుంబసభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. ఇదిలా ఉంటే ఎంపీడీవోకు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన కొంతమంది సైబర్ నేరగాళ్లు ఫోన్‌లు చేసి ఆయన బ్యాంకు ఖాతాలనుంచి నగదు మార్పించుకున్నట్టుగా పోలీసుల విచారణలో వెల్లడైంది. ఈ వివరాలను ఆధారంగా చేసుకు బీహార్, జార్ఖండ్, ఒరిస్సా రాష్ట్రాలకు జిల్లాపోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి వెళ్లారు. ఈ కేసుతో సంబంధం ఉన్న నిందితులను గుర్తించి అదుపులోకి తీసుకునే పనిలో జిల్లా పోలీస్ బృందాలు ఉన్నట్టు సమాచారం. ఎంపీడీవో అదృశ్యం వెనుక సైబర్ నేరగాళ్ల ప్రమేయం ఉంటుందని, ఆయనను పదేపదే సైబర్ నేరగాళ్లు బెదిరించి నగదును తమఖాతాలకు మళ్లించుకున్నట్టుగా పోలీసులు చెబుతున్నారు. ఈ కేసులో పాత్ర ఉన్న సైబర్‌నేరగాళ్లు పోలీసులకు చిక్కితే ఎంపీడీవో అదృశ్యం కేసు కొంతమేర కొలిక్కివచ్చేందుకు ఆధారాలు లభ్యమయ్యే అవకాశం ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. నరసాపురం ఎంపీడీవో తరహాలోనే మరికొందరు అధికారులకు సైబర్ నేరగాళ్లు ఫోన్‌చేసి నగదు గుంజినట్టు పోలీస్ అధికారులు చెబుతున్నారు. ఈ కేసులో మరిన్ని వివరాలు రాబట్టే దిశగా పలు కోణాల్లో దర్యాప్తును వేగవంతం చేశారు.

వసతి గృహం నుంచి బాలిక అదృశ్యం

▸▸ మహిళా, విద్యార్థి సంఘాల ఆందోళన

పాయకాపురం, జూలై 21 : పాయకాపురం రాధానగర్‌లోని బాలికల వసతి గృహం నుంచి ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఇంటి నుంచి వసతి గృహానికి వచ్చిన 24 గంటల్లోనే విద్యార్థిని కనిపించకపోవడంపై తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. నున్న రూరల్ పోలీసులు బాలిక తల్లిదండ్రుల నుంచి ఫిర్యాదు తీసుకుని కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం.. కొండపల్లికి చెందిన విద్యార్థిని(16)నగరంలోని రాధానగర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతూ కళాశాల ప్రక్కనే ఉన్న వసతి గృహంలో ఉంటున్నది. అనారోగ్య కారణాల వలన వారం క్రితం కొండపల్లిలోని ఇంటికి వెళ్లి శనివారం ఉదయం తిరిగి హాస్టల్‌కు వచ్చింది. మధ్యాహ్నం వసతి గృహంలో భోజనం చేసి కళాశాలకు వెళ్తున్నట్టు చెప్పి బయటకు వెళ్లింది. సాయంత్రం 6 గంటలలోగా వసతి గృహానికి రావాల్సి ఉండగా విద్యార్థిని రాత్రి 8 గంటలైనా రాకపోవడంతో సిబ్బంది విద్యార్థిని తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. బంధువుల ఇంటికి గాని, స్నేహితులతో గాని వెళ్లిందని భావించి మరుసటి రోజు ఆదివారం వరకు ఎదురు చూశారు. బాలిక రాకపోవడంతో విషయం తెలుసుకున్న పలు విద్యార్థి సంఘాల నాయకులు వసతి గృహం వద్దకు చేరుకున్నారు. వార్డెన్‌ను పోలీసులకు ఫిర్యాదు చేయకపోవడంపై ప్రశ్నించారు. తమ కుమార్తె కనిపించకుండా పోవడానికి వసతి గృహం సిబ్బంది, వార్డెన్‌ల నిర్లక్ష్యమే కారణమని ఆరోపించారు. నున్న రూరల్ సీఐ దుర్గాప్రసాద్ మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిత్య పెళ్లికొడుకు అరెస్టు

▸▸ మ్యాట్రిమోని ద్వారా మహిళలకు వల



విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి) : మ్యాట్రిమోని వెబ్‌సైట్లలో మారు పేర్లతో ప్రొఫైల్ అప్‌లోడ్ చేసుకుని ఒంటరి మహిళలకు వల వేసిన నిత్య పెళ్లికొడుకును గవర్నరుపేట పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కందుకూరుకు చెందిన తుమ్మా మోహన్‌రెడ్డి కొన్నేళ్ల క్రితం భార్య పిల్లలను వదిలేశాడు. వ్యవసనాలకు అలవాటు పడ్డాడు. షేర్‌మార్కెట్‌లో షేర్లు కొనడం, అమ్మడం చేసేవాడు. ఇందులో డబ్బులు భారీగా కోల్పోయాడు. తర్వాత డబ్బులు సంపాదించడం కోసం నిత్య పెళ్లికొడుకు అవతారం ఎత్తాడు. తెలుగు మ్యాట్రిమోని, షాదీ.కామ్ వంటి వెబ్‌సైట్లలో వివిధ రకాల పేర్లతో ప్రొఫైల్ అప్‌లోడ్ చేశాడు. ఇందులో విడాకులు తీసుకున్న, భర్త చనిపోయిన మహిళలను టార్గెట్ చేసుకున్నాడు. వారితో పరిచయం పెంచుకుని ప్రేమ, పెళ్లి పేరుతో మోసం చేసేవాడు. విజయవాడకు చెందిన ఓ మహిళతో ఈవిధంగా పరిచయం పెంచుకున్నాడు. తన పేరు కార్తీక్ అని, సాఫ్ట్‌వేర్ ఉద్యోనని నమ్మించాడు. సొంతంగా విల్లాలు ఉన్నాయని ప్రగల్భాలు పలికాడు. ఏడాదికి రూ.45లక్షల వేతనం వస్తుందని వివరించాడు. ఇద్దరం పెళ్లి చేసుకుందామని, తాను విజయవాడకు వస్తున్నానని హోటల్‌లో కలుద్దామని చెప్పాడు. ఆభరణాలు ఏమైనా ఉంటే తెచ్చుకుని అలంకరించుకుని ఇద్దరం కలిసి తీయించుకున్న ఫొటోను తల్లిదండ్రులకు చూపించి ఒప్పిస్తానని నమ్మించాడు. ఏప్రిల్ నెలలో గవర్నరుపేట పీఎస్ పరిధిలోని ఒక హోటల్‌కు రప్పించుకున్నాడు. ఆమె స్నానం చేయడానికి వెళ్లిన సమయంలో 16 తులాల బంగారు ఆభరణాలు, ఫోన్, స్కూటర్ కాజేశాడు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసు కమిషనర్ ఆదేశాల మేరకు ఈస్ట్ జోన్ డీసీపీ గౌతమి శాలి పర్యవేక్షణలో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సౌత్ జోన్ ఏసీపీ జి.రత్నరాజు ఆధ్వర్యంలో సీఐ రమణ, ఎస్సై నారాయణమ్మ సిబ్బంది రెండు బృందాలుగా నిందితుల కోసం గాలించి, గవర్నరుపేట దున్నావారి వీధిలో అరెస్టు చేశారు. నిందితుడు గత ఏడాది నవంబరులో గుంటూరులో ఇదే తరహా కేసులో ఒక మహిళ నుంచి ఏడు లక్షలు తీసుకుని పారిపోయాడు. అదే నెలలో తెలంగాణలో ఒక మహిళ నుంచి 25 తులాల బంగారం తీసుకుని పారిపోయాడు. గత ఏడాది జనవరి నెలలో ఒక మహిళ వద్ద నుంచి క్రెడిట్ కార్డు ద్వారా రూ. 6లక్షలు వాడుకుని మోసం చేశాడు. 2021 డిసెంబర్ నెలలో ఒక మహిళను మోసగించి ఆమె కారును తీసుకుని ఉడాయించాడు. నిందితుడిపై గుంటూరు దిశ పీఎస్, తెలంగాణలోని కందుకూరు, మార్కెట్ పీఎస్, మియాపూర్, పోలీస్‌స్టేషన్లలో కేసులు ఉన్నాయి.

ఘనంగా తంగిరాల స్మారక పురస్కారాల వేడుక


విజయవాడ కల్చరల్: తంగిరాల కృష్ణప్రసాద్ స్వాతంత్రోద్యమంలో పాల్గొని చేసిన పోరాటం మరువలేనిదని మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు అన్నారు. తంగిరాల మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గవర్నరుపేటలోని ఠాగూర్ లైబ్రరీ హాల్లో ఆదివారం సాయంత్రం స్వతంత్ర సమరయోధులు తంగిరాల కృష్ణప్రసాద్ 25వ స్మారక రంగస్థలం పురస్కారాల ప్రదానం ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కృష్ణప్రసాద్ గొప్ప నటుడని, సురభి నాటకాలు సమాజానికి మరింత అవసరమని, అవి మరిన్ని రావాల్సిన అవసరం ఉందని కాంక్షించే వారన్నారు. కామ్రేడ్ జీఆర్‌కే పోలవరపు సంస్కృతిక సమితి అధ్యక్షుడు గోళ్ల నారాయణరావు మాట్లాడుతూ 25ఏళ్లుగా కృష్ణప్రసాద్ వారసులు ఆయన పేరిట పురస్కారాలు అందించి కళాకారులను గౌరవించడం అభినందనీయమన్నారు. 25వ స్మారక పురస్కారం సుఖమంచి కోటేశ్వరరావుకు ప్రదానం చేసి సత్కరించారు. రచయిత కవి తంగిరాల చక్రవర్తి సమతా సేవా సమితి కార్యదర్శి చింత వెంకటేశ్వర్లు, రమ్య భారతి ఎడిటర్ చలపాక ప్రకాష్, ఠాగూర్ లైబ్రరీ గ్రంథాలయ అధికారి కె.రమాదేవి, జొన్నలగడ్డ వాణి వెంకట రవి కుమార్, అడుసుమిల్లి సరస్వతి సీతారాచచంద్రమూర్తి పాల్గొని డాక్టర్ జీవీ పనుచంద్, జె.పరశురామయ్య, నవ్వులూరు రమేష్‌బాబు, దాసరి అల్వార్ స్వామి, అవనిగడ్డ పున్నారావు, బోయిన వెంకటేశ్వరరావు, డాక్టర్ డి.శమంతకమణి, పొత్తూరు సుబ్బారావు, టీవీ చంద్రశేఖర్, కోన వీరబ్రహ్మం, డాక్టర్ కె.పూర్ణచంద్రరావు, బి.ఆంజనేయ రాజు, వీఎస్ బోస్, వి.పట్టాభిరామకోటేశ్వరరావు వంటి 25మంది కళాకారులకు పురస్కారం ప్రదానం చేశారు.

21.5 కిలోల గంజాయి స్వాధీనం

విద్యాధరపురం, జూలై 21 : పాడేరు నుంచి గంజాయిని అక్రమంగా తీసుకువచ్చి విక్రయిస్తున్న భవానీపురం పోలీసుకాలనీకి చెందిన పెయ్యావుల తరుణ్‌కుమార్ అలియాస్ పండు (25)ను టాస్క్‌ఫోర్సు పోలీసులు అరెస్టు చేశారు. అతని నుంచి 21.500 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై ఇప్పటికే భవానీపురం పోలీసుస్టేషన్‌లో గంజాయి అక్రమ రవాణా, దొంగతనాలు, పోక్సో కేసులు నమోదయ్యాయి. నిందితుడు అతడి స్నేహితులు మరో ముగ్గురితో కలిసి పాడేరు నుంచి గంజాయిని తెచ్చి అమ్ముతున్నాడు. పోలీసులు నిఘా పెట్టి అరెస్టు చేశారు.

డివైడర్‌ను ఢీకొన్న కారు

▸▸ పలువురికి స్వల్ప గాయాలు



పెనుగంచిప్రోలు, జూలై 21 : 65వ నెంబర్ జాతీయ రహదారిపై మండలంలోని తోటచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో తెలంగాణ రాష్ట్రంలోని సూర్యపేటకు చెందిన పాలకుర్తి వెంకటేశ్, మందస్సు వేణు, తన్నీరు రాజు, వామన శ్రీధర్‌లకు స్వల్ప గాయాలయ్యాయి. సేకరించిన సమాచారం ప్రకారం.. సూర్యపేటకు చెందిన వెంకటేశ్, వేణు రాజు, శ్రీధర్ తదితరులు అరుణాచలం వెళ్లి కారులో స్వామివారిని దర్శించుకుని తిరిగి వెళ్తుండగా, ఆదివారం సాయంత్రం తోటచర్ల క్రాస్ రోడ్డు వద్ద ఐరన్ డబ్బాలను కారు ఢీకొంది పక్కనే ఉన్న డివైడర్‌కు తగలటంతో కారు ముందు భాగం కొంత మేర దెబ్బతింది. వారికి స్వల్ప గాయాలుకాగా 108 అంబులెన్స్‌లో నందిగామ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	118, 127, 138
చికెన్ విత్ స్కిన్	224
చికెన్ స్కిన్‌లెస్	234

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.30


కొండ ప్రాంతంలో సదుపాయాలు కల్పిస్తాం

మాచవరం, జూలై 21: కొండ ప్రాంతంలో అన్ని సదుపాయాలు కల్పిస్తామని, స్థానికులకు అండగా ఉంటామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ హామీ ఇచ్చారు. 6వ డివిజన్ రావిచెట్టు సెంటర్ వద్ద సాగర్ అనే వ్యక్తి ఇంటి పునాదులు నాని జారిపోయాయి. ఆ ప్రాంతాన్ని ఆదివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఇంటి మరమ్మతుల నిమిత్తం రూ. 10 వేలు సాగర్ కుటుంబానికి అందజేశారు. కొండ ప్రాంతాల్లో ప్రమాదాలు జరగకుండా రక్షణ చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు.


రావిచెట్టు సెంటర్‌లో సాగర్ కుటుంబానికి రూ.10 వేలు అందజేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్


కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలో ప్రత్యేక అలంకరణలో సాయిబాబా


నాగార్జుననగర్ సాయిమందిరంలో..


సాయి ప్రేమిమండలి ఆధ్వర్యంలో కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లో..


మధురానగర్ ఓంకారక్షేత్రంలో పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బొండా ఉమా


గొల్లపూడి హోల్‌సేల్ మార్కెట్ వద్ద దూండీ రాకేశ్ తదితరులు

నగరంలో గురుపౌర్ణమి వేడుకలు

భక్తులతో సాయిబాబా మందిరాలు కిటకిట

చిట్టినగర్, జూలై 21: గురుపౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం నెహ్రూబొమ్మ సెంటర్‌లోని ప్రశాంత నిలయంలో, చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలోని షిరిడీసాయి మందిరంలో, గొల్లపాలెంగట్టు ప్రాంతంలోని షిరిడీసాయి మందిరంలో, పాల ఫ్యాక్టరీ వద్ద సాయిబాబా మందిరంలో బాబాకు ప్రత్యేక పూజలు చేశారు. కొత్తపేట కేబీఎన్ కళాశాల ఎదురుగా ఉన్న గంగానమ్మ దేవస్థానంలో షిరిడి సాయిబాబాను పండ్లతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు.

బాబా గురుపీఠానికి ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట: లెనిన్ సెంటర్‌లోని షిరిడి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో సుధాస్వామి ఆధ్వర్యంలో సాయిబాబా గురుపీఠానికి ప్రత్యేక పూజలు చేశారు. 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి బాబాకు హారతి ఇచ్చారు. భారీ అన్నదానం నిర్వహించారు. బీసెంట్ రోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ప్రత్యేక పూజలు చేశారు. సీతారామపురం షిరిడి సాయిబాబా మందిరంలో టీడీపీ ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షుడు గొర్రి శ్రీనివాసచక్రవర్తి ఆధ్వర్యంలో పూజలు చేశారు.

గద్దె క్రాంతి ప్రత్యేక పూజలు

కృష్ణలంక: నెహ్రూనగర్ డొంకరోడ్డులోని షిరిడి సాయిబాబా మందిరంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తనయుడు గద్దె క్రాంతికుమార్ సాయినాథుడికి ప్రత్యేక పూజలు చేశారు.

ఓంకారక్షేత్రం షిరిడి సాయిబాబా మందిరంలో..

మధురానగర్: ఫ్లైవోవర్ దిగువన ఉన్న ఓంకార క్షేత్రం షిరిడి సాయిబాబా మందిరంలో నిర్వహించిన పూజల్లో ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు, ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు పాల్గొన్నారు. సుప్రభాత సేవ, కాగడా హారతి, గణపతి పూజ, పంచామృతాభిషేకం, అలంకరణ, నీరాజనం, మంత్రపుష్పం, ప్రత్యేక అర్చనలు నిర్వహించారు. సాయిపథం రచయిత హిందీ, ఇంగ్లీషు అనువాదకుడు డాక్టర్ మరింగంటి లక్ష్మణాచార్యులు, ఏపీ మాజీ లా సెక్రటరీ సి.దుర్గాప్రసాద్, గుళ్లపల్లి నారాయణరావులు చైతన్య రథయాత్రలో పాటలు ఆలపించారు. 5వేల మందికి అన్నప్రసాద వితరణ చేశారు. మాజీ కార్పొరేటర్ నరసింహచౌదరి పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గంలో..

వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని షిరిడి సాయి మందిరాల్లో పూజలు, అన్నవితరణ కార్యక్రమాలను నిర్వహించారు. గొల్లపూడి మహాత్మాగాంధీ హోల్‌సేల్ మార్కెట్లోని సాయిబాబా మందిరంలో టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేశ్ పూజలు చేశారు. అన్నవితరణ కార్యక్రమంలో పాల్గొన్నారు. మార్కెట్ కమిటీ అధ్యక్షుడు పరుచూరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కాసుల నారాయణ, కోశాధికారి నంబూరి సాంబశివరావు, ఆర్యవైశ్య నాయకుడు వీవీకే నరసింహరావు, జాలాది వెంకటేశ్వరరావు, దర్శి సుబ్బారావు, నంబూరి ప్రదీప్, తాతా శ్రీనివాసరావు పాల్గొన్నారు. కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లో డొక్కా సీతమ్మ స్ఫూర్తితో పెద్దపూడి వెంకటరావు ఆధ్వర్యంలో అన్నవితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా 52వ డివిజన్ కార్పొరేటర్ ఉమ్మడి వెంకటేశ్వరరావు(చంటి) పాల్గొన్నారు. కృష్ణవేణి హోల్‌సేల్ మార్కెట్‌లోని సాయిబాబాగుడిలో సాయి ప్రేమీ మండలి ఆధ్వర్యంలో ఉదయం కాకడ హారతి ఇచ్చారు. పంచామృత అభిషేకాలు, పూజలు చేశారు. సాయంత్రం ధూప్ హారతి సమర్పించారు. రాత్రి సేజ్ హారతితో పూజలను ముగించారు. అన్నవితరణ చేశారు. బొందిలి ఖాజా సింగ్, సుంకర రాంబాబు, కామరాజు హరీష్‌కుమార్, చంద్రమౌళి, చంద్రమోహన్, పృథ్వీ, కృష్ణవేణి క్లాత్ మార్కెట్ అధ్యక్షుడు బచ్చు ప్రసాద్ పాల్గొన్నారు.

కంసాలిపేటలో..

పాత రాజరాజేశ్వరిపేట: విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో కంసాలిపేటలోని సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకల్లో టీడీపీ నేత ధనేకుల సుబ్బారావు పాల్గొన్నారు. మందిరంలో 500 మందికి అన్న సంతర్పణ చేశారు. సాయంత్రం స్వామిని వీధుల్లో ఊరేగించారు.

హెచ్‌బీ కాలనీలో 6వేల మందికి అన్నదానం

భవానీపురం: హెచ్‌బీ కాలనీ సంకల్పసిద్ధి షిరిడి సాయిబాబా మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బూర్లె వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో అన్నాభిషేకం చేశారు. 6వేల మందికి అన్నదానం చేశారు. సాయంత్రం కేరళ బృంద వాయిద్యాలు, తీన్‌మార్ డప్పుల నడుమ హెచ్‌బీ కాలనీ వీధుల్లో బాబా ఊరేగింపు నిర్వహించారు.

గురునానక్ కాలనీలో..

భారతీనగర్: గురునానక్‌కాలనీలోని సాయిమందిరంలో ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. నాగార్జుననగర్ కాలనీలోని సాయిధ్యాన మందిరంలో గురుపౌర్ణమి వేడుకలు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్వామికి పంచామృతాలతో అభిషేకాలు చేశారు. మూడు వేల మందికి అన్నదానం చేశారు.

గురు విశ్వస్ఫూర్తి కుటుంబం ట్రస్టు ఆధ్వర్యంలో..

మొగల్రాజపురం: పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో గురు విశ్వస్ఫూర్తి కుటుంబం ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన గురు పౌర్ణమి వేడుకల్లో ముఖ్య అతిథిగా బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు వేముల హజరత్తయ్య గుప్తా పాల్గొన్నారు. కేఎల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ భమిడిపాటి ఉమానాథ శర్మ, మాంటిస్సోరి కళాశాల అధ్యాపకులు కోట కామేశ్వరరావు, సిద్ధార్థ పబ్లిక్ స్కూలు ఉపాధ్యాయురాలు చెరువు రాజరాజేశ్వరి పాల్గొన్నారు.

చేనేత వస్త్ర ప్రదర్శనలో సందడే సందడి

● నేటితో ముగియనున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ


ప్రదర్శనలో చీరలు కొనుగోలు చేస్తున్న మహిళలు

విజయవాడ: చేనేత వస్త్ర కళాకారులు తయారుచేసి స్వయంగా ప్రదర్శనకు ఉంచడంతో పాటు తగ్గింపు ధరల్లో విక్రయాలు జరుపుతున్న ఇండియన్ సిల్క్ గ్యాలరీ సందర్శకులతో కిటకిటలాడుతోంది. లబ్బీపేట లోని ఏ కన్వెన్షన్‌లో నిర్వహిస్తున్న ఈ ప్రదర్శన సోమవారంతో ముగియనుంది. దేశంలోనే ఖ్యాతి గాంచిన చేనేత సిల్క్ ఉత్పత్తులు ఇందులో మహిళలను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. చందేరి, కోల్‌కతా, ఉప్పాడ జమ్దాని, వెంకటగిరి, పోచంపల్లి ఇక్కత్, ఛత్తీస్‌గఢ్ తాసర్, గద్వాల, మంగళగిరి, భగల్పూర్ సిల్క్స్, బెంగాల్ సిల్క్ గుజరాత్ డిజైనర్ సిల్క్ చీరలతో పాటు మహిళల డ్రెస్ మెటీరియళ్లు, గృహోపకరణాలు అందుబాటులో ఉన్నాయి. పెళ్లి చీరలతో పాటు రాబోయే వరలక్ష్మీ వ్రతాల కోసం ప్రదర్శనలో మహిళలను ఇట్టే ఆకట్టుకునే ఎన్నోరకాల వస్త్రాలున్నాయని, స్టాళ్లలో సందర్శకులు కిక్కిరిసిపోతున్నారని, ప్రదర్శన సోమవారంతో ముగుస్తుందని నిర్వాహకుడు వై.శ్రీనివాసరావు తెలిపారు. ప్రదర్శన చివరిరోజున ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు అందుబాటులో ఉంటుందని తెలిపారు.

స్మార్ట్ విజన్‌లో అధునాతన లేజర్ మిషన్ ప్రారంభం


మాట్లాడుతున్న స్మార్ట్ విజన్ ఆస్పత్రి వైద్యురాలు స్వాతిమణి

మాచవరం, జూలై 21: నగరంలోని స్మార్ట్ విజన్ ఆస్పత్రిలో అధునాత లేజర్ మిషన్‌ను ఆదివారం ప్రారంభించారు. ఆస్పత్రి ఆవరణలో విలేకరుల సమావేశంలో డాక్టర్ ఎం.స్వాతిమణి మాట్లాడారు. నూతన స్మైల్ ప్రో మిషన్‌ను దేశంలో 5వ మిషన్‌గా ఆస్పత్రిలో ప్రారంభించడం గర్వ కారణంగా ఉందన్నారు. ఎనిమిది సెకన్లలో కంటి చికిత్సలను నూతన మిషన్‌తో చేయొచ్చని ఆమె తెలిపారు. యువతకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. 18 నుంచి 40 ఏళ్ల వయస్సు వారికి కళ్లజోడు లేకుండా చిన్న అక్షరాలను సైతం చదవగలుగుతున్నారన్నారు. దూర ఉన్న వస్తువులను ఎటువంటి ఇబ్బంది లేకుండా లేజర్ చికిత్స చేయించుకున్న వారు చూడగలుగుతున్నారని తెలిపారు. ఐటీ, స్పోర్ట్స్ రంగాల్లో పనిచేసేవారికి ఈ లేజర్ చికిత్స ఎంతగానో ఉపయోగపడుతుందని, మైనస్ పవర్ సరిచేయడానికి, కచ్చితమైన ఫలితాలకు ఈ "స్మైల్ ప్రో" మిషన్ దోహదం చేస్తుందని స్వాతిమణి పేర్కొన్నారు.

ఘనంగా గురుపరాగ మహోత్సవం

విజయవాడ కల్చరల్, జూలై 21: వైదిక యజ్ఞం, శ్రీ శ్రావ్య నర్తన కూచిపూడి నృత్యాలయం, శ్రీ సిద్ధేంద్ర యోగి డాన్స్ అకాడమీ, శ్రీ లలిత డాన్స్ అకాడమీల ఆధ్వర్యంలో సత్యనారాయణపురం ఘంటసాల ప్రభుత్వ సంగీత కళాశాలలో గురుపౌర్ణమిని పురస్కరించుకుని గురపరాగ మహోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. బిస్మిల్లాఖాన్‌యువ పురస్కార అవార్డు గ్రహీత డాక్టర్ చింతా రవి బాల కృష్ణ శిష్యబృందం 52 మంది 5 బృందాలుగా ప్రదర్శించిన కూచిపూడి నృత్యాలు అలరించాయి. చింతా రవిబాలకృష్ణను శిష్యులు సత్కరించారు.

శాస్త్రీయ సంగీత పోటీల విజేతలకు అభినందన

విజయవాడ కల్చరల్, జూలై 21: శాస్త్రీయ సంగీత పోటీల విజేతలు విద్వాంసులుగా కీర్తి గడించాలని ఏపీ జెన్కో ఎండీ కేవీఎన్ చక్రధరరావు అన్నారు. సుబ్రహ్మణ్య మహతి సంగీత సమితి నిర్వహించిన శాస్త్రీయ సంగీతం(గాత్రం, సంగీత లయ వాయిద్య) పోటీల్లో విజేతలు గాత్రంలో ఆయుషి, కార్తీక మనస్విని, యోగప్రియ, సంస్కృతి, రత్నాకర్, సాయిశ్రీవాణి, వయోలిన్‌లో లాస్య ప్రియన, ఆయుషి, దుర్గాసాహితి, శ్రీహర్ష, సంతోష్ ద్వయం, వేణు వాద్యంలో వనమాలి, వీణవాద్యంలో ఉమామహేశ్వరి, శ్రీనిధి, శివప్రియ-జయశ్రీ ద్వయం, మృదంగంలో లక్ష్మీ అజయ్‌లకు నిర్వహించిన అభినందన సభలో ఆయన మాట్లాడారు. రామకోటి శ్రవణ సదన కళావేదికపై ఆదివారం బహుమతి ప్రదానం చేశారు. గాత్ర సంగీత విద్వాంసుడు మోదు మూడి సుధాకర్, సమితి చైర్మన్ డాక్టర్ మన్నం గోపీచంద్, ఘంటసాల సంగీత నృత్య కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణవేణి, ఎంసీ దాసు పాల్గొన్నారు. విజేతలు సంగీత స్వరలయ ప్రదర్శనతో ఆహూతులను ఆకట్టుకున్నారు.

ముగిసిన శాకంబరీ ఉత్సవాలు

చిట్టినగర్, జూలై 21: కొత్తపేట, చిట్టినగర్ పరిసర ప్రాంతాల్లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న శాకంబరీదేవి ఉత్సవాలు ఆదివారంతో ముగిశాయి. చివరి రోజు గురుపౌర్ణమి కావడంతో దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. చిట్టినగర్ మహాలక్ష్మీ అమ్మవారిని పండ్లు, ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు. కుంకుమార్చనలు విశేష పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచే వేలాదిగా భక్తులు ఆలయానికి తరలివచ్చారు. కొత్తపేట గంగానమ్మ ఆలయంలో గంగానమ్మ, మంగళగౌరి, శాంభవి అమ్మవార్లను పండ్లు, కూరగాయలతో అలంకరించి విశేషపూజలు చేశారు. పాలఫ్యాక్టరీ సమీపంలోని విజయదుర్గా రామలింగేశ్వరస్వామి, పంచముఖ ఆంజనేయస్వామి దేవస్థానంలో విజయదుర్గఅమ్మవారిని ఆకుకూరలు, కూరగాయలతో అలంకరించారు.

శాకంబరీదేవిగా అన్నపూర్ణ, రాజరాజేశ్వరి

గవర్నర్‌పేట: చల్లపల్లి బంగ్లా సమీపంలోని కాశీ విశ్వేశ్వర అన్నపూర్ణ దేవస్థానంలో అన్నపూర్ణ అమ్మవారు శాకంబరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆషాఢ సారెను భక్తులు సమర్పించారు. ప్రత్యంగిరా, భగళాముఖీ వారాహీ, మహా మంత్రములతో కూడిన పంచదశీ మహావిద్య హోమం, చండీ హోమం నిర్వహించారు.

పటమట: దర్శిపేటలో రాజరాజేశ్వరి శ్రీ లలితా పరమేశ్వరి అమ్మవారి ఆలయంలో అమ్మవారు శాకంబరీదేవిగా దర్శనమిచ్చారు. రామలింగేశ్వర్‌నగర్, పటమటలంక ప్రాంతాల నుంచి అమ్మవారి బోనాలు సమర్పించారు. ఆవుల నరసయ్య, పోతంశెట్టి నాగేశ్వరరావు, యామా శివన్నారాయణ, తాండవ రంగలక్ష్మి, కాల్వ ప్రసాద్ పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి కృపతో సుఖసంతోషాలతో ఉండాలి

సత్యనారాయణపురం: కన్యకాపరమేశ్వరి అమ్మవారి కృపతో ప్రజలంతా సుఖసంతోషాలతో, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు కోరుకున్నారు. జీఎస్‌రాజు రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు ఆదివారం నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌ను కూరగాయలు, పండ్లతో అలంకరించారు. ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. దేవస్థానం పక్కనే నిర్మిస్తున్న అమ్మవారి కల్యాణ మండపాన్ని బొండా ఉమా సహకారంతో త్వరలోనే అందుబాటులోకి తెస్తామని కమిటీ చైర్మన్ తుమ్మలపెంట శ్రీనివాసులు తెలిపారు. కమిటీ కోశాధికారి శివ సురేంద్ర, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


చిట్టినగర్‌లో మహాలక్ష్మి


చల్లపల్లి బంగ్లా సమీపంలో అన్నపూర్ణదేవి


దర్శిపేటలో రాజరాజేశ్వరి

ఘనంగా అమరావతి కార్, ఏసీ టెక్నీషియన్స్ అసోసియేషన్ వార్షికోత్సవం

పటమట, జూలై 21: బెంజిసర్కిల్ సమీపంలోని ఓ కన్వెన్షన్ హాల్లో ఆదివారం అమరావతి కార్, ఏసీ టెక్నీషియన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రెండో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అసోసియేషన్ వర్క్‌షాపు నిర్వహణకు తమకు ఒక కన్వెన్షన్ హాలు కేటాయించాలని తీర్మానించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు తనయుడు గద్దె క్రాంతి హాజరై సభ్యులు చేస్తున్న కార్యక్రమాలను అభినందించారు. అసోసియేషన్ అధ్యక్షుడు అబ్దుల్ సమీ, ఉపాధ్యక్షుడు వీవీ అప్పారావు, కార్యదర్శి ఎస్కే సాదిక్, కోశాధికారి అజయ్‌కుమార్, ఫౌండర్ ఎండీ ఇబ్రహీం ఆధ్వర్యంలో సభ్యులకు ఎల్ఐసీ బాండ్లను అందజేశారు.

యువతి ఫొటోలు షేర్ చేసిన వ్యక్తిపై కేసు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 21: ఓ యువతి ప్రైవేట్ ఫొటోలను షేర్ చేసిన వ్యక్తిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. అజిత్‌సింగ్‌నగర్ ప్రాంతానికి చెందిన యువతి(21) నగరంలోని ఓ ప్రైవేట్ కంపెనీలో పని చేస్తుంది. అదే ప్రాంతానికి చెందిన అభిజిత్‌తో ఆమెకు పరిచయం ఏర్పడింది. యువతికి తల్లిదండ్రులు వేరే వ్యక్తితో పెళ్లి కుదిర్చారు. నిశ్చితార్థం జరిగింది. ఆ యువతి ప్రైవేట్ ఫొటోలను అభిజిత్ కాబోయే భర్తకు షేర్ చేశాడు. దీంతో యువతి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డుపైకి మురుగు రానీయొద్దు

అజిత్‌సింగ్‌నగర్, జూలై 21: వర్షాలు కురుస్తున్నందున రోడ్లపైకి మురుగునీరు రాకుండా చూడాలని అధికారులకు ఇన్‌చార్జ్ కమిషనర్ ఎ.మహేష్ సూచించారు. అజిత్‌సింగ్‌నగర్‌లోని తోటవారి వీధిలో ఆదివారం ఆయన పర్యటించారు. కొన్ని ప్రాంతాల్లో రోడ్డు లెవల్ కన్నా యూజీడీ మ్యాన్‌హోల్స్ పైకి ఉండటాన్ని ఆయన గమనించారు. మ్యాన్‌హోల్స్‌ను రోడ్డు లెవల్‌కు వచ్చేలా మరమ్మతులు చేయాలని ఆదేశించారు. కాలువల్లో చెత్త వేయకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన ఆదేశించారు.

ఆరోగ్య పరిరక్షణకు వ్యాయామం తప్పనిసరి

పాయకాపురం, జూలై 21: మారిన ఆహారపు అలవాట్లతో ఆరోగ్యానికి ముప్పు వాటిల్లుతోందని, ఆరోగ్యాన్ని పరిరక్షించుకోవడం కోసం ప్రతి ఒక్కరూ కనీస వ్యాయామం చేయాలని డాక్టర్ గోపాళం శివన్నారాయణ సూచించారు. ప్రజా ఆరోగ్య వేదిక, జన విజ్ఞాన వేదిక కమిటీల ఆధ్వర్యంలో లహరి విద్యాలయంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 250 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డాక్టర్ చేకూరి మురళీకృష్ణ, డాక్టర్ బి.శ్రీహర్ష, వైద్య విద్యార్థులు సేవలందించారు.

వాసవీ కన్యకాపరమేశ్వరికి ఆషాఢ సారె


వాసవీ అమ్మవారికి సారె తీసుకెళుతున్న మహిళలు

సత్యనారాయణపురం, జూలై 21: సీతన్నపేట మీసాల రాజారావు బ్రిడ్జి వద్ద నుంచి జీఎస్‌రాజు రోడ్డులోని వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయం వరకూ మేళతాళాలతో పెద్ద సంఖ్యలో మహిళలు ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి సారెను సమర్పించారు. శాకంబరీ ఉత్సవాల్లో భాగంగా వాసవీ అమ్మవారికి బంగారు బొట్టుబిళ్లను, చీరసారెను అందించామని వీ ఆర్య వైశ్యనేత్ర సంస్థ అధ్యక్షుడు భద్రీనాథ్ తెలిపారు. హరిప్రియ, సభ్యులు పాల్గొన్నారు.

దుర్గమ్మకు సారె సమర్పణ

పటమట: అయ్యప్పనగర్‌లో నాలుగో లైన్ వెలగపూడి సత్యనారాయణ వీధిలోని ట్రెజరీ ఎంప్లాయిస్ కాలనీ, శ్రీనివాస ఎవెన్యూ అపార్టుమెంట్ నుంచి వందమంది మహిళలు కనకదుర్గమ్మకు సారె సమర్పణకు ఆదివారం తరలివెళ్లారు. మేళతాళాలతో వెళ్లి సారెను సమర్పించారు.

చేయూత కార్యాలయం ప్రారంభం

మధురానగర్, జూలై 21: ప్రజా సమస్యల పరిష్కారానికి సహాయ సహకారాలు అందించేందుకు చేయూత సాంఘిక, సాంస్కృతిక సంక్షేమ సంఘం కార్యాలయాన్ని మధురానగర్‌లో జిల్లా వినియోగ దారుల కమిషన్ న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి ప్రారంభించారు. ప్రజలు, వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం న్యాయ సహాయం అందించేందుకు కార్యాలయాన్ని ప్రారంభించినట్లు మాజీ కార్పొరేటర్ పిల్లి లక్ష్మీ తులసి తెలిపారు. ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు, ఏపీ మాజీ లా సెక్రటరీ సి.దుర్గాప్రసాద్, వినియోగదారుల కమిషన్ సభ్యుడు అక్కిపెద్ది వెంకటరమణ, ఏపీ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఓఎస్డీ ఎం.వెంకటసుబ్బయ్య, పీవీఎల్ఎస్‌రాజు(అబ్బు), శివాజీ పాల్గొన్నారు.

వృద్ధులకు నిత్యావసరాల పంపిణీ

సత్యనారాయణపురం, జూలై 21: అల్లూరి సీతారామరాజు వంతెన సమీపంలోని విజయ్‌నర్సింగ్‌స్కూల్‌లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో డాక్టర్ బఫ్నా సహకారంతో వృద్ధులకు ఉచితంగా నిత్యావసర వస్తువులు, మందులను పంపిణీ చేశారు. వృద్ధులకు వైద్య పరీక్షలు చేశారు. వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, డాక్టర్ ఎన్.వేణు, డాక్టర్ కె.శైలజ, మేనేజింగ్ ట్రస్టీలు తట్టి అర్జునరావు, అమర ఉమామహేశ్వరరావు, కె.మధుసూదనరావు, పి.లక్ష్మీనరసింహారావు, వెంకటేష్, గోదావరి పాల్గొన్నారు.

జనసేన సభ్యత్వ నమోదు

భవానీపురం, జూలై 21: జనసేన పార్టీలో సభ్యత్వం తీసుకున్న ప్రతీ కార్యకర్తకు రూ.5లక్షల ప్రమాద బీమా ఉంటుందని, నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి మం డలి రాజేష్ పిలుపునిచ్చారు. సితార సెంటర్‌లోని 45వ డివిజన్ కార్యాలయం వద్ద బొమ్ము రాంబాబు ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదుకు విచ్చేశారు. కొత్తవారికి సభ్యత్వం అందజేశారు.

దిక్సూచి DIKSUCHI

ఎన్ఐపీహెచ్ఎంలో డిప్లొమా, పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(ఎన్ఐపీహెచ్ఎం)- 'పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(పీజీడీపీహెచ్ఎం)', 'డిప్లొమా ఇన్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్(డీపీహెచ్ఎం)' ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. సంస్థ నిర్వహించే రిటెన్ ఎగ్జామినేషన్ ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. ప్రోగ్రామ్‌లలో భాగంగా క్లాస్ రూమ్ తరగతులు, ల్యాబొరేటరీ తరగతులు, ఫీల్డ్ విజిట్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు, స్టయిపెండ్‌తో కూడిన ఇండస్ట్రీ ఇంటర్న్‌షిప్‌లు ఉంటాయి. నిబంధనల ప్రకారం మెరిటోరియస్ స్కాలర్‌షిప్‌లు అందిస్తారు. ప్రోగ్రామ్‌లు పూర్తిచేసినవారికి ఇండస్ట్రీ స్టాండర్డ్ ప్యాకేజీతో ప్లేస్‌మెంట్స్ కల్పిస్తారు.

పీజీడీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఏడాది. రెండు సెమిస్టర్లు ఉంటాయి. ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ బయోసెక్యూరిటీ, పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్, ప్లాంట్ హెల్త్ ఇంజనీరింగ్ స్పెషలైజేషన్లలో ఒకదాన్ని ఎంచుకోవచ్చు. ప్రోగ్రామ్ మొత్తానికి 40 క్రెడిట్లు నిర్దేశించారు. ఇందులో 30 సీట్లు ఉన్నాయి. ఈ ప్రోగ్రామ్ పూర్తిచేసిన అభ్యర్థులు ప్లాంట్ హెల్త్ ఎక్స్‌పర్ట్‌లుగా, పెస్టిసైడ్ క్వాలిటీ అనలిస్ట్‌లుగా రాణించవచ్చు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి బీఎస్సీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)/ఎమ్మెస్సీ(లైఫ్ సైన్సెస్) ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. పెస్టిసైడ్ మేనేజ్‌మెంట్ స్పెషలైజేషన్‌కు బీఎస్సీ(కెమిస్ట్రీ) అభ్యర్థులు అప్లయ్ చేసుకోవచ్చు. వీరికోసం అయిదు సీట్లు ప్రత్యేకించారు.

ప్రోగ్రామ్ ఫీజు: నిరుద్యోగులకు రూ.80,000; ప్రైవేట్ ఉద్యోగులకు రూ.2,00,000

డీపీహెచ్ఎం: ప్రోగ్రామ్ వ్యవధి ఆర్నెల్లు. దీనికి 20 క్రెడిట్లు నిర్దేశించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి డిగ్రీ(అగ్రికల్చర్/హార్టికల్చర్/లైఫ్ సైన్సెస్/అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్)/బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ఉత్తీర్ణులు అప్లయ్ చేసుకోవచ్చు.

ప్రోగ్రామ్ ఫీజు: రూ.40,000

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తు స్వీకరణకు చివరి తేదీ:** జూలై 30
- **రిటెన్ ఎగ్జామ్‌నకు ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 5
- **రిటెన్ ఎగ్జామినేషన్ తేదీ:** ఆగస్టు 12
- **సెలెక్టయిన అభ్యర్థుల జాబితా విడుదల:** ఆగస్టు 19
- **ప్రోగ్రామ్‌లు ప్రారంభం:** ఆగస్టు 25 నుంచి
- **వెబ్‌సైట్:** https://niphm.gov.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో యూజీ ఎన్ఆర్ఐ కోటా

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ(ఏఎన్‌జీఆర్ఏయూ)-వ్యవసాయ డిగ్రీ ప్రోగ్రామ్‌లలో ఎన్ఆర్ఐ కోటా సీట్ల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అడ్మిషన్‌కు ఏపీ ఈఏపీసెట్ 2024 స్కోర్ అవసరం లేదు. ఇంటర్/తత్సమాన కోర్సులో సాధించిన మార్కుల ఆధారంగా మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించి అర్హులకు ప్రవేశాలు కల్పిస్తారు. బీఎస్సీ ఆనర్స్(అగ్రికల్చర్/కమ్యూనిటీ సైన్స్), బీటెక్(ఫుడ్ టెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లు అందుబాటులో ఉన్నాయి. ప్రవాస భారతీయుల పిల్లలు, వారు స్పాన్సర్ చేసిన బంధువుల పిల్లలు దరఖాస్తు చేసుకోవచ్చు.



ప్రోగ్రామ్‌లు-సీట్లు: బీఎస్సీ ఆనర్స్ అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌లో 147 సీట్లు, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్) ప్రోగ్రామ్‌లో 20 సీట్లు, బీటెక్(ఫుడ్ టెక్నాలజీ) ప్రోగ్రామ్‌లో 23 సీట్లు, బీఎస్సీ ఆనర్స్ కమ్యూనిటీ సైన్స్ ప్రోగ్రామ్‌లో 15 సీట్లు చొప్పున మొత్తం 205 సీట్లు ఉన్నాయి.

అర్హత: గుర్తింపు పొందిన బోర్డు నుంచి మేథమెటిక్స్/బయాలజీ, ఫిజిక్స్, కెమిస్ట్రీ, ఇంగ్లీష్ ప్రధాన సబ్జెక్టులుగా ఇంటర్/పస్నెండో తరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. బీఎస్సీ(ఆనర్స్) అగ్రికల్చర్ ప్రోగ్రామ్‌నకు బయాలజీ, బీటెక్(అగ్రికల్చరల్ ఇంజనీరింగ్)కు మేథమెటిక్స్ ప్రధాన సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 17 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

దరఖాస్తు విధానం: వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొన్న దరఖాస్తు ఫారాన్ని నింపి ఇంటర్, పదోతరగతి మార్కుల పత్రాలు; ఆరోతరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికెట్లు, టీసీ, మెడికల్ ఫిట్‌నెస్ సర్టిఫికెట్, ఎన్ఆర్ఐ వీసా-పాస్‌పోర్ట్-ఆదాయ ధ్రువీకరణ పత్రాలు జతచేసి కింది చిరునామాకు పంపాలి. ఎన్ఆర్ఐ స్పాన్సర్డ్ కేటగిరీకి విద్యార్థి తల్లిదండ్రుల వివరాలకు సంబంధించిన అఫిడవిట్, స్పాన్సరర్ ధ్రువీకరణ పత్రం కూడా సబ్మిట్ చేయాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.2,000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** జూలై 25
- **చిరునామా:** రిజిస్ట్రార్, ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీస్, లాం, గుంటూరు-522034
- **వెబ్‌సైట్:** angrau.ac.in

కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే

కొత్త క్రిమినల్ చట్టాలు- పార్ట్ 2

భారతీయ నాగరిక సురక్షా సంహిత (బీఎన్ఎస్ఎస్)-2023



బీఎన్ఎస్ఎస్‌లో 531 సెక్షన్లు ఉన్నాయి. పాతచట్టమైన సీఆర్‌పీసీలో 484 సెక్షన్లు ఉండేవి. దీని నుంచి 14 సెక్షన్లను ప్రస్తుతం పూర్తిగా తొలగించి, కొత్త చట్టాన్ని మరికొన్ని సవరణలతో తీసుకువచ్చారు.

కీలకాంశాలు

- బీఎన్ఎస్ఎస్ న్యాయ విచారణలోని వివిధ అంశాలు, దశలకు సంబంధించి కచ్చితమైన కాల అవధులను నిర్ణయించింది. ఉదాహరణకు వాద ప్రతివాదనలు పూర్తయ్యాక 30 రోజుల్లోగా కొన్ని సందర్భాల్లో 60 రోజుల్లోగా కోర్టులు తీర్పులు వెలువరించాలి. అత్యాచార కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్ చేసిన వైద్యులు ఏడు రోజుల్లోగా నివేదికను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌కు అందించాల్సి ఉంటుంది. బాధితులకు కేసు దర్యాప్తు పురోగతిని కేసు నమోదు చేసిన తరవాత 90 రోజుల్లోగా అందించాలి. ఇలాంటి అంశాలు గడువులతో సహా నిర్దేశించారు.
- ఏడు సంవత్సరాలకు పైబడి శిక్ష పడే అవకాశం ఉన్న కేసుల్లో తప్పనిసరిగా ఫోరెన్సిక్ ఇన్వెస్టిగేషన్ జరగాలి.
- వారెంటుతో అయినా, వారెంట్ లేకున్నా జరిపే సోదాలను ఆడియో - వీడియో సహితంగా చిత్రీకరించి మెజిస్ట్రేట్‌కు సమర్పించాలి.
- ఫిర్యాదు మొదలు తీర్పు వరకూ అన్ని దశల్లోనూ సాంకేతిక, మాధ్యమ వినియోగం తప్పనిసరి చేశారు. ఉదాహరణకు ఆన్‌లైన్ విధానంలో ఫిర్యాదు చేయడం, సమన్లు సంబంధిత వ్యక్తులకు వాట్సాప్ ద్వారా కూడా అందించడం, దర్యాప్తు, విచారణ ఆసాంతం దృశ్య-శ్రవణ మాధ్యమాల్లో చిత్రీకరించాల్సి ఉండటం.
- ముద్దాయిని అరెస్ట్ చేయడం అన్ని కేసుల్లో తప్పనిసరి కాదు. ప్రత్యామ్నాయంగా పోలీసులు ముద్దాయి నుంచి మెజిస్ట్రేట్ ముందు హాజరవుతానన్న వాగ్దానంతో కూడిన సెక్యూరిటీ బాండ్‌ను తీసుకోవడం ద్వారా అరెస్ట్ చేయకుండా ఉండవచ్చు.
- బాధితులు నేరం జరిగిన ప్రదేశానికి చెందిన పోలీస్‌స్టేషన్‌లోనే కాక తమకు దగ్గరలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు ఇవ్వడానికి అవకాశం కల్పించే జీరో ఎఫ్ఐఆర్‌ను సంబంధిత ప్రాధికార పోలీస్‌స్టేషన్‌కు 15 రోజుల్లోగా ఫిర్యాదు అందుకున్న పోలీస్‌స్టేషన్ బదిలీ చేయాల్సి ఉంటుంది.
- కొన్ని కేసుల్లో మెడికల్ ఎగ్జామినేషన్‌కు సంబంధించి ఏ స్థాయి పోలీసు అధికారి అయినా విన్నవించవచ్చు. సబ్ ఇన్‌స్పెక్టర్ స్థాయి కన్నా దిగువస్థాయి కలిగి ఉండవచ్చు.
- కోర్టులు, వాటి ప్రాధికార పరిధిని క్రమానుగత శ్రేణిలో స్పష్టంగా కిందిస్థాయి కోర్టులు మొదలు సుప్రీంకోర్టు వరకూ పేర్కొన్నారు.
- ఏదైనా నేరానికి సంబంధించి పడే శిక్షాకాలంలో సగానికి పైగా విచారణ ఖైదీగా పూర్తిచేసిన పక్షంలో పూచీకత్తు బెయిల్‌పై విడుదలయ్యే అవకాశం గతంలో వలే ఉంది. అయితే, అనేక నేరాల్లో ముద్దాయి అయితే, జీవితఖైదు లేదా మరణదండన విధించే నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు బీఎన్ఎస్ఎస్ ప్రకారం అది వర్తించదు.
- ముద్దాయి అరెస్ట్ కానప్పటికీ అతని వేళ్లు, వేలి ముద్రలు, రాత, గొంతు రికార్డింగ్ వంటి ఆధారాల సమర్పణకు ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆదేశించవచ్చు.
- ఎవరైనా ముద్దాయి విచారణ నుంచి తప్పించుకోవడానికి పరారీలో ఉన్నప్పుడు, అతన్ని అరెస్ట్ చేసే అవకాశాలు ఇంతలో కనిపించనప్పుడు అతను లేకున్నా న్యాయవిచారణ జరిపి, తీర్పు వెలువరించవచ్చు.
- ఏడు లేదా అంతకన్నా ఎక్కువ సంవత్సరాలు శిక్ష పడే అవకాశమున్న నేరాలకు సంబంధించి ఏదైనా కేసును ప్రభుత్వం ఉపసంహరించుకోవాలంటే బాధితులకు తమ అభిప్రాయాన్ని కోర్టుకు విన్నవించుకునే అవకాశం ఇవ్వాలి.

బీఎన్ఎస్ఎస్‌పై విమర్శలు

- విచారణ ఖైదీగా శిక్షాకాలంలో సగానికి పైగా కాలం జైలులో గడిపినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా ఉన్నప్పుడు, జీవితఖైదు, మరణదండన వంటి శిక్షలు విధించబడే నేరాలు చేసినప్పుడు గతంలో వలే బెయిల్ లభించకుండా బీఎన్ఎస్ఎస్ చట్టం నిర్దేశిస్తుంది. అయితే అనేక సెక్షన్లు వర్తించే ఒకే నేరం సాధారణ శిక్షలు పడే నేరం అయినప్పటికీ, అనేక నేరాల్లో ముద్దాయిగా పరిగణింపబడి బెయిల్ నిరాకరణకు గురయ్యే అవకాశాలున్నాయి. దీనివల్ల సాధారణ నేరాలకు, తీవ్ర నేరాలకు తేడా లేకుండా పోతుంది. జైళ్లు నిండిపోతాయి.
- అనేక కేసుల్లో చేతి సంకెళ్లు వేయడానికి బీఎన్ఎస్ఎస్ చట్టం పోలీసులను అనుమతిస్తోంది. అయితే ఈవిధంగా సంకెళ్లు వేయడం సుప్రీం కోర్టు మార్గదర్శకాలకు, మానవహక్కులకు విరుద్ధం. కాబట్టి ఈ అంశం వివాదాస్పదంగా ఉంది.
- ఈ కొత్త చట్టం ప్రకారం పోలీసు కస్టడీ కోరే దర్యాప్తు అధికారి కారణాలు చూపాల్సిన అవసరం లేదు. పోలీసు కస్టడీ సమయం కూడా గతంలో ఉన్న 15 రోజుల నుంచి బీఎన్ఎస్ఎస్ చట్టం ద్వారా 90 రోజులకు పొడిగించారు. ఈ అంశాల వల్ల పోలీసు అధికారాలు పెరగడం, మానవ హక్కులపై ప్రభావం పడటం వంటి వలసకాలం నాటి(బ్రిటీష్) అణచివేత పరిస్థితులు మరలా తలెత్తుతాయని ఆందోళన వ్యక్తమవుతోంది.
- పరారీలో ఉన్న వ్యక్తులపై న్యాయవిచారణను జరిపి, వారికి శిక్షలు సైతం నిర్ధారించగల అవకాశం ఈ కొత్తచట్టంలో ఉంది. ఇది నిందితులను పట్టుకుని న్యాయస్థానం ముందు ప్రవేశపెట్టాలన్న ఒత్తిడిని ప్రభుత్వ యంత్రాంగాలపై తగ్గిస్తుంది. అంతేకాక నిందితుల వాంగ్మూలం, అసలు నిజాల వెలికితీత మరుగునపడిపోయే ప్రమాదం కూడా ఉంది.
- ప్రజా జీవనం(పబ్లిక్ ఆర్డర్)కి సంబంధించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని అంశాలనే బీఎన్ఎస్ఎస్‌లో కూడా కొనసాగించారు. దీనివల్ల విచారణాక్రమం(ట్రైల్ ప్రొసీజర్)కి సంబంధించిన చట్టాలు, పబ్లిక్ ఆర్డర్‌కు సంబంధించిన చట్టాలను, వాటిలోని వైవిధ్యతల కారణంగా విడివిడిగా పరిగణించాలా లేదా ఉమ్మడిగా పరిగణించాలా అన్న సందిగ్ధత నెలకొంది. ఈవిధంగా అనేక ప్రొవిజన్స్ అమలులో సందిగ్ధతలు ఉన్నాయి.
- ఒక నేరానికి సంబంధించిన ఆధారాలను సేకరించిన అధికారి స్థానంలో వచ్చిన మరో అధికారికి ఆ ఆధారాలను కోర్టుకు సమర్పించే అధికారాన్ని బీఎన్ఎస్ఎస్ కల్పించింది. అయితే ఆధారాలు సేకరించిన అధికారిని క్రాస్ ఎగ్జామినేషన్ చేసే అవకాశాన్ని ఇది దూరం చేస్తుంది.



ఎం.బాలలత,
సివిల్స్ మెంటార్

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కృష్ణలంక: కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తామని కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కలెక్టరేట్, డివిజన్, మున్సిపల్, మండల కేంద్రాల్లో అధికారులు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజలకు అందుబాటులో ఉండి అర్జీలు స్వీకరిస్తారన్నారు. జిల్లాకేంద్రంతో పాటు డివిజన్, మండల కేంద్రాలు, మున్సిపల్ కార్యాలయాల్లోనూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక జరుగుతుందని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రక్తి కట్టించిన రంగస్థల ప్రదర్శనలు

విజయవాడ కల్చరల్: గురుపూజ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన పద్య నాటకాలు రక్తికట్టించాయి. శ్రీదేవి కళ నాట్యమండలి, గుమ్మడి కళాపీఠం, శ్రీ మనోహరి నాట్యమండలి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సాయంత్రం గాంధీనగర్‌లోని కౌతా పూర్ణానంద కళాసత్రంలో సత్యహరిచంద్రలోని పద్యనాటక ప్రదర్శనలు జరిగాయి. సత్య హరిశ్చంద్ర నాటకంలోని అడవి సీను, వారణాసి సన్నివేశాలను 2 బృందాలు ప్రదర్శించాయి. హరిశ్చంద్రుడిగా పంబ కోటేశ్వరరావు, బూసిపల్లి బూసిరెడ్డి, చంద్రమతిగా లక్ష్మీశ్రీ జగ్గయ్యపేట, నక్షత్రకుడిగా ఎస్.శివశంకర్ అడవినెక్కలం, కాల కౌశికుడిగా ఇంద్రకుమార్-జమలాపురం, లోహితుడిగా నగరానికి చెంది న తరుణ్ చక్కని అభినయంతో నాటకాన్ని రక్తికట్టించారు. గుమ్మడి విజయ్‌కుమార్, మోడీ ఆంజనేయులు, ఎం.మోహన్‌రెడ్డి, విన్నకోట బుజ్జి, జీవన్‌కుమార్ పాల్గొని కళాకారులను సత్కరించారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి: దేరంగుల

కృష్ణలంక: టీడీపీ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతోందని బీసీ సంఘం జాతీయాధ్యక్షుడు, బీజేపీ నేత దేరంగుల ఉదయ్ కిరణ్ అన్నారు. కృష్ణలంకలోని ఓ హోటల్‌లో ఆదివారం ఆయన విలేకరు ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మా ట్లాడుతూ రానున్న రోజుల్లో పోలింగ్ బూత్ లెవల్ లో భారతీయ జనతా పార్టీని మరింత బలపరిచేలా నేతలు, కార్యకర్తలు కృషి చేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. ఐదేళ్ల వైసీపీ పా లనలో రాష్ట్ర నాశనమైందని మండిపడ్డారు. బీజేపీ చీఫ్ పురందేశ్వరి ఆధ్వర్యంలో 8 మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు ఎంపీలు గెలిచి రాష్ట్రం నుంచి బీజేపీ విజయదుంధుభి మోగించిందన్నారు. బీసీ సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు వెంకటేశ్వరి, రాష్ట్ర కార్యదర్శి పీఎన్‌వీ ప్రసాద్, శివనాగరాజు పాల్గొన్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే రోడ్డు మార్గాన్ని మళ్లించండి

పాత రాజరాజేశ్వరిపేట, జూలై 21: ఖమ్మం నుంచి నగరం వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ హైవే మార్గాన్ని మళ్లించాలని ఎంపీ కేశినేని చిన్నిని రైతుల లే అవుట్ సభ్యులు కోరారు. ఆదివారం నగరంలోని చిన్ని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ధనేకుల సుబ్బారావు మాట్లాడుతూ జేఎన్ఎన్‌యూఆర్ఎం పథకం కింద ఉడా వేసిన రైతుల లే అవుట్‌లో హైవే రోడ్డు వెళ్తోందని తద్వారా లే అవుట్ స్వరూపం మారిపోయి రెండు భాగాలుగా విడిపోతోందన్నారు. ఎంపీ కేశినేని చిన్నిని కలిసిన వారిలో లే అవుట్ సభ్యులు ఆలపాటి లక్ష్మీకాంతారావు, ఆలూరు సత్యనారాయణ పాల్గొన్నారు.

వేదపండితుడు శ్యావస్య మహర్షికి గురుపూజ

వన్‌టౌన్, జూలై 21: వ్యాసపౌర్ణమిని పురస్కరించుకుని సీనియర్ వేద పండితుడు శ్యావస్యమహర్షి దంపతులకు ఆలయంలో గురుపూజ నిర్వహించారు. వేదమంత్రాల మధ్య ఆయనకు సాదర స్వాగతం పలికి పీఠంపై అధిరోహింపజేశారు శాస్త్ర విధానంలో గురుపూజ చేశారు. ఈవో రామారావు ఆయనకు పాదాభివందనం చేశారు. అనంతరం ఆయనకు ప్రసాదం, దక్షణ తాంబూలం అందజేశారు, శావస్య మహర్షి కుటుంబ సభ్యులతో ఈవో గ్రూపుఫొటో దిగారు.





మహర్షి కుటుంబ సభ్యులతో ఈవో, అధికారులు, అర్చకులు, బంగారు తాపడానికి విరాళమిస్తున్న మేరుగు

స్వర్ణ తాపడానికి ప్రతి పౌర్ణమికి రూ.లక్ష విరాళం

ఇక నుంచి ప్రతి పౌర్ణమికి దుర్గగుడి గోపుర స్వర్ణ తాపడానికి రూ.లక్ష చొప్పున విరాళం అందించనున్నట్టు హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన మేరుగు గోపాల్ ప్రకటించారు. ఆదివారం ఆలయానికి విచ్చేసిన ఆయన డోనర్‌సెల్‌లో స్వర్ణ తాపడానికి రూ.లక్ష విరాళం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమ్మవారి గోపురం స్వర్ణతాపడం పనులు త్వరగా పూర్తికావాలని ఆకాంక్షించారు. అమ్మవారి దర్శనానంతరం ఆయనకు ప్రసాదం, శేషవస్త్రం, అమ్మవారి చిత్రపటం, ఆశీస్సులు అందజేశారు.

ఆటోడ్రైవర్లకు అండగా ఉంటా

● టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న

వన్‌టౌన్, జూలై 21: ఆటోడ్రైవర్లకు ఏ కష్టం వచ్చినా అండగా ఉంటానని వన్‌టౌన్ అర్జున వీధిలోని తన కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆటో డ్రైవర్ల సమావేశంలో టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బుద్దా వెంకన్న అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశ్చిమ నియోజకవర్గంలో టీఎన్‌టీయూసీ ఆటోస్టాండ్ల గౌరవాధ్యక్షుడిగా కాంద్రేగుల రవీంద్రను నియమించామని, కార్మిక రంగానికి టీడీపీ పూర్తి అండ దండలను ఇస్తుందన్నారు. తొలుత కాళేశ్వరరావు మార్కెట్ ఫ్లై ఓవర్ కింద టీఎన్‌టీయూసీ అనుబంధ కృష్ణవేణి ఆటోస్టాండ్, కాళేశ్వరరావు మార్కెట్ ఆటోస్టాండ్‌ను ప్రారంభించారు. టీఎన్‌టీయూసీ రాష్ట్ర నేత లింగంపల్లి మోహనరావు, రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రామరాజు ముఖ్య అతిథులుగా పాల్గొనగా, యువనేత కాంద్రేగుల రవీంద్ర టీఎన్‌టీయూసీ జెండాలను ఎగురవేసి ఆటోస్టాండ్లను ప్రారంభించారు. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కార్మికులకు పథకాలను రూపొందిస్తున్నారన్నారు. ఆదిబాబు, హనుమంతరావు, చిన్న వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బుద్దా వెంకన్న

పురోగమన వైతాళికుల చిత్రపటాల ఆవిష్కరణ

విజయవాడ కల్చరల్, జూలై 21: మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో బాలోత్సవ భవనంలో ఏర్పాటుచేసిన 32మంది పురోగమన వైతాళికుల చిత్రపటాలను ప్రముఖ సాహితీ విమర్శకుడు తెలకపల్లి రవి, కథ, నవల రచయిత్రి డాక్టర్ కేవీ మల్లేశ్వరి ఆవిష్కరించారు. ఆర్టిస్ట్ అనరవిల్లి గిరిధర్ చిత్రించి న ఈ చిత్రపటాల ఆవిష్కరణ తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ కవులు, రచయితలు, గాయకులు ప్రముఖులు, బీవీకే కార్యదర్శి పి.మురళీకృష్ణ మాట్లాడుతూ 6 నెలల పాటు శ్రమకోర్చి చిత్రాలు గీసిన గిరిధర్‌ను అభినందించారు. యువ రచయిత అ నిల్ డ్యానీ సభకు అధ్యక్షత వహించారు. సాహితీ విమర్శకుడు తెలకపల్లి రవి మా ట్లాడుతూ సంస్కర్తలు మనుషులను మనుషులుగా చూస్తారని, వ్యవస్థలోని లోపా ల్ని ప్రశ్నించేవారుగా ఉంటారన్నారు. ప్రముఖ రచయిత్రి, కవి డాక్టర్ కేఎస్ మల్లేశ్వరి, సాహితీ విశ్లేషకులు బాలాంత్రపు ప్రసూన, సత్యాజి, ఎం.సి.దాస్, రవి శారద మాట్లాడారు. ప్రజా గాయకుడు అనిల్ పాటల ద్వారా సభికులను ఉత్తేజపరిచారు. చిత్రకారుడు అరసవిల్లి గిరిధర్‌ను ఎంబీవీకే మేనేజ్‌మెంట్ కమిటీ సత్కరించింది. ఫోరం ఫర్ ఆర్టిస్ట్ సభ్యులు, ఎంబీవీకే ప్రతినిధులు, టి.క్రాంతి, కిరణ్, గుండు నారాయణ, కె.స్వరూపారాణి, పి.విజయ్, యు.వి.రామరాజు పాల్గొన్నారు.

రైల్వే కాలనీలోని క్వార్టర్ నుంచి ఊడిన గోడ

రైల్వేస్టేషన్, జూలై 21: రైల్వేస్టేషన్ ఎదురుగా ఉన్న రైల్వే ఎంప్లాయిస్ కాలనీలోని క్వార్టర్ నెంబరు 723 బాల్కనీ నుంచి ఆదివారం ఆకస్మికంగా గోడ ఊడి పడింది. ఆ సమయంలో అక్కడెవరూ లేకపోవడం తో ప్రమాదం తప్పింది. కాలనీవాసులు ఈ విషయా న్ని దక్షిణమధ్యరైల్వేమజ్దూర్ యూనియన్ డివిజన్ ప్రధాన కార్యదర్శి డీఎస్ లీల దృష్టికి తీసుకువెళ్లారు. ఆమె వెంటనే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వారు సమస్యను త్వరలో పరిష్కరిస్తామని తెలిపారు.

బంగారం, వెండితో సహా రూ.లక్షా 27వేలు చోరీ

చిట్టినగర్, జూలై 21: ఇంటి తాళాలు పగలగొట్టి బీరువాలో ఉన్న రూ.లక్షా 27వేల నగదుపాటు 62 గ్రాముల బంగారం, 50 గ్రాముల వెండి వస్తువులు చోరీ చేసినట్టు కొత్తపేట పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. అంబాపురం పి.నైనవరంలో అల్లంపల్లి మణికంఠ భార్య, ఇద్దరు పిల్లలతో నివాసం ఉంటున్నా డు. కబేళా ప్రాంతంలోని ఓ గ్రీజు కంపెనీలో పని చేస్తాడు. మణికంఠ ఇంటి సమీపంలో ఆయన తమ్ముడు అనిల్‌కుమార్ నివాసముంటున్నాడు. 20న పిల్లలకు సె లవు కావడంతో భార్య, ఇద్దరు పిల్లలను తమ్ముడింటి వద్ద దించి డ్యూటీకి వెళ్లాడు. సాయంత్రం డ్యూటీ ముగించుకొని తమ్ముడింటికి వెళ్లి ఆ రాత్రి అక్కడే నిద్రపోయారు. ఆదివారం ఉదయం ఇంటికి వెళ్లగా ఇంటి తూర్పు వైపు తాళం పగలగొట్టి ఉంది. అనుమానం వచ్చి ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో వస్తువులన్నీ ఎక్కడపడితే అక్కడ పడేసి ఉన్నాయి. బీరువాలో ఉన్న రూ.లక్షా 27వేల నగదు, 62 బంగారు నగలు, 50 గ్రాముల వెండి వస్తువులు కనిపించకపోవడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నా రు. అయితే దొంగ దొరికాడని, నగదుతోపాటు బంగారం, వెండి స్వాధీనం చేసుకున్నట్టు తెలిసింది. ఫిర్యాదు అందిన 3,4 గంటల్లో దొంగను పట్టుకున్నట్టు తెలిసింది.

సూపర్ సిక్స్ హామీల అమలుకు చర్యలు ప్రకటించాలి

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బాబూరావు

గవర్నర్‌పేట, జూలై 21: ఎన్నికల సమయంలో వాగ్దా నం చేసిన సూపర్ సిక్స్ ఇత ర హామీల అమలుకు నిర్దిష్ట చర్యలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రకటించాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సిహెచ్ బాబూరావు డిమాండ్ చేశారు. ఆదివారం ఎంజీ రోడ్డులోని ఎంబీవీకేలో సీపీఎం జిల్లా విస్తృత సమావేశం దోనేపూడి కాశీనాథ్ అధ్యక్షతన జరిగింది. సమావేశంలో బాబూరావు మాట్లాడుతూ హింస, దౌర్జన్యాలు, అణచివేత, నిర్బంధం చర్యలపై ఆగ్రహంతో ప్రజలు వైసీపీని గద్దె దించారని, ప్రస్తుత కూటమి ప్రభుత్వం అదేదారిలో ప్రయాణించకుండా ప్రజాస్వామ్య హక్కులను గౌరవిస్తూ శాంతిభద్రతలను కాపాడాలని సూచించారు. రాష్ట్రంలోని అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీలు అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాలని కోరారు. నేతలు కె.శ్రీదేవి, పీవీ ఆంజనేయులు, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, కోట కల్యాణ్, బోయి సత్తిబాబు, ఎం.నాగేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఘనంగా నటరాజ, పూజ

విజయవాడ కల్చరల్: సంస్కార భారతీయ సంస్థ ఆధ్వర్యంలో నటరాజ పూజ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. గాంధీనగర్‌లోని వెలిదండ్ల హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం సాయంత్రం గురుపౌర్ణమి పురస్కరించుకొని ప్రత్యేక కళా ప్రదర్శనలు నిర్వహించారు. తొలుత విజయవాడ మహానగర్ సంస్కార భారతీయ కార్యకర్తల ధ్యేయగీతం పాడారు. కనకదుర్గ నృత్య మందిర్ యల్లాజోష్యుల అనురాధ శిష్య బృందం, నాట్యాచార్య వాసుదేవరావు శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్యాంశాలు ప్రేక్షకుల్ని మైమరిపించాయి. తదుపరి మోదుమూడి సుధాకర్ శిష్య బృందం ఆలపించిన సంగీత గానామృతం రంజింపజేసింది. ప్రముఖ రంగస్థల నటుడు దర్శకుడు డాక్టర్ పీవీఆర్ కృష్ణ శిష్యులు ప్రదర్శించిన ఏకపాత్రాభినయ ప్రదర్శనలు పద్యాల పనులు ఉర్రూతలూగించాయి. కె.వి.శివకుమార్ నిర్వహణలో రూపుదిద్దుకున్న చిత్రలేఖ ప్రదర్శన వీక్షకులను కట్టిపడేసింది. అనంతరం ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ జీవీ పూర్ణచంద్, ప్రముఖ రంగస్థల నటుడు నాయుడు గోపి, ప్రముఖ సంగీత విద్వాంసుడు మోదుమూడి సుధాకర్‌కు గరు సత్కారం చేశారు. భాస్కరశర్మ, శ్రవణ్‌కుమార్, సీతారత్నం పాల్గొన్నారు. సంస్కార్ భారతి ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ పర్యవేక్షించారు.

సెమీస్‌కు కేడీసీఏ అండర్-16 పురుషుల జట్టు

విజయవాడ స్పోర్ట్స్, జూలై 21: విజయనగరంలో జిల్లాలో జరిగిన అంతర్ జిల్లాల అండర్- 16 క్రికెట్ మ్యాచ్‌ల్లో కేడీసీఏ అండర్-16 జట్టు స త్తా చాటింది. గ్రూప్-ఏలో 20 పాయింట్లను సాధించి సెమీస్‌కు చేరిం ది. పూల్-ఏలో కేడీసీఏ జట్టు అగ్రభాగాన నిలవగా, అనంతపురం టీమ్ రెండోస్థానంలో నిలిచింది. జిల్లా టీమ్ సత్తా చాటడంపై కేడీసీఏ అడ్‌హా క్ కమిటీ చైర్మన్ టి.త్రినాథ్‌రాజు కోచ్‌లను, క్రికెటర్లను అభినందించారు.



అండర్-11 చెస్ టోర్నీకి స్పందన

మొగల్రాజపురంలోని గ్లోబల్‌చెస్ అకాడమీలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అండర్-11 బాలబాలికల చాంపియన్‌షిప్‌కు విశేష స్పందన లభించింది. మొత్తం 60మంది పోటీపడగా, బాలుర విభాగంలో అనగాని శశాంక్ (ప్రథమ), రేవు తేజ వజ్రాక్ష్ (ద్వితీయ), బాలికల విభాగంలో నారాయణ రిషిత (ప్రథమ), దేశెట్టి సోనిక (ద్వితీయ) స్థానాల్లో నిలిచా రు. ముఖ్య అతిథులుగా పారిశ్రామికవేత్త పాలడగు శిల్ప, డాక్టర్ గుం టూరు జ్యోతి, ఒంగోలు డిప్యూటీ తహసీల్దార్ షేక్ ఫిరోజ్ బాషా, ఎక్సలె న్సీ ఇంటర్నేషనల్ సూర్య విజేతలకు బహుమతులను అందించారు. వీరు 27,28న భీమవరంలో జరిగే రాష్ట్రస్థాయి టోర్నీలో బరిలో దిగుతారని జి ల్లా చెస్ అసోసియేషన్ అధ్యక్షకార్యదర్శులు షేక్ ఖాసీమ్, రాజీవ్ తెలిపారు.



పతకాలు సాధించిన విద్యార్థులు

కరాటే పోటీల్లో నగర విద్యార్థుల ప్రతిభ

విజయవాడ స్పోర్ట్స్, జూలై 21: చెన్నైలో ఆదివారం జరిగిన ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ చాలెంజర్స్ కప్‌లో నగర విద్యార్థులు సత్తాచాటారు. కట, కుమితే విభాగాల్లో పతకాలు సాధించారు. ఏపీ వాడో ఆర్‌వైయూ కరాటే ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన 18మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా అందరూ పతకాలు సాధించారని సెన్సి జేఎం దాసు, సీనియర్ మాస్టర్లు పి.సతీష్ కుమార్, ఎండీ అరిఫ్ తెలిపారు. పతకాలు సాధించిన విద్యార్థులు మల్లీశ్వరి, హర్షిత, వేదశ్రీ, యశ్విన్, ఆదల్ పాషాను వారు అభినందించారు.

బ్రాహ్మణిపై ఎక్స్‌లో అసభ్యకర పోస్టులు

● నున్న రూరల్ పోలీసులకు తెలుగు మహిళల ఫిర్యాదు

పాయకాపురం: ముఖ్యమంత్రి చంద్రబాబు కోడలు, మంత్రి లోకేష్ భార్యపై ఎక్స్ వేదికగా అసభ్యకర పోస్టులు పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సెంట్రల్ తెలుగు మహిళా అధ్యక్షురాలు దాసరి ఉదయశ్రీ నున్న రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. విశాల్ స్పీక్స్ పేరుతో ఎక్స్ లో అసభ్యకర పోస్టులు పెట్టారు. స్పందించిన ఉదయశ్రీ బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాష్ట్రాభివృద్ధికి కృషి చేయాలి: చంద్రభాను సింగ్

ధర్నాచౌక్, జూలై 21: రాష్ట్రాభివృద్ధిలో బొందిలి సామాజికవర్గం ప్రజలు భాగస్వాములు కావాలని టీడీపీ బొందిలి సాధికారక కమిటీ కన్వీనర్ నందేటి చంద్రభాను సింగ్ పిలుపునిచ్చారు. ఏపీ బొందిలి సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బొందిలి కులాన్ని ఓబీసీలో చేర్చేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రానికి నివేదిక పంపిస్తామన్నారు. కృష్ణసింగ్, శివసింగ్, అరుణ్‌సింగ్, ఎస్.లక్ష్మీనారాయణ సింగ్, శ్రీనివాస్‌సింగ్, వేణుగోపాల్‌సింగ్, శంకర్ సింగ్, భవానీబాయ్, ధర్మసింగ్ పాల్గొన్నారు.

న్యూస్ మేకర్

పతకాలకు తుపాకీ గురిపెట్టి



ఇండియన్ షూటర్, హర్యాణా అమ్మాయి, మను భాకర్ రెండోసారి ఒలింపిక్స్ బరిలోకి దిగబోతోంది. టోక్యో ఒలింపిక్స్‌లో సాంకేతిక సవాళ్ల ఫలితంగా తాను పాల్గొన్న మూడు పోటీల ఫైనల్స్‌లో అర్హత సాధించలేకపోయిన మను, ప్యారిస్ ఒలింపిక్స్ కోసం ఎలా సిద్ధపడుతుందో తెలుసుకుందాం!

టోక్యో, 2020 ఒలింపిక్స్ గాయం మానిపోయినా, ఆ ఆనవాళ్లు అలాగే మిగిలి ఉన్నాయి. ఒకప్పటి టీనేజర్‌లో మునుపటి దుందుడుకుతనం స్థానాన్ని హుందాతనం ఆక్రమించింది. ఈసారి మరింత మెరుగైన ప్రతిభ కనబరిచి, పతకాలను గెలుచుకోవాలనే కృతనిశ్చయం మనులో స్పష్టంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్యారిస్‌కు రెండు గంటల ప్రయాణ దూరంలోని చతోహరా షూటింగ్ రేంజ్‌లో ఉన్న మను, కోచ్, మాజీ ఏషియన్ గేమ్స్ ఛాంపియన్, జస్పాల్ రాణా ఆధ్వర్యంలో షూటింగ్ సాధన చేస్తోంది. తొలి ఓటమితో కుంగుబాటుకు గురైన మను, ఒక సందర్భంలో ఓటమికి కోచ్‌నే బాధ్యుడిని చేస్తూ, అతని కోచింగ్ నుంచి పక్కకు తప్పుకుంది. కానీ తప్పును తెలుసుకున్న తర్వాత, తిరిగి జస్పాల్‌నే కోచ్‌గా ఎంచుకుంది. "ఒక సందర్భంలో ఆటకు గుడ్‌బై చెప్పేద్దామనకున్నాను. కానీ అంత త్వరగా ఓటమికి తల వంచడం నాకిష్టం లేదు. అందుకే జస్పాల్ సారథ్యంలో, ఆయన మార్గనిర్దేశంలో రెండోసారి ఒలింపిక్స్‌కు సిద్ధపడ్డాను. కష్టపడతాను, ఫలితాన్ని ఆ భగవంతుడికే వదిలేస్తాను. నా మీద ఒత్తిడి కచ్చితంగా ఉంది. కానీ ఇప్పుడా ఒత్తిడిని అధిగమించి ప్రతిభ కనబరిచే స్థాయికి చేరుకున్నాను. కొన్నిసార్లు ఆందోళనకు కూడా లోనవుతూ ఉంటాను. అలాంటి సందర్భాల్లో ఏదో ఒక సినిమా గురించి లేదంటే ఏదో ఒక సందర్భం గురించి ఆలోచించడం మొదలుపెట్టడం నేర్చుకున్నాను. ఇంతకుముందు ఓటమి నుంచి కోలుకోడానికి నాకు కొన్ని రోజుల సమయం పడుతూ ఉండేది. కానీ ఇన్నేళ్ల సాధనతో ఓటమి గురించి మూడు, నాలుగు రోజుల బాధ పడితే ఫరవాలేదు. అంతకంటే ఎక్కువ రోజులు బాధ పడుతూ కూర్చోవడం వల్ల ఉపయోగం ఉండదనే విషయాన్ని గ్రహించాను. కాలంతో పాటు ప్రజలు మర్చిపోయినట్టే, మనమూ మర్చిపోవాలి. నేనెన్నో పోటీల్లో నెగ్గాను. కానీ టోక్యో ఒలింపిక్స్‌లో ఫైనల్స్‌కు అర్హత సాధించలేకపోయినప్పుడు, విపరీతంగా కుంగిపోయాను" అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటూ తన అనుభవాన్ని మీడియాతో పంచుకుంది మను.

> టీనేజీ వయసులోనే అతి తక్కువ కాలంలో ర్యాంకింగ్‌ను పెంచుకుని, భారతదేశపు షూటింగ్ స్టార్‌గా ఎదిగిన మను స్వస్థలం హర్యాణాలోని, జజ్జర్. బాక్సర్లు, రెజ్లర్లకు పుట్టినిల్లయిన హర్యాణాకు చెందిన మను స్కూలు రోజుల్లో టెన్నిస్, స్కేటింగ్, బాక్సింగ్ క్రీడల్లో పాల్గొంది. థాంగ్ టా అనే మార్షల్ ఆర్ట్స్‌లో కూడా పాలుపంచుకుని జాతీయ స్థాయిలో పతకాలను సైతం గెలుచుకుంది. తర్వాత 14 ఏళ్ల వయసులో, 2016 రియో ఒలింపిక్స్ ముగిసిన సమయంలో, షూటింగ్‌లో తన ప్రావీణ్యాన్ని పరీక్షించాలని నిర్ణయించుకుంది. ఆ పోటీలు ముగిసిన వారం రోజులకే మను తన తండ్రిని స్పోర్ట్ షూటింగ్ పిస్టల్ కొనిపెట్టమని అడగడం, ఆమె తండ్రి రామ్ కిషన్ భాకర్ వెంటనే పిస్టల్‌ను కొనివ్వడం వెంటవెంటనే జరిగిపోయాయి. అలా అప్పట్లో ఆ తండ్రీకూతుళ్లు తీసుకున్న ఒక నిర్ణయం నేడు ఆమె ఒలింపియన్ స్థాయికి ఎదగడానికి తోడ్పడింది.

ముచ్చటగా మూడు పోటీల్లో...

ఈ 22 ఏళ్ల షూటర్ ఒక్క ఒలింపిక్ పతకం తప్ప మిగతా పతకాలెన్నిటినో గెలుచుకుంది. ఈసారి ప్యారిస్‌లో జరగబోతున్న ఒలింపిక్స్‌లో పది మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, పది మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్, ఈ మూడు పోటీల్లో పతకాలను గెలుచుకోవాలని కలలు కంటోంది. "గత ఒలింపిక్స్‌లో పాల్గొన్న సమయంలో నాలో అంత ధైర్యం లేదు. కానీ ఈసారి ధైర్యంగా బరిలోకి దిగాలనుకుంటున్నాను. రొటీన్‌కు కట్టుబడి పూర్తి సామర్థ్యాన్ని, ప్రతిభనూ కనబరచాలనుకుంటున్నాను. ఇక ఫిట్‌నెస్ విషయానికొస్తే, ప్రతి నెలా కంటి పరీక్షలు చేయించుకుంటూ ఉంటాను. నాది 6/6 విజన్. కళ్లు అలసటకు గురికాకుండా ఉండడం కోసం స్క్రీన్ టైమ్‌ను పరిమితం చేసుకుంటూ ఉంటాను. రోజు మొత్తంలో కేవలం రెండు గంటల స్క్రీన్ టైమ్‌కే పరిమితమవుతూ ఉంటాను. షూటింగ్ కోసం ఉపయోగించే టైమర్ నా ఫోన్లో ఉంటుంది కాబట్టి దాని కోసమే ఎక్కువ సమయాన్ని వెచ్చిస్తాను. యూట్యూబ్‌లో మ్యూజిక్ వింటూ ఉంటాను. అలాగే వాట్సాప్ కాల్స్, మెసేజెస్, ఆన్‌లైన్ వయొలిన్ క్లాసెస్ కోసం కొంత సమయాన్ని వెచ్చిస్తాను" అంటూ చెప్పుకొచ్చింది మను.

కోచ్‌తో విభేదాలు

మనుతో దెబ్బతిన్న అనుబంధం గురించి కూడా మను మీడియాకు ఇలా వివరించింది. "మా ఇద్దర్లో ఎన్నో విబేధాలున్నాయి. వాటిని పరిష్కరించుకుని దృఢపడడం కీలకమైన విషయమని నా అభిప్రాయం. ఏది జరిగినా మన మంచి కోసమే అని అందరూ అంటూ ఉంటారు. కానీ మన జీవితంలో అంతా తప్పే జరుగుతున్నప్పుడు, అది కూడా మన మంచికే అని ఎందుకు భావించాలి? నేనిలాంటివి నమ్మను. నాకు భగవంతుడి మీద, గురువు మీద విశ్వాసం ఉంది. జస్పాల్‌తో నాకు మనస్పర్థలు వచ్చాయి. మమ్మల్ని విడదీయాలని ఎంతోమంది విశ్వ ప్రయత్నం చేశారు. అదే జరిగింది. కానీ తప్పు తెలిసొచ్చిన తర్వాత, నా అంతట నేనే ఆయన్ను సంప్రతించాను. 2024 తర్వాత షూటింగ్ నుంచి దూరమవడం లేదా ఆయనతో కలిసి షూటింగ్ కొనసాగించడం.. ఈ రెండిట్లో ఏదో ఒకటి జరుగుతుందని ఆయనతో చెప్పాను. 2024 ఒలింపిక్స్‌లో గెలిచినా, ఓడినా ఆ తర్వాత నుంచి షూటింగ్‌ను వదిలేస్తానని లేదంటే ఆయనతోనే కలిసి షూటింగ్‌ను కొనసాగిస్తాననీ అన్నప్పుడు, ఆయన నాతోనే షూటింగ్‌ను కొనసాగించు అన్నారు. తిరిగి జస్పాల్ సారథ్యంలో సాధన చేయడం సంతోషంగా ఉంది. ప్యారిస్ ఒలింపిక్స్‌లో కచ్చితంగా పతకాలు గెలుస్తాననే నమ్మకం కలుగుతోంది" అంటూ చెప్పుకొచ్చింది మను. ఆ అమ్మాయి మీద భారతదేశం పెట్టుకున్న నమ్మకాలు ఎంతవరకూ నిజమవుతాయో తెలియాలంటే, ప్యారిస్ ఒలింపిక్స్ వరకూ ఆగక తప్పదు.

"రవి వలె కవి కూడా లోకబాంధవుడు" అని సాహిత్యలోకానికి చాటిన చైతన్యశీలి... నిరంకుశత్వ పాలనపై అక్షరాల "అగ్నిధార"ను కురిపించిన కవి... పీడిత ప్రజావాణికి బలాన్నిచ్చి "నా తెలంగాణ కోటి రతనాల వీణ" అని ఎలుగెత్తి చాటిన సాహిత్యకారుడు... తెలుగు సినీ సాహిత్యానికి సొబగులద్దిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య శతజయంతి సంవత్సరం ఇవాళ మొదలవుతుంది. ఈ సందర్భంగా దాశరథి జీవితానుభవాలను ఆయన కుమార్తె వంగిపురపు ఇందిర నవ్యతో చెబుతున్నారిలా.!



మా నాన్న 'శాంతమూర్తి'

మహాకవిగా జన నీరాజనాలు అందుకున్న దాశరథి కృష్ణమాచార్య కూతురుగా పుట్టడం నా అదృష్టం. నేను ఇందిరాగాంధీ అంతటి గొప్పదాన్ని అవ్వాలనేమో, మా నాన్న నాకు 'ఇందిర' అని పేరు పెట్టారు. ఆయన నన్ను డాక్టరుగా, తమ్ముడు లక్ష్మణ్‌ను ఇంజినీరుగా చూడాలనుకొన్నారు. అది కుదరలేదు. కనీసం వారి సాహిత్య వారసత్వం కూడా మాకు అబ్బలేదు. సరస్వతీదేవి మమ్మల్ని కటాక్షించలేదని మేమన్నా అప్పుడప్పుడు అనుకుంటాంగానీ, నాన్న మాత్రం ఆ మాట ఎన్నడూ అనలేదు. నన్ను ప్రేమగా 'బుజ్జి' అని పిలిచేవారు. మమ్మల్ని అస్సలు కోప్పడేవారే కాదు. ముఖం మీద చెదరని చిరునవ్వుతో... తెల్లని ధోతీ, కాలరులేని పొడవు చేతుల చొక్కా ధరించిన నాన్న రూపం నా కళ్ల ముందు ఈనాటికి మెదులుతుంటుంది. సాహిత్య పుస్తకాలు, కాగితాలతో నిండిన బ్రీఫ్‌కేసు ఒకటి ఎప్పుడూ ఆయన వెంట ఉండేది. సభలు, సమావేశాల్లో గంటలకొద్దీ అనర్గళంగా ఉపన్యసించే నాన్న ఇంట్లో మాత్రం మితభాషి. పరుషంగా మాట్లాడరు సరి కదా, కనీసం చిరాకు, అసహనం ప్రదర్శించిన సందర్భం ఒక్కటీ లేదు. తన కవిత్వంలో ఆవేశాన్ని, ఆగ్రహజ్వాలలను అంతగా పలికించిన మా నాన్న నిజ జీవితంలో మాత్రం ఓ శాంతమూర్తి.

మా ఇంటికి మహాకవుల రాకపోకలు ...

నాన్న సినిమాలకు పాటలు రాస్తున్న సమయంలో... 1963 నుంచి 1979 వరకు చెన్నైలో ఉన్నాం. నా చదువు కూడా అక్కడే సాగింది. మొదట నన్ను జర్మన్ స్కూల్లో చేర్పించారు. నాకు తెలుగు రావడంలేదని తర్వాత కేసరి హైస్కూలుకు మార్చారు. మాతృభాషంటే నాన్నకు అంత ఇష్టం. మేము వీఎం స్ట్రీట్‌లోని ఒక అపార్టుమెంటులో ఉండేవాళ్లం. మంగళంపల్లి బాలమురళీ కృష్ణ గారిది మాది ఎదురెదురు ఫ్లాట్లు కావడంతో, రెండు కుటుంబాల మధ్య మంచి స్నేహం ఏర్పడింది. శ్రీశ్రీ, ఆరుద్ర లాంటి మహాకవుల రాకపోకలతో మా ఇల్లు కళకళలాడుతుండేది. వచ్చిన వారికి మంచినీళ్లతో పాటు టీ, కాఫీలు అందించడమే కానీ నేనెప్పుడూ వారితో సంభాషించింది లేదు. నాన్న అప్పుడప్పుడు నన్ను మెరీనా బీచ్‌కు, సినిమాలకు తీసుకెళుతుండేవారు. ఒకవైపు సినిమా పాటలు, సాహిత్య కార్యక్రమాలతో ఎంత బిజీగా ఉన్నా మా కోసం తప్పకుండా కొంత సమయం కేటాయించేవారు. చిన్నాపెద్ద భేదాల్లేకుండా తనకు వచ్చిన ప్రతి ఉత్తరానికి తిరిగి జాబు రాయడం నాన్నకు అలవాటు. అలా కొన్ని వందల ఉత్తరాలు, నాన్న చెబుతుంటే నేను రాశాను. చాలా సాహిత్య సభలకు వెంట నేనూ వెళ్లాను. కానీ సినిమా షూటింగులకు తీసుకెళ్ళడం లాంటివి మాత్రం ఎప్పుడూ చేయలేదు.

> #### అక్కినేనికి 'గాలిబ్ గీతాలు' అంకితం
> సినీపరిశ్రమలో మా నాన్నకు అత్యంత ఆత్మీయులంటే అక్కినేని నాగేశ్వరరావు గారే.! అన్నపూర్ణ పిక్చర్స్ నిర్మించిన ప్రతి సినిమాలో నాన్న పాట తప్పనిసరిగా ఉండేది. ఆదుర్తి సుబ్బారావు దర్శకత్వంలోని 'మరో ప్రపంచం' సినిమాకు నాన్న ఒక పాట రాసి పారితోషికం తీసుకోలేదు. మహాత్మా గాంధీ శతజయంత్యుత్సవాల సందర్భంగా ఒక గొప్ప ఆశయాన్ని ప్రతిఫలిస్తూ తీసిన సినిమా కనుక వద్దన్నారు.

> ఓ రోజు ప్రముఖ దర్శక, నిర్మాత ఆర్. నారాయణ మూర్తిగారు సుద్దాల అశోక్‌తేజను వెంటపెట్టుకొని మా ఇంటికి వచ్చారు. "ఆ చల్లని సముద్రగర్భం...' పాట హక్కులు అడుగుతూ, మాకు కొంత డబ్బు కూడా ఇవ్వబోతే మేము తీసుకోలేదు. మా నాన్న ప్రజల మనిషి. ఆయన రాసిన ఆ పాటపై సర్వహక్కులు ప్రజలకే ఉంటాయి అని చెప్పాం.

అప్పుడు చాలా బాధపడ్డారు

అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా నాన్న బాధ్యతలు స్వీకరించాక, చెన్నైలో ఉంటూ తాను ఆ హోదాకు పూర్తి న్యాయం చేయలేననుకున్నారు. దాంతో 1979లో కుటుంబమంతా తిరిగి హైదరాబాద్‌కు వచ్చాం. ఆ సమయంలో చేతినిండా సినిమా అవకాశాలు ఉన్నా, స్వరాష్ట్రంలో సాహిత్య రంగానికి తనవంతు సేవ చేయాలన్న ఉద్దేశంతో వాటిని కాదనుకున్నారు. తాను ఒకటి తలిస్తే, విధి మరొకటి తలచిందన్నట్టు ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన వెంటనే ఆ పదవులను రద్దు చేయడంతో నాన్న చాలా బాధపడ్డారు. ఆస్థాన కవిగా అప్పటి వరకున్న కారు, హోదా లాంటివి పోయినందుకు కాదు, తెలుగు సమాజానికి తనవంతు సేవచేసే అవకాశం కోల్పోయినందుకు కొంత ఆవేదనకు లోనయ్యారు. కానీ అదెన్నడూ ఇంటిలో ప్రదర్శించలేదు. నాన్నకు కష్టాలు కొత్తకాదు కదా.! అదివరకే ఆకాశవాణి ఉద్యోగానికి రాజీనామా చేయడంతో కుటుంబ పోషణ కాస్త కష్టమైంది. అయినా, వెనక్కితగ్గలేదు. ఒకరి దగ్గర చేయి చాచకుండా, మాకు ఏ లోటు రాకుండా కుటుంబాన్ని చూసుకున్నారు. జనం గోడును వినిపించడమేకానీ తన వ్యక్తిగత బాధలకు మా నాన్న ఎప్పుడూ విలువ ఇవ్వలేదు. ప్రముఖ రచయితగా గుర్తింపు వచ్చిన తర్వాత కూడా చాలా సాహిత్య సమావేశాలకు కాలినడకన, మరీ దూరమైతే రిక్షాలో వెళ్లేవారు. నిర్వాహకులు కారు పంపుతామంటే కూడా వద్దు అనేవారు. నాన్న స్థితప్రజ్ఞత, సింప్లిసిటీ చూసి ఒక్కోసారి నాకే ఆశ్చర్యమేసేది.

> #### పిల్లలంటే అంత ప్రేమ
> నా భర్త పేరు వంగిపురపు గౌరీశంకర్. ఆయనది గుంటూరు జిల్లా. సినీ నేపథ్యగాయకుడు ఎమ్మెస్ రామారావు గారికి నా భర్త మేనల్లుడు (బావమర్ది కుమారుడు) అవుతారు. రామారావుగారితో నాన్నకు ఉన్న స్నేహం వల్ల మా పెళ్లి కుదిరింది. అలా ఆంధ్రా ఇంటి కోడలిని అయ్యాను. మాకు ఒక బాబు. వాడికి అరుణ్ కిరణ్ అని మా నాన్న పేరు పెట్టారు.

జైలు జీవితంతో జీవితకాల బాధ

నిజాం వ్యతిరేక పోరాటంలో పాల్గొన్న కారణంగా నాన్న 16నెలలకుపైగా ఖైదు అనుభవించారు. కానీ అది ఆయన ఆరోగ్యం మీద జీవితకాలం ప్రభావం చూపింది. జైల్లో రాజకీయ ఖైదీలకు సిమెంటు, సున్నం కలిపి చేసిన రొట్టెలు పెట్టేవారట. అవి తినడం వల్ల నాన్న జీర్ణవ్యవస్థ దెబ్బతింది. తర్వాత కొంతకాలానికి బీపీ, షుగర్ వచ్చాయి. మితాహారం తీసుకుంటూ చాలా క్రమశిక్షణగా ఉండేవారు. అయినా ఆయన ఆరోగ్యం దెబ్బతింది. నా ఒడిలోనే చివరి శ్వాస విడిచారు. నాన్న మాకు దూరమై 36ఏళ్లు దాటినా, తనను తలచుకోని రోజు లేదు. మా అమ్మ 2012లో కన్నుమూశారు. అమ్మానాన్నకు చివరి రోజుల్లో సేవ చేసే భాగ్యం నాకు దక్కింది. రాజకీయాలతో సంబంధంలేకుండా దాశరథి జయంత్యుత్సవాలను తెలంగాణ ప్రభుత్వం కొనసాగిస్తున్నందుకు ఆనందంగా ఉంది. ఇది దాశరథిగారి శత జయంతి సంవత్సరం. ఆ మహాకవి స్ఫూర్తిని ఈతరానికి తెలిపే ప్రయత్నాలు కొనసాగాలి. అదే ఆయనకు అసలైన నివాళులు.

● సాంత్వన్, ఫొటో: జ్వాలా కోటేశ్



హాట్ హిట్స్

ఈ వారం అమెజాన్ మ్యూజిక్‌లో దేశవ్యాప్తంగా ట్రెండ్ అవుతున్న టాప్-10 బాలీవుడ్ పాటలు...

1. తౌబా తౌబా (బ్యాడ్ న్యూజ్)
2. సాజ్‌నీ రే (లాపతా లేడీస్)
3. అఖియా గులాబ్ (తేరీ బాతోమ్‌మే ఐసా ఉల్జా జియా)
4. చలేయా (జవాన్)
5. సోనీ సోనీ (ఇష్క్.విష్క్ రీబౌండ్)
6. నైనా (క్రూ)
7. ఓ మాహీ (డంకీ)
8. అపనా బనాలే (భేడియా)
9. తేరీ బాతోమే (తేరీ బాతోమే ఐసా ఉల్జా జియా)
10. నాదానియా (నాదానియా)

ట్రెండింగ్ టాప్ తెలుగు సాంగ్:
కుర్చీ మడతపెట్టి (గుంటూరు కారం)

నవ్య | చిత్రజ్యోతి

రెండో సీజన్ వచ్చేస్తోంది

టీసీఏ ఫిబ్రవరిలో సెలబ్రిటీ క్రికెట్ కార్నివాల్ మొదటి సీజన్‌ను నిర్వహించిన సంగతి తెలిసిందే. ఆ సీజన్ సూపర్ హిట్ కావడంతో ఇప్పుడు నవంబరు 15, 16వ తేదీలలో రెండో సీజన్‌ను నిర్వహించనున్నారు. ఇందులో పలువురు సెలబ్రిటీలు ఆడనున్నారు. ఈ మ్యాచ్‌ల ద్వారా వచ్చిన మొత్తం డబ్బును ఆస్ట్రేలియాలోని 'రాయల్ చిల్డ్రన్స్ హాస్పిటల్ మెల్బోర్న్'కు విరాళంగా అందజేయనున్నారు. తాజాగా సీజన్ 2 సాఫ్ట్ పోస్టర్‌ను లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ఫౌండర్ సాయికృష్ణ



మాట్లాడుతూ "ఇందులో పాల్గొనే సెలబ్రిటీస్ ఎంతో బిజీగా ఉన్నా చారిటీ కోసం ఈ మ్యాచ్‌లు ఆడుతున్నందుకు సంతోషంగా ఉంది" అని అన్నారు. "ఈ రెండో సీజన్ మొదటి సీజన్ కంటే మరింత పెద్ద సక్సెస్ అవ్వాలని కోరుకుంటున్నాను" అని హీరో శ్రీకాంత్ అన్నారు. "ఇందులో ఆడే ప్రతీ ఒక్కరికీ క్రికెట్ అంటే ప్రాణం" అని హీరో తరుణ్ చెప్పారు. "సీజన్ 1లో ఆడటాన్ని బాగా ఎంజాయ్ చేశాను. సీజన్ 2 కోసం ఎదురుచూస్తున్నాను" అని సంగీత దర్శకుడు తమన్ అన్నారు. ఈ కార్యక్రమంలో తెలుగు సినీ హీరోలు ఆది సాయికుమార్, సుశాంత్, అశ్విన్‌బాబు, సామ్రాట్, ఓమ్‌కార్, ఆర్టిస్ట్ భూపాల్ పాల్గొన్నారు.


దర్శకుడిగా సంతృప్తినిచ్చింది - ధనుష్



'నటుడిగా నన్ను మీ గుండెల్లో పెట్టుకున్నారు. ఇప్పుడు 'రాయన్' చిత్రంతో దర్శకుడిగా మీ ముందుకు వస్తున్నాను. సినిమా చూసి నచ్చితే తెలుగు ప్రేక్షకులు అంతా మీ ఆశీస్సులు అందించాలి' అని హీరో ధనుష్ కోరారు. ఆయన హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ఈ నెల 26న విడుదలవుతోంది. సన్‌పిక్చర్స్ నిర్మించిన ఈ చిత్రాని ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పీ తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా ధనుష్ మాట్లాడుతూ "నేను అదృష్టవంతుణ్ని. సినిమాల్లోకి వచ్చాక నాకు అన్నీ కలసి వచ్చాయి. మంచి దర్శకులు, నిర్మాతలతో పనిచేసే అవకాశం నాకు దక్కింది. వారందరి కృషి వల్లే నేడు ఈ స్థాయిలో ఉన్నాను. దర్శకుడిగా నాకు సంతృప్తిని ఇచ్చిన చిత్రం 'రాయన్' అన్నారు. సందీప్ కిషన్ మాట్లాడుతూ 'ధనుష్ అన్న నన్ను పిలిచి ఈ సినిమా చేయమన్నాడు. ఆయన మీద నమ్మకంతో కథ కూడా వినకుండా ఈ సినిమా అంగీకరించాను. ధనుష్ తన కోసం రాసుకున్న పాత్రను నాకు ఇచ్చారు. ఆయన దర్శకత్వంలో నటించడం నా అదృష్టం' అన్నారు. దిల్‌రాజు మాట్లాడుతూ 'అద్భుతమైన నటనతో ప్రపంచవ్యాప్తంగా అభిమానగణాన్ని సొంతం చేసుకున్న నటుడు ధనుష్. ఆయనకు 'రాయన్' చిత్రంతో మరో ఘన విజయం దక్కాలి. 'గేమ్‌ఛేంజర్' సినిమాతో క్రిస్మస్‌కు కలుద్దాం' అన్నారు. సురేశ్‌బాబు మాట్లాడుతూ 'ధనుష్ చిన్నప్పటి నుంచే నాకు తెలుసు. రాయన్‌లో ఒక పాటకు లిరిక్స్ కూడా అందించాడు. ఆయనకు సినిమాపై ఉన్న ప్రేమకు ఇది నిదర్శనం. 'రాయన్' సినిమాను తెలుగు రాష్ట్రాల్లో డిస్ట్రిబ్యూట్ చేస్తున్నందుకు ఆనందంగా ఉంది' అన్నారు.

ప్రకాశ్‌రాజ్ మాట్లాడుతూ 'ఈ సినిమాలో నటించినవాళ్లందరిలో ఓ ఆకలి కనిపిస్తోంది. గొప్ప నటులను ఒకతాటిపైకి తెచ్చాడు ధనుష్. ఆయన ఇప్పుడు ఒక దర్శకుడిగా ప్రేక్షకుల ముందుకు వస్తున్నాడు. తనలో క్లారిటీ ఉంది. కొన్ని తరాలకు అతనో స్ఫూర్తి' అని చెప్పారు.

రిలీజ్‌కు సిద్ధమైన బచ్చన్



హరీశ్ శంకర్ దర్శకత్వంలో రవితేజ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటిస్తున్న చిత్రం 'మిస్టర్ బచ్చన్'. 'నామ్ తో సునాహోగా' ట్యాగ్ లైన్. జగపతి బాబు, సచిన్ ఖేడేకర్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. టీ.జీ.విశ్వప్రసాద్ నిర్మిస్తున్నారు. సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనుల్లో ఉంది. మాస్ ప్రేక్షకులంతా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ఈ సినిమా రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. స్వతంత్ర దినోత్సవం సందర్భంగా ఆగస్టు 15న సినిమాను విడుదల చేయనున్నట్లు ఓ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. సినిమాలో రవితేజ, బిగ్ బీ అమితాబ్ ఫ్యాన్‌గా కనిపించనున్నారు. ఇందులో ఆయన ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ పాత్రను పోషించనున్నారు. యాక్షన్‌తో కూడుకున్న ఈ మాస్ ఎంటర్‌టైనర్ అందరికీ నచ్చుతుందని చిత్ర బృందం ధీమాగా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: ఉజ్వల్ కులకర్ణి, డీఓపీ:అయనంక బోస్, సంగీతం: మిక్కీ.జే. మేయర్.

సహృదయాన్ని చాటుకున్న శేష్



సినిమాల్లో తన నటనతో అందర్నీ ఆకట్టుకునే నటుల్లో అడవి శేష్ ఒకరు. ఆయన తాజాగా ఓ చిన్నారి విషయంలో, తన సహృదయాన్ని చాటుకున్నారు. తన అభిమాని అయిన ఓ చిన్నారి క్యాన్సర్‌తో బాధపడుతున్న సంగతి తెలుసుకున్న శేష్, ఆ చిన్నారిని కలసి.. ఒక రోజంతా ఆడుతూ పాడుతూ గడిపారు. ఈ చిన్నారి విషయంలో ఎటువంటి సాయం కావాలన్నా అందుబాటులో ఉంటానని ఆమె కుటుంబ సభ్యులకు హామీనిచ్చారు.

ఘన విజయం సాధించాలి



పులివెందుల మహేశ్ స్వీయ దర్శకత్వంలో నటిస్తున్న చిత్రం 'స్కూల్ లైఫ్'. సావిత్రి కృష్ణ, సుమన్, ఆమని కీలక పాత్రలు పోషిస్తున్నారు. నైనీషా, రాహుల్ త్రిశూల్ నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ సినిమాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ "ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు. సినిమా ఘన విజయం సాధించాలని కోరుకుంటున్నాను" అని అన్నారు. "ఈ సినిమాలోని అధిక శాతం షూటింగ్ క్రౌడ్ ఫండింగ్ ద్వారా తెరకెక్కింది. బడ్జెట్ సరిపోకపోవడంతో సినిమాకు కావాల్సిన మిగిలిన మొత్తాన్ని నిర్మాతలు ఇచ్చారు. సినిమా విజయంపై పూర్తి నమ్మకం ఉంది" అని హీరో, దర్శకుడు పులివెందుల మహేశ్ అన్నారు. "ప్రేక్షకులు మంచి కంటెంట్ ఉన్న చిత్రాల్ని తప్పక ఆదరిస్తారు. ఈ సినిమా కూడా అలాంటిదే" అని నిర్మాత రాహుల్ త్రిశూల్ చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎస్.హరిబాబు, డీఓపీ: ధర్మ ప్రభ, సంగీతం: హర్ష ప్రవీణ్.



విశ్వక్ సేన్, మీనాక్షి చౌదరి, శ్రద్ధా శ్రీనాథ్ హీరోహీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'మెకానిక్ రాకీ'. ఈ ముక్కోణపు ప్రేమకథని రవితేజ్ ముళ్లపూడి దర్శకత్వంలో రామ్ తుళ్లూరి నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ సెట్స్‌లోకి శ్రద్ధా శ్రీనాథ్ అడుగుపెట్టారు.

ట్రెండీ లుక్‌లో స్టైలిష్‌గా

ఆమెను ఆహ్వానిస్తూ.. మేకర్స్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను రిలీజ్ చేశారు. శ్రద్ధా ఇందులో ట్రెండీ లుక్‌లో స్టైలిష్‌గా ఉంది. ఈ చిత్రానికి ఎడిటర్: అన్వర్ అలీ, డీఓపీ: మనోజ్ కటసాని, సంగీతం: జేక్స్ బిజోయ్.

హాకీ జట్టు లక్ష్యం.. పునర్వైభవం



ఒలింపిక్స్ పురుషుల హాకీలో భారత్‌ది తిరుగులేని ఆధిపత్యం. ఒకటి రెండు కాదు ఏకంగా ఎనిమిది స్వర్ణాలు సాధించడం మన జట్టు సత్తాకు తార్కాణం. కానీ ఇదంతా గతం. 1980 మాస్కో విశ్వక్రీడల్లో మన జట్టు చివరి పసిడి పతకం అందుకున్నాక భారత హాకీ ప్రమాణాలు పూర్తిగా దిగజారాయి. మళ్లీ పుంజుకొని ఒలింపిక్స్ హాకీలో పతకం కోసం నాలుగు దశాబ్దాలకుపైగా వేచి చూడాల్సి వచ్చింది. మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో జట్టు గత టోక్యో క్రీడల్లో చారిత్రక కాంస్య పతకంతో హాకీ ప్రేమికుల్లో నూతనోత్సాహం నింపింది. ఈసారి హర్మన్‌ప్రీత్ కెప్టెన్సీలో బరిలో దిగుతున్న మన జట్టు మరింత మెరుగ్గా రాణించాలని పట్టుదలగా ఉంది. తద్వారా ఒలింపిక్స్ హాకీలో పునర్వైభవం తీసుకు రావడమే లక్ష్యంగా నిర్దేశించుకుంది.

టోక్యో గేమ్స్‌లో కాంస్య పతకం గెలిచిననాటి మధుర స్మృతులు మదిలో మెదులుతుండగా పురుషుల హాకీ జట్టు పారిస్‌లో కాలుమోపింది. 41 ఏళ్ల పతక కరువును తీరుస్తూ గత ఒలింపిక్స్‌లో కాంస్య పతకం చేజిక్కించుకున్న నాటి భారత జట్టులోని 11 మంది ఆటగాళ్లు ఈసారీ ఆడుతున్నారు. 2023 ఏషియాడ్‌లో స్వర్ణ పతకం కైవసం చేసుకోవడం ద్వారా పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ నేరుగా క్వాలిఫై అయ్యింది. క్రెయిగ్ ఫుల్టన్ కోచింగ్‌లో మనోళ్ల ఆటతీరు పూర్తిగా మారిపోయింది. ఎదురు దాడికి దిగుతూనే డిఫెన్సుకూ ప్రాధాన్యమిస్తోంది. దాంతో గత ఏడాదిగా ప్రపంచ మేటి జట్లను మట్టికరిపించి విజయాలు అందుకుంది. ఇక, పారిస్ విశ్వక్రీడల్లో భారత జట్టు.. డిఫెండింగ్ చాంపియన్ బెల్జియం, ఆస్ట్రేలియా, అర్జెంటీనా, న్యూజిలాండ్, ఐర్లాండ్‌లతో కలిసి గ్రూప్-బి నుంచి తలపడుతోంది. కాగా, భారత్ తదుపరి రౌండ్‌కు చేరాలంటే ఆరుజట్ల ఈ గ్రూప్‌లో టాప్-4లో నిలవాల్సి ఉంటుంది. అనుభవజ్ఞులు, యువకుల సమాహారంతో పారిస్ ఒలింపిక్స్‌కు సిద్ధమైన భారత్.. స్వర్ణ పతకాన్ని సాధించి పునర్వైభవం దిశగా అడుగులు వేయాలని కోరుకుందాం.

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

పారిస్ ఒలింపిక్స్ 4 రోజుల్లో

బాణం దూసుకెళ్లాలి!

ప్రపంచ ఆర్చరీలో ఇన్నాళ్లూ సౌత్ కొరియాదే ఆధిపత్యం. కానీ ఇటీవల వరల్డ్ కప్‌లలో ఆ జట్టుకు చెక్‌పెట్టిన ఘనత భారత్‌ది. ఇదే జోరును విశ్వక్రీడల్లో చూపాలనుకుంటున్న భారత్.. అందుకు తగ్గట్టే ఆరుగురు ఆర్చర్లతో పారిస్‌కు సిద్ధమైంది. ఐదు పతకాలే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది.



తరుణ్‌దీప్ రాయ్

ఒలింపిక్స్ ఆర్చరీలో ఇప్పటి వరకు భారత జట్టు ఒక్క పతకమూ సాధించలేదు. 2004-2020 మధ్య భారత పురుషులు, మహిళలు, మిక్స్‌డ్ జట్లు ఆరుసార్లు విశ్వక్రీడల క్వార్టర్‌ఫైనల్స్‌కు చేరాయి తప్ప పోడియం ఫినిష్ చేయలేకపోయాయి. ఇక ఈసారి ఒలింపిక్స్‌లో ఆరుగురు సభ్యుల భారత బృందం మొత్తం ఐదు విభాగాల్లో అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. విశ్వక్రీడల ఆర్చరీ పురుషులు, మహిళల అన్ని కేటగిరీల్లో భారత్ తలపడనుండడం 12 ఏళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం.

ఇనుమడించిన ఆత్మవిశ్వాసం: పారిస్ ఒలింపిక్స్ అన్ని విభాగాల్లో కోటాలు కైవసం చేసుకోవడం ఆషామాషీకాదు. కానీ ఈ ఘనత సాధించిన పురుషులు, మహిళల ఆర్చరీ జట్లు ఇనుమడించిన ఉత్సాహంతో ఈసారి క్రీడల్లో పతకాలు అందుకోవాలని పట్టుదలగా ఉన్నాయి. మన రికర్వ్ ఆర్చర్లు ఇటీవలి కాలంలో అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ ఏడాది మూడు దశల వరల్డ్ కప్‌లలో... రెండు దశలలో ఆర్చర్లు పతకాలు సాధించారు. ఇది.. తెలుగు ఆర్చర్ ధీరజ్ బొమ్మదేవర (తొలి ఒలింపిక్స్), తరుణ్ దీప్‌రాయ్ (నాలుగో ఒలింపిక్స్), ప్రవీణ్ జాదవ్ (రెండో ఒలింపిక్స్)లో ఆత్మవిశ్వాసాన్ని రెట్టింపు చేసింది.



దీపిక నేతృత్వంలో..

నాలుగో ఒలింపిక్స్ బరిలో దిగుతున్న అపార అనుభవజ్ఞురాలు దీపికా కుమారి ఆధ్వర్యంలో మహిళల జట్టు పారిస్‌లో అడుగుపెట్టింది. జట్టులో మిగతా ఇద్దరు భజన్ కౌర్, అంకితా భకత్ విశ్వక్రీడల్లో అరంగేట్రం చేస్తున్నారు. షాంఘై ప్రపంచ కప్‌లో దీపిక రజతం గెలుపొందగా, ధీరజ్‌తో కలిసి భజన్ మిక్స్‌డ్‌లో కాంస్య పతకం నెగ్గడం సానుకూల పరిణామం. అంటాల్యా వరల్డ్ కప్‌లో మహిళల జట్టు, అంకిత వ్యక్తిగత విభాగంలో నాలుగో స్థానంలో నిలవడం పారిస్ క్రీడలకు ముందు ఆత్మవిశ్వాసం నింపేదే. ఇంకా..గత మూడు సంవత్సరాల్లో పారిస్‌లో జరిగిన ప్రపంచ కప్‌లలో మన ఆర్చర్లు పతకాలు సొంతం చేసుకోవడం మరో సానుకూలాంశం.



ధీరజ్ స్కోరు బెటర్

ఆర్చరీలో బాణాల సగటు స్కోరు ఎంతో ముఖ్యం. ఇందులో ధీరజ్ స్కోరు 9.4 కాగా రాయ్‌ది 9.3, జాదవ్‌ది 9.2గా ఉంది. అంతేకాదు ఈ సీజన్‌లో క్వాలిఫికేషన్ రౌండ్లలో 720 గరిష్ఠ స్కోరుకుగాను ధీరజ్ (693), రాయ్ (684), జాదవ్ (674) కెరీర్ బెస్ట్ స్కోర్లు నమోదు చేశారు. ఇంకా..షాంఘైలో జరిగిన వరల్డ్ కప్ స్టేజ్-1 ఫైనల్లో ప్రపంచ విజేత దక్షిణ కొరియాకు షాకివ్వడం భారత పురుషుల జట్టు సత్తాకు నిదర్శనం. వరల్డ్ కప్ స్టేజ్-3 వ్యక్తిగత విభాగంలో కంచు మోత మోగించిన ధీరజ్.. భజన్ కౌర్‌తో కలిసి మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం సాధించాడు. మొత్తంగా ముగ్గురు పురుష ఆర్చర్లు ఒలింపిక్స్‌లో భారత ముఖచిత్రాన్ని మార్చి వేయడమే లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.



క్రీడాగ్రామంలో యాంటీ సెక్స్ బెడ్స్?

పారిస్: ఒలింపిక్స్ అంటే క్రీడాగ్రామంలో సౌకర్యాలపై చర్చ మొదలవడం సాధారణం. గతంలోలాగే ఈసారీ అథ్లెట్లకు కేటాయించిన బెడ్‌లపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. శృంగారం కట్టడి కోసం అథ్లెట్ల గదుల్లో తక్కువ సామర్థ్యమున్న బెడ్‌లు అంటే.. 'యాంటీ సెక్స్ బెడ్స్' ఏర్పాటు చేశారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. గత టోక్యో విశ్వక్రీడల్లో కరోనా వైరస్ దృష్ట్యా అథ్లెట్లు శృంగార కార్యకలాపాల్లో పాల్గొనకుండా నిరోధించడం కోసం అట్టలతో (కార్డ్‌బోర్డ్‌తో) చేసిన బెడ్‌లను అథ్లెట్ల గదుల్లో ఉంచారన్న వ్యాఖ్యలు వినిపించాయి. అయితే, అట్టలతో చేసినా అవి దృఢంగా ఉంటాయనీ.. యాంటీ సెక్స్ బెడ్స్ మాత్రం కాదని అప్పట్లోనే నిర్వాహకులు వాటిని ఖండించారు. తాజాగా పారిస్‌లోని క్రీడాగ్రామంలో ఇదే తరహా బెడ్‌లు దర్శనమిస్తున్నాయన్న వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. ఈసారి కూడా ఆ తరహా బెడ్‌లే కనిపిస్తున్నా.. వాటిని వందశాతం రీసైకిల్ చేయడానికి అవకాశమున్న కార్డ్‌బోర్డ్‌లను బెడ్‌ల తయారీకి వాడినట్టు నిర్వాహకులు చెబుతున్నారు.



బౌలింగ్ కోచ్‌గా బహుతులే

న్యూఢిల్లీ: శ్రీలంక పర్యటనలో భారత జట్టు తాత్కాలిక బౌలింగ్ కోచ్‌గా సాయిరాజ్ బహుతులే వ్యవహరించనున్నాడు. ఈనెల 27 నుంచి జట్టు ఆడే 3 టీ20, 3 వన్డేలకు అతను సేవలందిస్తాడు. వాస్తవానికి దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్‌ను బౌలింగ్ కోచ్‌గా నియమించే అవకాశం ఉండగా.. అతడు వ్యక్తిగత కారణాలరీత్యా ఈ సిరీస్‌కు అందుబాటులో ఉండడం లేదు. సెప్టెంబరులో బంగ్లాదేశ్‌తో టెస్టు సిరీస్‌కు అతడు జట్టుతో చేరనున్నాడు. ఇక గత మూడేళ్లుగా సాయిరాజ్ జాతీయ క్రికెట్ అకాడమీలో బౌలింగ్ కోచ్‌గా ఉంటున్నాడు.

ఇంగ్లండ్‌దే సిరీస్

రెండో టెస్టులో విండీస్ చిత్తు

నాటింగ్‌హామ్: వెస్టిండీస్‌తో జరిగిన రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు 241 పరుగుల భారీ తేడాతో ఘనవిజయం సాధించింది. దీంతో మూడు టెస్టుల సిరీస్‌ను మరో మ్యాచ్ ఉండగానే 2-0తో దక్కించుకుంది. ఆదివారం నాలుగో రోజు ఆటలో జో రూట్ (122), హ్యారీ బ్రూక్ (109) శతకాలతో ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 425 పరుగులకు ఆలౌటైంది. జేడెన్ సీల్స్‌కు నాలుగు, అల్జారిలకు రెండు వికెట్లు దక్కాయి. ఇక 385 పరుగుల ఛేదన కోసం బరిలోకి దిగిన విండీస్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. స్పిన్నర్ బషీర్ (5/41) ధాటికి 36.1 ఓవర్లలో 143 పరుగులకే కుప్పకూలింది. బ్రాత్‌వైట్ (47), హోల్డర్(37) మాత్రమే రాణించారు. ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 416, విండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 457 పరుగులు చేశాయి. ఒక టెస్టులో తొలి మూడు ఇన్నింగ్స్‌లోనూ 400కు పైగా పరుగులు నమోదవడం ఇదే తొలిసారి.



హాల్ ఆఫ్ ఫేమ్‌లో పేస్, విజయ్

న్యూపోర్ట్ (అమెరికా): టెన్నిస్ హాల్ ఆఫ్ ఫేమ్‌లో భారత దిగ్గజాలు లియాండర్ పేస్, విజయ్ అమృత్‌రాజ్‌లకు చోటు దక్కింది. టెన్నిస్‌లో ఆసియా నుంచి ఈ అరుదైన గౌరవం దక్కించుకున్న క్రీడాకారులు వీరే కావడం విశేషం. 51 ఏళ్ల పేస్ ప్లేయర్ కేటగిరీలో, 70 ఏళ్ల విజయ్ టెన్నిస్‌కు సంబంధించి కంట్రిబ్యూటర్ విభాగంలో హాల్ ఆఫ్ ఫేమ్‌కు ఎంపికయ్యారు.



1 భారత మహిళల జట్టు తరఫున టీ20ల్లో ఎక్కువ పరుగులు (3415) సాధించిన బ్యాటర్‌గా హర్మన్‌ప్రీత్. మంధాన (3378)ను అధిగమించింది.

దంచికొట్టారు

యూఏఈపై భారత్ ఘనవిజయం
చెలరేగిన రిచా, హర్మన్

దంబుల్లా: మహిళల టీ20 ఆసియాకప్‌లో భారత జట్టు నుంచి మరో అద్భుత ప్రదర్శన. ఆదివారం యూఏఈతో జరిగిన మ్యాచ్‌లో ఈసారి బ్యాటర్లు చెలరేగి తొలిసారిగా ఈ ఫార్మాట్‌లో 200+ స్కోరును అందించారు. ఆ తర్వాత బౌలర్ల కట్టుదిట్టమైన బౌలింగ్ కారణంగా జట్టు 78 పరుగుల తేడాతో ఘన విజయం సాధించింది. వరుసగా రెండో గెలుపుతో భారత్ దాదాపు సెమీస్ బెర్త్ ఖాయం చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 201 పరుగులు చేసింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ (47 బంతుల్లో 7 ఫోర్లు, 1 సిక్స్‌తో 66), రిచా ఘోష్ (29 బంతుల్లో 12 ఫోర్లు, 1 సిక్స్‌తో 64 నాటౌట్) తుఫాన్ ఇన్నింగ్స్‌తో అలరించారు. కవిషకు 2 వికెట్లు దక్కాయి. ఛేదనలో యూఏఈ 20 ఓవర్లలో 7 వికెట్లకు 123 రన్స్‌కే పరిమితమైంది. కవిష (40 నాటౌట్), ఇషా (38) మాత్రమే రాణించారు. దీప్తి 2 వికెట్లు తీసింది. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా రిచా నిలిచింది.

చివర్లో జోరు: ఓపెనర్ మంధాన (13) త్వరగానే అవుటైనా..షఫాలీ (37) మెరుపులకు ఓవర్‌కు పది రన్‌రేట్‌తో స్కోరు దూసుకెళ్లింది. అయితే 52/3 స్కోరుతో ఇబ్బందిపడిన దశలో కెప్టెన్ హర్మన్ కీలక ఇన్నింగ్స్‌తో ఆదుకుంది. ముందుగా జెమీమా (14)తో కలిసి నాలుగో వికెట్‌కు 54 రన్స్ జత చేసింది. ఆ తర్వాత రిచా బరిలోకి దిగడంతో స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. 15వ ఓవర్‌లో రిచా 4 ఫోర్లతో 18 రన్స్ రాబట్టింది. అటు 19వ ఓవర్‌లో హర్మన్ 4,4,6తో ధాటిని ప్రదర్శించి ఆఖరి ఓవర్ తొలి బంతికి రనౌటైంది. దీంతో ఐదో వికెట్‌కు 75 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. ఆ తర్వాత చివరి ఐదు బంతులను రిచా 4,4,4,4,4గా బాది 25 బంతుల్లోనే తన తొలి ఫిఫ్టీని పూర్తి చేయగా, జట్టు స్కోరు కూడా 200 దాటింది. కాగా, మరో మ్యాచ్‌లో పాకిస్థాన్ ఏడు వికెట్ల తేడాతో నేపాల్‌ను ఓడించింది.

సంక్షిప్త స్కోర్లు
భారత్: 20 ఓవర్లలో 201/5 (హర్మన్ 66, రిచా 64 నాటౌట్, షఫాలీ 37; కవిష 2/36).
యూఏఈ: 20 ఓవర్లలో 123/7 (కవిష 40 నాటౌట్, ఇషా 38; దీప్తి శర్మ 2/23).

ఆసియాకప్‌నకు శ్రేయాంక దూరం

భారత ఆఫ్‌స్పిన్నర్ శ్రేయాంక పాటిల్ చేతి వేలికి ఫ్రాక్చర్ కావడంతో ఆసియాకప్‌నకు దూరమైంది. పాక్‌తో జరిగిన ఆరంభ మ్యాచ్‌లో తను గాయపడింది. దీంతో పాటిల్ స్థానంలో రిజర్వ్ ప్లేయర్‌గా ఉన్న లెఫ్టామ్ స్పిన్నర్ తనూజ కన్వర్‌ను తీసుకున్నారు.

బిజినెస్

8 ఐపీఓలు.. 8 లిస్టింగ్‌లు

ఈ వారం ప్రైమరీ మార్కెట్ బిజీ బిజీ

న్యూఢిల్లీ: ప్రైమరీ మార్కెట్లో ఈ వారం చాలా సందడి ఏర్పడనుంది. మొత్తం 8 కంపెనీలు పబ్లిక్ ఇష్యూలు (ఐపీఓ) జారీ చేయనుండగా మరో 8 కంపెనీలు స్టాక్ ఎక్స్ఛేంజీల్లో లిస్టింగ్ కానున్నాయి. ఇవన్నీ ఎస్ఎంఈ విభాగంలోనివే కావడం విశేషం. పబ్లిక్ ఇష్యూకి వస్తున్న 8 కంపెనీలు రూ.410 కోట్ల సమీకరణ లక్ష్యం పెట్టుకున్నాయి. వాటిలో ఎస్‌పీఆర్ టెక్నాలజీస్ జారీ చేస్తున్న రూ.150 కోట్ల ఫాలో ఆన్ ఇష్యూ (ఎఫ్‌పీఓ) కూడా ఉంది.

లిస్టింగ్‌కు రానున్న కంపెనీలివే : ఫ్రైజర్ విజ్‌టెక్, సతీ పోలీప్లాస్ట్, శ్రీ ఎం పేపర్ బోర్డ్స్, ఏలియా కమోడిటీస్, తున్వాల్ ఈ-మోటార్స్, మాకాబ్స్ టెక్నాలజీస్, కటారియా ఇండస్ట్రీస్. ఇవన్నీ ఎంఎస్ఈ విభాగంలోనివి కాగా మొక్కలకు చెందిన పోషకాహార ఉత్పత్తుల తయారీలోని సాన్‌స్టార్ కంపెనీ 26వ తేదీన ప్రధాన ఎక్స్ఛేంజీలో లిస్టింగ్ కానుంది.

పబ్లిక్ ఇష్యూకి వస్తున్న కంపెనీల వివరాలివే...

కంపెనీ	సమీకరణ లక్ష్యం	షేరు ధర శ్రేణి (రూ.)	ప్రారంభ-ముగింపు తేదీ
ఆర్ఎన్ఎఫ్ఐ సర్వీసెస్	70.81 కోట్లు	98-105	22-24
ఎస్‌పీఆర్ టెలీవెంచర్	150 కోట్లు	200-210	19-24
వీఎల్ ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్స్	18.52 కోట్లు	39-42	23-25
వీవీఐపీ ఇన్‌ఫ్రాటెక్	61.21 కోట్లు	91-93	23-25
చేతనా ఎడ్యుకేషన్	45.9 కోట్లు	80-85	24-26
మంగళం ఇన్‌ఫ్రా	27.62 కోట్లు	53-56	24---
క్లినిటెక్ లేబరేటరీ	5.78 కోట్లు	96	25-29
అప్రమేయ ఇంజనీరింగ్	29.23 కోట్లు	56-58	25-29

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	112	విజయవాడ	117
వరంగల్	112	గుంటూరు	118
కరీంనగర్	112	ఒంగోలు	118
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	129
కర్నూలు	112	నెల్లూరు	129
విశాఖపట్నం	106	అనంతపురం	117
గోదావరి	117		



ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

22వ తేదీ

హైదరాబాద్	520	విజయవాడ	530
వరంగల్	522	గోదావరి	520
చిత్తూరు	573	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	



ఏఐ, ఎంఎల్ జాబ్స్‌కు డిమాండ్

2022 నుంచి 433% పెరుగుదల : ఇన్‌డీడ్

ముంబై: ఇన్ఫర్మేషన్, టెక్నాలజీ (ఐటీ) ఇండస్ట్రీ స్తబ్దుగా ఉంది. నియామకాలకు కంపెనీలు దాదాపుగా ఫుల్‌స్టాప్ పెట్టాయి. క్యాంపస్ రిక్రూట్‌మెంట్లో ఎంపికైన అభ్యర్థులకూ కంపెనీలు ఏదో ఒక సాకుతో రిక్తహస్తం చూపిస్తున్నాయి. అయితే కృత్రిమ మేధ (ఏఐ), మెషిన్ లెర్నింగ్ (ఎంఎల్) వంటి సరికొత్త టెక్నాలజీలపై పట్టున్న ఇంజనీర్లను మాత్రం ఐటీ కంపెనీలు మంచి మంచి ప్యాకేజీలతో ఎగరేసుకుపోతున్నాయి. 2022తో పోలిస్తే ఐటీ రంగంలో ఇలాంటి ఇంజనీర్ల డిమాండ్ 433 శాతం పెరిగింది. ఇదే సమయంలో బిజినెస్ ప్రాసెసింగ్ ఔట్‌సోర్సింగ్ (బీపీఓ) రంగమూ రాణిస్తోంది. ఈ రంగానికి చెందిన ఎగ్జిక్యూటివ్స్ డిమాండ్ గత రెండేళ్లలో 314 శాతం పెరిగింది. ఉద్యోగ నియామకాల తీరుతెన్నులను పరిశీలించే 'ఇన్‌డీడ్' అనే సంస్థ ఒక నివేదికలో ఈ విషయం తెలిపింది.

ఇతర రంగాలదీ అదే బాట: కొవిడ్ తర్వాత పర్యాటక, ఇతర వ్యాపారాలు బాగా పుంజుకున్నాయి. ఏ మాత్రం టైమ్ దొరికినా ఉద్యోగులు తీర్థయాత్రకో, విహార యాత్రకో చెక్కేస్తున్నారు. దీంతో గత రెండేళ్లలో ట్రావెల్ కన్సల్టెంట్ల గిరాకీ 285 శాతం పెరిగింది. ఇదే సమయంలో ఫ్రంట్ ఆఫీస్ సిబ్బందిలో అతి ముఖ్యమైన రిసెప్షనిస్టుల డిమాండ్ 310 శాతం పెరిగినట్టు ఇన్‌డీడ్ వెల్లడించింది. రియల్టీ బూమ్‌తో శానిటేషన్, నిర్మాణ రంగ నిపుణులు, ఎలక్ట్రీషియన్‌ల గిరాకీ కూడా గత రెండేళ్లలో 121 నుంచి 258 శాతం వరకు పెరిగింది. వీటికి తోడు గత రెండేళ్లలో విద్య వైద్య పరిశోధన రంగాల నిపుణులకూ గిరాకీ భారీగా పెరిగినట్టు నివేదిక తెలిపింది.



హైదరాబాద్‌లో ఎయిర్‌బస్ హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్?

మరిగ్నేన్ (ఫ్రాన్స్): ఎయిర్‌బస్ కంపెనీకి చెందిన హెచ్125 హెలికాప్టర్ల అసెంబ్లింగ్‌కు హైదరాబాద్ కేంద్రమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ హెలికాప్టర్ల తుది అసెంబ్లింగ్ కోసం ఎయిర్‌బస్ కంపెనీ ఇప్పటికే దేశంలో ఎనిమిది ప్రాంతాలను పరిశీలిస్తోంది. అందులో హైదరాబాద్ కూడా ఉన్నట్టు సమాచారం. దీనికి తోడు ఈ హెలికాప్టర్ల తుది అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు కోసం ఎయిర్‌బస్ ఈ ఏడాది జనవరిలో టాటా గ్రూప్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకుంది. టాటా గ్రూప్ కంపెనీ టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్ (టీఏఎస్ఎల్)కు హైదరాబాద్‌లోని ఆదిభట్ల వద్ద ఇప్పటికే ఒక ప్లాంట్ ఉంది. ఇందులో అమెరికాకు చెందిన సికోర్‌స్కీతో సహా పలు హెలికాప్టర్ కంపెనీలకు విడి భాగాల తయారు చేసి సరఫరా చేస్తున్నారు. దీంతో ఎయిర్‌బస్, టాటా గ్రూప్‌తో కలిసి హైదరాబాద్‌లోనే హెచ్125 హెలికాప్టర్ల పూర్తి అసెంబ్లింగ్ ప్లాంట్ ఏర్పాటు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ ఏడాది చివరిలోగా ప్లాంట్ ఏర్పాటు చేసే ప్రాంతాన్ని ఖరారు చేయటంతో పాటు శంకుస్థాపన చేయాలని ఎయిర్‌బస్ యోచిస్తోంది.

2047 నాటికి రూ.83 లక్షల కోట్లు

ఐఓసీ ఆదాయ లక్ష్యం

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీ) 2047 నాటికి లక్ష కోట్ల డాలర్ల (రూ.83 లక్షల కోట్లు) ఆదాయ లక్ష్యం పెట్టుకుంది. సాంప్రదాయిక ఇంధన రిటైలింగ్, మార్కెటింగ్ విభాగంతో పాటుగా హరిత హైడ్రోజెన్, ఈవీ చార్జింగ్ వంటి కొత్త రంగాల్లో కూడా మంచి వృద్ధిని నమోదు చేయడం ద్వారా ఈ లక్ష్యం సాధించనున్నట్టు ఐఓసీ చైర్మన్ శ్రీకాంత్ మాధవ్ వైద్య ఇటీవల విడుదల చేసిన తాజా నివేదికలో తెలిపారు. మార్చి 31వ తేదీతో ముగిసిన 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఐఓసీ రూ.8.66 లక్షల కోట్ల ఆదాయంపై రికార్డు స్థాయిలో రూ.39,619 కోట్ల లాభం ఆర్జించింది. 2046 నాటికి నెట్ జీరో సాధన లక్ష్యంగా కంపెనీ శిలాజ ఇంధన విభాగంతో పాటు నూతన ఇంధన విభాగాల్లో కూడా విశేషంగా పెట్టుబడులు పెడుతుందని వైద్య చెప్పారు. 2050 నాటికి ఇంధన రంగంలో 12.5 శాతం వాటాతో (ఎనిమిదింట ఒక వంతు) దేశానికి ఇంధనం అందించే ప్రధాన సంస్థగా మారాలన్నది తమ లక్ష్యమని చెప్పారు. కాగా ఖైదీల కోసం ఎనిమిదో విడత పరివర్తన్- ప్రిజన్ టు ప్రైడ్, జువైనల్స్ కోసం ఐదో విడత నయా దిశ-స్మైల్ ఫర్ జువైనల్ కార్యక్రమాన్ని ఐఓసీ ప్రారంభించింది.

వచ్చే ఏడాది ఐపీఓకి ఎన్ఎల్‌సీ రెన్యూవబుల్స్

నైవేలీ (తమిళనాడు): ప్రభుత్వ రంగంలోని ఇంధన సంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా రెన్యూబుల్స్ లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఆర్ఎల్) పబ్లిక్ ఇష్యూ (ఐపీఓ)కు సిద్ధమవుతోంది. ఈ ఐపీఓ వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26) తొలి త్రైమాసికంలో ఉంటుందని ఎన్ఎల్‌సీఐఆర్ఎల్ మాతృసంస్థ ఎన్ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్ఎల్‌సీఐఎల్) సీఎండీ మోటుపల్లి ప్రసన్న కుమార్ చెప్పారు. ఐపీఓ ద్వారా సేకరించే నిధులను ఎన్ఎల్‌సీఐఆర్ఎల్ పునరుత్పాదక ఇంధన ఉత్పత్తి సామర్థ్యాన్ని ప్రస్తుత 1,400 మెగావాట్ల నుంచి 2030 నాటికి 6,000 మెగావాట్లకు విస్తరించేందుకు ఉపయోగిస్తామన్నారు.

టెక్ వ్యూ

మద్దతు స్థాయి 24,400



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 24,500 వద్ద ప్రారంభమై 24,850 వరకు వెళ్లినా శుక్రవారం ఆ స్థాయిలో బలమైన రియాక్షన్‌కు గురై 270 పాయింట్ల మేరకు నష్టపోయింది. వారం మొత్తం మీద 28 పాయింట్ల స్వల్ప లాభంతో ముందువారం ముగింపు స్థాయి 24,530 సమీపంలో ఫ్లాట్‌గా ముగిసింది. వారం కనిష్ఠ స్థాయిలో ముగియడం అమ్మకాల ఒత్తిడికి సంకేతం. నిఫ్టీ గత 10 వారాల ర్యాలీలో జూన్ నాల్గవ తేదీన ఏర్పడిన కనిష్ఠ స్థాయి 21,300 నుంచి 3,500 పాయింట్ల మేరకు లాభపడింది. టెక్నికల్‌గా అప్‌ట్రెండ్ కొనసాగుతున్నప్పటికీ కరెక్షన్ లేదా కన్సాలిడేషన్ ఏర్పడవలసి ఉంది. గత గురువారం బ్రేకౌట్ సాధించిన నిఫ్టీ శుక్రవారం దిగువకు రివర్సల్ తీసుకోవడం అప్రమత్త సంకేతం. కాగా గత వారం మిడ్ క్యాప్-100 ఇండెక్స్ 1,260 పాయింట్లు, స్మాల్‌క్యాప్-100 ఇండెక్స్ 550 పాయింట్లు నష్టపోయాయి. అమెరికన్ మార్కెట్లలో ఏర్పడిన కరెక్షన్ కారణంగా మన మార్కెట్ ఈ వారంలో మరింత బలహీనపడే ఆస్కారం ఉంది. 24,400 వద్ద కనిష్ఠ స్థాయిలో పరీక్ష ఎదుర్కొనవచ్చు.

బుల్లిష్ స్థాయిలు: మరింత అప్‌ట్రెండ్ కోసం నిఫ్టీ నిరోధ స్థాయి 24,600 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 24,850. గత వారం ఇక్కడే కరెక్షన్ ఏర్పడింది. మరింతగా పురోగమించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవడం అవసరం. ప్రధాన నిరోధం 25,000.

బేరిష్ స్థాయిలు: రియాక్షన్‌కు గురైతే 24,400 వద్ద (జూలై 11న ఏర్పడిన కనిష్ఠ స్థాయి) వద్ద మద్దతు ఉంది. ఇక్కడ విఫలమైతే మరింత బలహీనత సంకేతం ఇస్తుంది. ప్రధాన మద్దతు స్థాయిలు 24,200, 24,000.

బ్యాంక్ నిఫ్టీ: ఈ సూచీ గత నాలుగు వారాల్లో 53,000 పాయింట్ల స్థాయిలో నిరోధం ఎదుర్కొంటోంది. గత వారం 52,265 వద్ద ముగిసింది. రికవరీ బాట పడితే నిరోధ స్థాయి 52,300 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ప్రధాన నిరోధం 52,800. బలహీనపడి ప్రధాన మద్దతు స్థాయి 51,700 వద్ద విఫలమైతే స్వల్పకాలిక బలహీనతలో ప్రవేశించవచ్చు.

పాటర్న్: మార్కెట్‌కు 24,400 వద్ద స్వల్పకాలిక డీఎంఏ ఉంది. సానుకూలత కోసం ఇక్కడ రికవరీ తప్పనిసరి. అదే స్థాయిలో "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" కన్నా దిగజారితే మరింత బలహీనత సంకేతంగా భావించాలి.

టైమ్: ఈ సూచీ ప్రకారం బుధవారం తదుపరి మైనర్ రివర్సల్ ఉండవచ్చు.

సోమవారం స్థాయిలు	
నిరోధం	24,540, 24,600
మద్దతు	24,400, 24,355

ఈ వారం జర జాగ్రత్త!

కేంద్ర బడ్జెట్ నేపథ్యంలో మదుపరులు ఈ వారం అప్రమత్తంగా వ్యవహరించటం మంచిది. బడ్జెట్ కారణంగా ఈ వారం మార్కెట్ సూచీలు ఆటుపోట్లకు లోనయ్యే అవకాశం ఉంది. గత వారం బెంచ్‌మార్క్ సూచీలు జీవితకాల గరిష్ఠాలకు చేరినప్పటికీ ప్రైస్ యాక్షన్ మాత్రం భిన్నంగా ఉంది. మిడ్, స్మాల్ క్యాప్ కంపెనీల షేర్లు భారీగా పతనమయ్యాయి. మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించిన ఐటీ కంపెనీల షేర్లు మాత్రం లాభాల్లో సాగాయి. ఈ వారం నిఫ్టీకి 24,500 వద్ద మద్దతు, 24,650 వద్ద నిరోధం ఉన్నాయి.

స్టాక్ రికమండేషన్స్

టైటాన్: జనవరి చివరి వారం నుంచి డౌన్‌ట్రెండ్‌లో పయనిస్తున్న ఈ షేరు ప్రస్తుతం కీలక మద్దతు స్థాయి అయిన రూ.3,200 స్థాయికి చేరుకుంది. గత వారం తక్కువ వాల్యూమ్‌తో టైట్ రేంజ్‌లో క్యాండిల్స్ ఫామ్ అయ్యాయి. గత శుక్రవారం రూ.3,259 వద్ద ముగిసిన ఈ కౌంటర్‌లో మదుపరులు రూ.3,250 శ్రేణిలో పొజిషన్ తీసుకుని రూ.3,500/3,600 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.3,200 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

టిటాగఢ్ రైల్వే: కొన్ని నెలలుగా అప్‌ట్రెండ్‌లో కొనసాగుతున్న ఈ షేరు రెండు వారాలుగా కన్సాలిడేట్ అవుతోంది. శుక్రవారం సూచీలు భారీగా పతనమైన పరిస్థితిలోనూ ఈ షేరు జోరు ప్రదర్శించింది. రానున్న బడ్జెట్‌లో రైల్వేకు పెద్దపీట వేసే అవకాశాలు ఉండటంతో ఇన్వెస్టర్ల చూపు ఈ కౌంటర్‌పై పడింది. గత శుక్రవారం ఈ షేరు 2.87 శాతం లాభంతో రూ.1,655 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.1,650/1,630 శ్రేణిలో ప్రవేశించి రూ.1,900 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.1,575 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఆస్ట్రల్: శుక్రవారం నాటి బలహీన మార్కెట్లోనూ ఈ స్టాక్ మంచి ప్రదర్శన కనబరిచింది. ఈ కౌంటర్‌లో స్వల్పకాల దిద్దుబాటు ముగిసినట్లే కనిపిస్తోంది. ట్రేడింగ్, డెలివరీ వాల్యూమ్ పెరుగుతోంది. క్రితం సెషన్‌లో ఒక శాతం లాభంతో రూ.2,272 వద్ద క్లోజైన ఈ కౌంటర్‌లో స్వింగ్ ట్రేడర్లు రూ.2,270/2,250 వద్ద పొజిషన్ తీసుకుని రూ.2,450/2,500 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.2,210 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

సుప్రీం ఇండస్ట్రీస్: జీవితకాల గరిష్ఠ స్థాయిని తాకిన అనంతరం ఈ షేరు 12 శాతం మేర దిద్దుబాటుకు లోనైంది. ఈ వారం కంపెనీ ఆర్థిక ఫలితాలు విడుదల కానుండటంతో ఇన్వెస్టర్లు ఆసక్తిని చూపిస్తున్నారు. గత శుక్రవారం ఈ షేరు 1.09 శాతం లాభంతో రూ.5,783 వద్ద స్థిరపడింది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లో రూ.5,750 వద్ద ఎంటరై రూ.6,200 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.5,710 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.

ఇర్కాన్ ఇంటర్నేషనల్: గత వారం ఈ షేరు మంచి జోరును కనబరిచింది. చివరి సెషన్‌లో ఈ షేరు 1.05 లాభంతో రూ.316 వద్ద క్లోజైంది. ఇన్వెస్టర్లు ఈ కౌంటర్‌లోకి రూ.315/310 శ్రేణిలో ప్రవేశించి రూ.355/370 టార్గెట్ ధరతో కొనుగోలు చేసే విషయాన్ని పరిశీలించవచ్చు. అయితే రూ.304 స్థాయిని స్టాప్‌లాస్‌గా పెట్టుకోవాలి.



- మూర్తి నాయుడు పాదం,
మార్కెట్ నిపుణులు, నిఫ్టీ మాస్టర్

niftymasterlive@gmail.com +91 98855 59709

నోట్ : పెట్టుబడి నిర్ణయాలు తీసుకునే ముందు మదుపరులు తమ ఫైనాన్షియల్ అడ్వైజర్ల సలహాలు తీసుకోవాలి.





30 నెంబరు జాతీయ రహదారిపై నిలిచిన రాకపోకలు



యండగండి-గణపవరం మధ్య ఉన్న బ్రిడ్జి యనమదుర్రు డ్రెయిన్ వరదలో మునిగిపోవడంతో పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

ఉగ్ర గోదావరి

(మొదటి పేజీ తరువాయి)

జారీ చేశారు. ఎగువన కురుస్తున్న వర్షాలకు గోదావరి ఇంకా పెరిగే అవకాశం ఉందని అక్కడి అధికారులు అంచనా వేస్తున్నారు. రాజమహేంద్రవరం వద్ద అఖండ గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. ఘాట్లలో ఎవరినీ స్నానాలకు వెళ్లకుండా నియంత్రణ చర్యలు చేపట్టారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు డివిజన్లలోని ఘాట్లలో సోమవారం నుంచి సచివాలయ, ఇతర ఉద్యోగులను మూడుషిఫ్టులుగా 24గంటలూ ఉండేలా డ్యూటీలు వేశారు. వర్షాలు, వరద నేపథ్యంలో డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లాలో 22న, విలీన మండలాల్లో 22, 23 తేదీల్లో పాఠశాలలకు సెలవు ప్రకటించారు. భారీవర్షాలు, గోదావరి వరదలతో ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల ప్రజలు అల్లాడిపోతున్నారు. పెదవాగు ప్రాజెక్టుకు గండి పడటంతో వేలేరుపాడు మండలంలోని 13 గ్రామాల ప్రజలు తీవ్రంగా నష్టపోయారు. ఇళ్లు, పశుసంపద కొట్టుకుపోవడంతో పాటు పంటల్లో ఇసుక మేటలు వేసింది. ఏలూరు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 7 గ్రామాల్లోని 432 కుటుంబాలను తక్షణమే పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గోదావరి వరద మరింత పెరిగే అవకాశం ఉన్నందున ముంపునకు గురయ్యే గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. అల్లూరి జిల్లా చింతూరు మండలంలో శబరి నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ఆదివారం సాయంత్రానికి చింతూరు వద్ద శబరి నీటిమట్టం 39 అడుగులకు చేరింది. విజయవాడ నుంచి జగదల్‌పూర్‌కు వెళ్లే 30వ నెంబరు జాతీయ రహదారిపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలం చట్టి వద్ద, ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా ఎర్రబోరు వద్ద రహదారిపై వరద నీరు చేరింది. మరోవైపు ఏపీ మీదుగా ఒడిశా వెళ్లే 326 నెంబరు జాతీయ రహదారిపై అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు మండలంలో కల్లేరు, కుయుగూరు వద్ద వరద నీరు చేరింది. దీంతో తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, ఒడిశా జాతీయ రహదారులపై రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. చింతూరు, కూనవరం, ఎటపాక, వరరామచంద్రపురం మండలాల్లోని పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టింది. వాగులు వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. లోతట్టు ప్రాంతవాసులు స్వచ్ఛందంగా సురక్షిత ప్రాంతాలకు సామగ్రిని తరలించుకుంటున్నారు. చింతూరు-మారేడుమిల్లి ఘాట్‌రోడ్‌పై చెట్లు విరిగి పడుతుండడంతో రాత్రివేళల్లో అటుగా రాకపోకలు నిలిపివేశారు. డొంకరాయి జలవిద్యుత్ కేంద్రానికి చెందిన రిజర్వాయరు నిల్వ సామర్థ్యం 1,037 అడుగులు కాగా ప్రస్తుతం 1022.9 అడుగులకు నీరు చేరింది. దేవీపట్నం మండలం కొండమొదలు, తాళ్ళూరు, కచ్చులూరు, మంటూరు, మడిపల్లి, మూలపాడు, అగ్రహారం, దేవీపట్నం, తొయ్యేరు, పూడిపల్లి, పోశమ్మగండి గ్రామాల్లో వరద పెరుగుతూ వస్తోంది. మూడు రోజుల నుంచి మాతృశ్రీ అమ్మవారి ఆలయాన్ని చుట్టుముట్టి ఆదివారం గోపురం పైభాగం వరకు వరద చేరింది. తాలిపేరు జలాశయం, శబరి తదితర నదుల నుంచి గోదావరికి వరదనీరు చేరి సీతపల్లి వాగు పోటెత్తడంతో 4 పంచాయతీలకు ప్రభుత్వ క్యాంప్ కార్యాలయాలకు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.

48వేల హెక్టార్లలో వరి మునక

రాష్ట్రంలో భారీ వర్షాలు, వరదల కారణంగా ముంపు ప్రాంతాల్లో 48వేల హెక్టార్లలో వరి పైరు నీట మునిగిందని వ్యవసాయశాఖ ప్రాథమికంగా అంచనా వేసింది. పశ్చిమగోదావరి జిల్లాలో 15వేలు, తూర్పు గోదావరి జిల్లాలో 16,500, ఏలూరు జిల్లాలో 5వేలు, గుంటూరు జిల్లాలో 3వేలు, కోనసీమ జిల్లాలో 3,500, కాకినాడ జిల్లాలో 2,200 హెక్టార్లలో వరి ముంపుబారిన పడినట్లు తెలిపింది. ప్రస్తుత వర్షాలతో పంటలకు పెద్దగా నష్టం ఉండదని, నీరు తగ్గాక పైరు ఎదుగుతుందని పేర్కొంది. పూర్తిగా దెబ్బతిన్న చోట మళ్లీ నాట్లు వేసుకోవాల్సి ఉంటుందని తెలిపింది. ముంపు తగ్గాక పంట నష్టంపై ఎన్యుమరేషన్ చేపట్టనున్నట్లు వ్యవసాయశాఖ డైరెక్టర్ డిల్లీరావు తెలిపారు. కాగా, తూర్పుగోదావరి జిల్లాలో ఎర్రకాలువ ముంపునకు గురైన నల్లజర్ల, నిడదవోలు మండలాలకు ఇద్దరు ప్రత్యేకాధికారులను నియమించినట్టు జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శెట్టిపేట గ్రామంలో 500 మందికి పునరావాసం కల్పించినట్టు చెప్పారు. మంత్రి కందుల దుర్గేష్ ఢిల్లీ నుంచి పరిస్థితిని సమీక్షించారు. పశ్చిమగోదావరి జిల్లాలో యనమదుర్రు డ్రెయిన్ పొంగి ప్రవహిస్తోంది. ఉప్పుటేరులో కలవాల్సిన ఈ డ్రెయిన్ నీరు ముందుకు సాగక పంట కాల్వల్లోకి ఎగదన్నుతున్నది. గోదావరిలో వరద నీరు పెరగటంతో నరసాపురం వద్ద పంటు రాకపోకలను నిలిపివేశారు. ఏలూరు జిల్లాలో తమ్మిలేరు వరద ఉధృతి కొనసాగుతోంది. నాగిరెడ్డిగూడెం తమ్మిలేరు రిజర్వాయర్‌కు 2360 క్యూసెక్కులు నీరు వచ్చి చేరుతోంది. కొంగువారిగూడెం ఎర్రకాలువ ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో తగ్గింది. ఆదివారం సాయంత్రానికి ఎర్రకాలువ ప్రాజెక్టులోకి 5,600 క్యూసెక్కులు నీరు చేరుతుండగా, ప్రాజెక్టు నుంచి 7,092 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



కాటన్ బ్యారేజీ గేటు వద్ద ఇరుక్కుపోయిన డ్రెడ్జింగ్ పడవ

తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరంలోని కాటన్ బ్యారేజ్ వద్దకు సమీపంలోని గాయత్రి ఇసుక ర్యాంపు నుంచి శనివారం రాత్రి 11గంటల సమయంలో ఒక డ్రెడ్జింగ్ పడవ కొట్టుకొచ్చింది. వరద ఉధృతంగా ఉండడంతో బ్యారేజ్ మొదటి గేటుకు అడ్డంగా ఉండిపోయింది. స్థానికులతో కలిసి ఇరిగేషన్ అధికారులు భారీ యంత్రాలతో ఉదయం నుంచి ప్రయత్నించినా దాన్ని బయటకు తీయలేకపోయారు. కలెక్టర్ పి. ప్రశాంతి ఆదేశాలతో ఎన్డీఆర్ఎఫ్ బృందం భారీ క్రేన్ సహాయంతో తీయడానికి ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. చీకటి పడటంతో సోమవారం ఉదయం ప్రయత్నిద్దామని పనులు నిలిపివేశారు. ఆ పడవ ఖరీదు రూ.15 లక్షలు ఉంటుందని సమాచారం.

అతివృష్టి - అనావృష్టి!

- దేశంలోని 9 రాష్ట్రాల్లో కరువు.. ఆరు రాష్ట్రాలను ముంచెత్తిన వర్షాలు

న్యూఢిల్లీ, జూలై 21: దేశంలో ఈ ఏడాది చిత్రమైన వాతావరణం కనిపిస్తోంది. జూన్-జూలై మధ్యకాలంలో కొన్ని రాష్ట్రాల్లో అతివృష్టి, మరికొన్ని రాష్ట్రాల్లో అనావృష్టి ఏర్పడింది. ఉత్తరాది సహా 9 రాష్ట్రాల్లో లోటు వర్షపాతం నమోదుకాగా, తమిళనాడు సహా 6 ఆరు రాష్ట్రాల్లో కుంభవృష్టిగా వానలు కురుస్తున్నాయి. జార్ఖండ్, హిమాచల్‌ప్రదేశ్, పంజాబ్, హరియాణ, ఒడిశా, బిహార్ సహా తొమ్మిది రాష్ట్రాల్లో 20 నుంచి 49% మేరకు లోటు వర్షపాతం నమోదైంది. జార్ఖండ్‌లో అత్యధికంగా 49% లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు తెలిపారు. అదేసమయంలో నాలుగు దక్షిణాది రాష్ట్రాలు సమా మొత్తం ఆరు రాష్ట్రాల్లో అత్యధిక వర్షాలు కురిసినట్టు తెలిపారు. జూన్ 1 నుంచి జూలై 20వ తేదీ వరకు అందిన సమాచారం మేరకు తమిళనాడులో సాధారణ వర్షాలకంటే 83 శాతం ఎక్కువగా కురిశాయి. ఇక, దేశవ్యాప్తంగా ఈ సీజన్‌లో 1% మేరకు లోటు వర్షపాతం నమోదైంది. వాయువ్య రాష్ట్రాల్లో 14%, తూర్పు, ఈశాన్య రాష్ట్రాల్లో 12% లోటు వర్షపాతం నమోదైనట్టు అధికారులు వివరించారు. ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్‌లో గడిచిన 24 గంటలుగా కురుస్తున్న వర్షాల కారణంగా లోటు వర్షపాతం కొంత మేరకు తగ్గే సూచనలు కనిపిస్తున్నాయని తెలిపారు.

జగన్ నిర్వాకంతో రాష్ట్రానికి చెడ్డ పేరు: పెమ్మసాని

పొన్నూరుటౌన్, జూలై 21: మాజీ ముఖ్యమంత్రి జగన్ నిర్వాకంతో రాష్ట్రానికి చెడ్డ పేరు వచ్చిందని కేంద్ర మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. ఆదివారం గుంటూరు జిల్లా పొన్నూరు మండలం మామిళ్లపల్లి గ్రామంలో రహదారి నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో ఆయన మాట్లాడుతూ జగన్ హయాంలో చేసిన అరాచకాల చరిత్ర ఉత్తరాది రాష్ట్రాల వరకు పాకిందన్నారు. జగన్ పేరు చెబితే అక్కడి నాయకులూ భయపడుతున్నారని తెలిపారు. జగన్ ఢిల్లీకి వెళ్లి ఒక్క సారైనా రాష్ట్ర ప్రయోజనాల గురించి మాట్లాడారా? అని ప్రశ్నించారు. వెళ్లిన ప్రతిసారీ సొంత కేసులు, వ్యక్తిగత ఏజెండాతోనే మాట్లాడారని ఆరోపించారు.

రైతులకు అందుబాటులో ఎరువులు: మంత్రి అచ్చెన్న

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలు, వరదల నేపథ్యంలో సస్యరక్షణ చర్యలు చేపట్టే విధంగా రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు తగిన సూచనలు ఇవ్వాలని మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఆదివారం ఉదయం అల్పపీడన ప్రభావం, పంట నష్టం, ఎరువుల లభ్యతపై వ్యవసాయశాఖ అధికారులతో మంత్రి సమీక్షించారు. పంట పొలాల్లో నీరు తొలగించి, తేమ ద్వారా ఆశించే తెగుళ్ల నివారణకు తగిన సూచనలు అందించాలన్నారు. రైతులకు ఎరువులు అందుబాటులో ఉంచాలని స్పష్టం చేశారు.

కరువుతీరా.. వాన!

- రాష్ట్రంలో 50శాతం అధిక వర్షపాతం
- ఖరీఫ్‌లో వరి, వాణిజ్య పంటలకు మేలు
- కృష్ణమ్మ, తుంగభద్రమ్మ పరుగులు
- శ్రీశైలానికి 80 వేల క్యూసెక్కులు

అమరావతి, కర్నూలు, విజయవాడ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలోని అల్పపీడనం వాయుగుండంగా మారి, రుతుపవన ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా నాలుగైదు రోజులుగా కురిసిన వర్షాలు రైతుకు కరువు తీరేలా చేశాయి. ఈ వర్షాలతో రాష్ట్రవ్యాప్తంగా 50శాతం అధిక వర్షపాతం నమోదైంది. రాష్ట్రంలో జూన్ నుంచి ఇప్పటి వరకు 199.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. ఇప్పటివరకు 299.1 మి.మీ. నమోదైంది. పల్నాడులో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదవగా.. మిగిలిన 25జిల్లాల్లో 20 నుంచి 111 శాతం అధికంగా వానలు పడ్డాయి. ఇటు ఉత్తరాంధ్ర, అటు ప్రకాశం జిల్లాతో సహా రాయలసీమలోనూ ఆశాజనకంగా వర్షాలు కురిశాయి. ఈ వర్షాలతో ఖరీఫ్ సాగు మరింత పుంజుకోనుంది. అయితే భారీ వర్షాల వల్ల లోతట్టు ప్రాంతాల్లో కొంత మేర పంటలు ముంపు బారిన పడ్డాయి. వాన, వరద నీరు తొలగించి, సస్య రక్షణ చర్యలు చేపడితే.. పంటలకు ఇబ్బంది ఉండదని వ్యవసాయ శాస్త్రవేత్తలు చెప్తున్నారు.

బిరబిరా కృష్ణమ్మ...

మహారాష్ట్ర, కర్ణాటకల్లో కురుస్తున్న వర్షాలతో రాష్ట్రంలోని జలాశయాలకు వరద చేరుతోంది. దీంతో కరువుకు నిలయమైన రాయలసీమ రైతుల్లో సాగు ఆశలు చిగురిస్తున్నాయి. శ్రీశైలం జలాశయానికి రెండు మూడు రోజుల నుంచి వరద పెరుగుతోంది. ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల ప్రాజెక్టులను దాటి శ్రీశైలానికి 97,208 క్యూసెక్కుల వరద చేరుతోంది. ఆల్మట్టి సామర్థ్యం 129.72 టీఎంసీలు కాగా.. 100.14 టీఎంసీలకు చేరడమే కాక.. 87,217 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో ఉంది. దీంతో 1,00,064 క్యూసెక్కులు దిగువన నారాయణపూర్ డ్యాంకు విడుదల చేస్తున్నారు. నారాయణపూర్‌లో 96,063 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. దీంతో 25 గేట్లు, పవర్ హౌస్ ద్వారా 1,07,212 క్యూసెక్కులు దిగువనున్న జూరాలకు విడుదల చేస్తున్నారు. జూరాల డ్యాం గరిష్ఠ నీటి నిల్వ సామర్థ్యం 9.66 టీఎంసీలు కాగా.. 7.04 టీఎంసీలకు వరద చేరింది. 79,166 క్యూసెక్కులు వరద చేరడంతో.. స్పిల్‌వే, విద్యుత్ ఉత్పత్తి (పవర్ హౌస్) ద్వారా 80 వేలు క్యూసెక్కులు దిగువ శ్రీశైలం జలాశయానికి విడుదల చేస్తున్నారు. జూరాల నుంచి వచ్చిన వరదతో పాటు వర్షాలకు శ్రీశైలం జలాశయానికి వరద పెరిగి 97,208 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. తుంగభద్ర డ్యాంకు ఆదివారం 1,12,101 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో క్రమక్రమంగా పెరుగుతుండంతో కర్నూలు, అనంతపురం జిల్లాల్లో ఎల్లెల్సీ, హెచ్చెల్సీ ఆయకట్టు రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి.



తుంగభద్ర జలాశయానికి చేరిన వరద

నిండుకుండలా ప్రకాశం బ్యారేజీ

ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి వరద కొనసాగుతోంది. తెలంగాణలో కురుస్తున్న వర్షాలకు ఎన్టీఆర్ జిల్లాలోని వాగులు ఉప్పొంగుతున్నాయి. వజినేపల్లి నుంచి 177, కీసర నుంచి 1,426, పాలేరు నుంచి 106 క్యూసెక్కుల వరద వస్తోంది. బ్యారేజీ వద్దకు మొత్తం 15,940 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. 17 గేట్లను అడుగు మేర ఎత్తి 12,325 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. కాల్వలకు 1,309 క్యూసెక్కులు ఇస్తున్నారు.

బలహీనపడనున్న అల్పపీడనం

- కోస్తా, రాయలసీమకు వర్ష సూచన

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఒడిశా, దానికి ఆనుకుని ఛత్తీస్‌గఢ్ పరిసరాల్లో తీవ్ర అల్పపీడనం కొనసాగుతోంది. ఇది వాయవ్యంగా పయనించి ఆదివారం రాత్రి లేదా సోమవారం ఉదయం బలహీనపడనుందని వాతావరణ శాఖ తెలిపింది. రుతుపవన ద్రోణి తూర్పుభాగం ఒడిశా మీదుగా వాయవ్య బంగాళాఖాతం వరకు విస్తరించింది. వీటి ప్రభావంతో రుతుపవనాలు చురుగ్గా మారి ఆదివారం కోస్తాలో ఎక్కువచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురిశాయి. రానున్న 24 గంటల్లో కోస్తాలో పలుచోట్ల, రాయలసీమలో అక్కడక్కడా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఉత్తర కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నందున మత్స్యకారులు సముద్రంలో చేపలవేటకు వెళ్లరాదని హెచ్చరించింది.



టీడీపీ, జనసేనలో చేరిన వైసీపీ కార్పొరేటర్లతో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరులు

విశాఖలో వైసీపీకి షాక్

- 12 మంది జీవీఎంసీ కార్పొరేటర్లు అవుట్
- ఏడుగురు టీడీపీలోకి, ఐదుగురు జనసేనలోకి.. త్వరలో మరో ఆరుగురు చేరే అవకాశం!

విశాఖపట్నం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అతి పెద్ద నగరం విశాఖలో వైసీపీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మహానగర పాలక సంస్థ (జీవీఎంసీ)లో 12 మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరారు. ఆదివారమిక్కడ టీడీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ శ్రీభరత్, ఎమ్మెల్యేలు గంటా శ్రీనివాసరావు, వెలగపూడి రామకృష్ణబాబు, జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ తదితరుల సమక్షంలో ఏడుగురు వైసీపీ కార్పొరేటర్లు సారిపల్లి గోవింద, కంపా హనోక్, బి.నరసింహపాత్రుడు, రాజాన రామారావు, ఇల్లపు వరలక్ష్మి, లొడగల అప్పారావు, కోడూరు అప్పలరత్నం టీడీపీలో చేరారు. వారికి నేతలు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. మరో ఐదుగురు కార్పొరేటర్లు ఆళ్ల లీలావతి, పెద్దింటి ఉషశ్రీ, కంటిపాముల కామేశ్వరి, పి.పూర్ణశ్రీ, బి.సూర్యకుమారి జనసేనలో చేరారు. వారికి త్వరలో విజయవాడలో నిర్వహించే కార్యక్రమంలో జనసేన అధినేత పవన్ కల్యాణ్ పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తారని వంశీకృష్ణ శ్రీనివాస్ తెలిపారు. జీవీఎంసీలో మొత్తం 98 మంది కార్పొరేటర్లకు ప్రస్తుతం 97 మంది ఉన్నారు. 12 మంది కార్పొరేటర్లు టీడీపీ, జనసేనలో చేరడంతో వైసీపీ బలం 56 నుంచి 44కి పడిపోయింది. ఇదే సమయంలో టీడీపీ బలం 40కి, జనసేన 10కి పెరిగింది. బీజేపీకి ఒక కార్పొరేటర్ ఉన్నారు. సీపీఐ, సీపీఎంనుంచీ చెరొకరు ఉన్నారు. మేయర్ పదవి చేపట్టాలంటే 49 మంది కార్పొరేటర్లు ఉండాలి. టీడీపీ కూటమికి ఇప్పుడు 51 మంది ఉన్నారు. మేయర్ పీఠం దక్కించుకునేందుకు కూటమి పార్టీలు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నాయి. రానున్న రోజుల్లో ఇంకో ఆరుగురు కార్పొరేటర్లు రానున్నట్లు విశ్వసనీయ సమాచారం. వాస్తవానికి ఆదివారం 20 మంది వైసీపీ కార్పొరేటర్లు చేరేందుకు సిద్ధంగా.. వీరిలో 8 మందిపై స్థానిక టీడీపీ, జనసేన శ్రేణులు, ఎమ్మెల్యేలు అభ్యంతరం వ్యక్తంచేసినట్లు తెలిసింది. వారి వల్ల పార్టీ శ్రేణులు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారని.. ఇప్పుడు వారిని చేర్చుకుంటే తీవ్ర అసంతృప్తికి గురవుతారని అడ్డుకున్నట్లు సమాచారం.

జగన్ అబద్ధాలను ఇక నమ్మరు

- ప్రజలు ఛీకొట్టినా మారని తీరు
- ఆటవిక పాలన గురించి జగన్ మాట్లాడటం సిగ్గుచేటు
- అసెంబ్లీకి రాకుండా ఢిల్లీలో ధర్నా అంటూ నాటకాలు
- ఆయన రక్త చరిత్రను బయటికి తీస్తే గ్రంథాలవుతాయి
- తప్పుడు ఆరోపణలు చేసినందుకు చర్యలు తీసుకుంటాం: అనిత



మీడియాతో మాట్లాడుతున్న హోం మంత్రి వంగలపూడి అనిత

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీకొట్టి ఛీత్కరించినా వైసీపీ నేతలు మారడం లేదని, వారి అబద్ధాలకు అడ్డు అదుపు లేకుండా పోతోందని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత మండిపడ్డారు. ఆదివారం టీడీపీ ప్రధాన కార్యాలయంలో ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారం పోవడంతో జగన్‌కు బుర్రదొబ్బి ఎక్కడికెళ్లి ఏం మాట్లాడాలో తెలియడం లేదన్నారు. అసత్యాలు, అబద్ధాలతో కూటమి ప్రభుత్వంపై బురదచల్లి, మళ్లీ సీఎం కావాలనే కలలు కంటున్నారని మండిపడ్డారు. 'జరిగినవి వాస్తవంగా రాజకీయ హత్యలైతే, వాటి పూర్తి వివరాలను ప్రభుత్వానికి ఇవ్వాలి. ప్రజల్లో విషపు బీజాలు నాటడానికి ప్రయత్నిస్తున్నారు. ప్రజల్లో భయాన్ని సృష్టించేందుకు కుట్రలు చేస్తున్నారు. వైసీపీ పాలనలో పోలీసులను చెప్పుచేతుల్లో పెట్టుకుని రాజారెడ్డి రాజ్యాంగాన్ని నడిపారు. జగన్ అధికారంలో ఉంటే ఇక బతకలేమన్న అభిప్రాయంలోకి నాడు ప్రజలు వచ్చారు. అందుకే వైసీపీకి 11 సీట్లు ఇచ్చి పాతిపెట్టారు. హత్యలు, ఆత్మహత్యలు, ప్రైవేట్ ఆస్తుల ధ్వంసం జరిగాయని పరామర్శకు వెళ్లి జగన్ అబద్ధాలు చెబుతున్నారు. వాటికి సంబంధించిన వివరాలు వెంటనే ఇవ్వాలి. వివరాలు ఇవ్వకుంటే తప్పుడు ఆరోపణలపై చర్యలు తీసుకుంటాం. నిజంగా రాజకీయ హత్యలు జరిగింది నాలుగు మాత్రమే. ముగ్గురు టీడీపీ నాయకులే చనిపోయారు. జగన్ మాటలను జనాలు ఎలా నమ్ముతారు అనుకుంటున్నాడో కానీ, వ్యక్తిగత హత్యపై ప్రధానికి లేఖ రాసి రాష్ట్రపతి పాలన విధించాలని కోరుతున్నాడంటే.. ఆయన ఎంత ఘనుడో అర్థమవుతోంది. నిందితులను అరెస్టు చేసి జైలుకు పంపితే జగన్ వినుకొండ వెళ్లి మళ్లీ రెచ్చగొడుతున్నారు. జగన్ గత ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆడబిడ్డలపై జరిగిన అత్యాచారాల మీద మాట్లాడలేదు. చంద్రబాబు పాలనలో వెంటనే నిందితులను అరెస్టు చేసి జైలుకుపంపిస్తున్నాం. ఏ రోజూ కూడా ఒక సమీక్ష చేయని జగన్ లా అండ్ ఆర్డర్ గురించి మాట్లాడుతుంటే సిగ్గు అనిపించడం లేదా? సీఎం కుర్చీ కోసం సొంత బాబాయిని చంపిన వ్యక్తి, కోడికత్తి కేసులో ఒక దళితుడ్ని ఇరికించిన వ్యక్తి, మళ్లీ గులకరాయి డ్రామాతో సీఎం కావాలనుకున్న వ్యక్తి.. ఆటవిక పాలన గురించి మాట్లాడటం సిగ్గుచేటు. సోమవారం నుంచి అసెంబ్లీ ఉండటంతో అసెంబ్లీకి వస్తే జగన్ బండారం బయటపడుతుందని, ఢిల్లీలో ధర్నా అంటూ నాటకాలు ఆడుతున్నారు. ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేసిన జగన్‌పై చర్యలు తీసుకుంటాం. జగన్ రక్త చరిత్ర అంతా బయటకు తీస్తే గ్రంథాలవుతాయి. చిన్న పిల్లల మీద జరుగుతున్న అఘాయిత్యాలపై ప్రత్యేక కోర్టులు తీసుకొస్తాం. అత్యాచారాలపై టాస్క్‌ఫోర్స్ ఏర్పాటుచేసి జరుగుతున్న ఘటనలను పూర్తిగా అరికడతాం. దీనికి నాలుగైదు రోజుల్లో టోల్‌ఫ్రీ నెంబర్‌ను కూడా ఏర్పాటు చేస్తాం. జగన్ ఢిల్లీకి వెళ్లినా ఆయన చరిత్ర అందరికీ తెలిసిందే, ప్రజలే వారిని తిప్పికొడతారు' అని అన్నారు.

ఇప్పుడూ దొంగ లెక్కలేనా జగన్!

- ఆ 71 మంది వివరాలు ఇవ్వగలరా?
- అందరు చనిపోతే పరామర్శకు ఎందుకు వెళ్లలేదు?
- టీడీపీ అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ ధ్వజం

అమరావతి, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత నెలన్నర రోజుల్లో 36మంది వైసీపీ కార్యకర్తలు హత్యకు గురయ్యారని, 35మంది ఆత్మహత్య చేసుకున్నారని చెప్తున్న జగన్‌రెడ్డి ఆ 71 మంది వివరాలు ఇవ్వాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నీలాయపాలెం విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. ప్రభుత్వంలో ఉన్నప్పుడు తప్పుడు లెక్కలు చెప్పినట్లుగానే ఇప్పుడు కూడా జగన్‌రెడ్డి దొంగ లెక్కలు చెప్తున్నారని ఆదివారం ఓ ప్రకటనలో విమర్శించారు. ఇన్ని హత్యలు, ఆత్మహత్యలు, దాడులు జరిగితే.. వారందరినీ ఎందుకు పరామర్శించలేదని నిలదీశారు. ఈ నెలన్నర రోజుల్లో వెయ్యి దాడులు జరిగాయని, 36 మందిని టీడీపీ వారు చంపేశారని, టీడీపీ వారి దాడులు తట్టుకోలేక 35 మంది ఆత్మహత్య చేసుకున్నారని, 300 హత్యాయత్నాలు జరిగాయని జగన్ అలవోకగా అబద్ధాలు చెప్పేస్తున్నారని ఆక్షేపించారు. జగన్ చెప్పిన లెక్కలు చూసి, పోలీసులు తమ రికార్డుల్లోనే లేవని వాపోతున్నారని తెలిపారు. వినుకొండకు వెళ్లిన జగన్ మిగతా చోట్లకు ఎందుకు వెళ్లలేదని నిలదీశారు.



ఒంగోలులో ఆర్టీసీ బస్సులను ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

జగన్‌కు శవ రాజకీయాలు అలవాటే!

- త్వరలో మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం: మంత్రి స్వామి

ఒంగోలు(కార్పొరేషన్), జూలై 21: మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి మొదటి నుంచీ శవరాజకీయాలు చేస్తున్నారని, అవి ఆయనకు అలవాటేనని రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీబాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. ఓటమి అనంతరం ఆయన మానసికస్థితి బాగోలేదన్నారు. ఆదివారం ప్రకాశం జిల్లా ఒంగోలులోని ఆర్టీసీ డిపోలో ఐదు కొత్త బస్సులను ఆయన ప్రారంభించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ శవ రాజకీయం చేయడం జగన్‌కు అలవాటుగా మారిందన్నారు. వైసీపీ దాడుల్లో టీడీపీకి చెందిన చాలామంది హత్యకు గురయ్యారని, వారి కుటుంబ సభ్యులను కూడా జగన్ ఓదార్చితే బాగుండేదని వ్యాఖ్యానించారు. త్వరలోనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని చెప్పారు.

నియంతలా పాలించి నీతులా?

- శాంతిభద్రతలపై మాట్లాడే నైతికత జగన్‌కు లేదు
- టీడీపీ ఎస్సీ సెల్ నేత ఎంఎస్ రాజు ధ్వజం

అనంతపురం, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో శాంతి భద్రతల అంశంపై మాట్లాడే నైతిక హక్కు పులివెందుల ఎమ్మెల్యే వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి లేదని టీడీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు, మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. నియంతపాలన సాగించిన జగన్ ఇప్పుడు నీతులు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందని ఎద్దేవా చేశారు. అనంతపురంలో ఆదివారం ఎంఎస్ రాజు మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో గౌరవంలేని వ్యక్తి జగన్ అని మండిపడ్డారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్న ఐదేళ్లలో దాదాపు 300 మంది బీసీలు, 200 మంది దాకా ఎస్సీలు, 58 మందిదాకా ఎస్టీలు, 11 మంది మైనార్టీలు హత్యకు గురయ్యారని, అయినా ఏనాడూ నోరు మెదపలేదని, ఏ ఒక్క కుటుంబాన్నీ పరామర్శించలేదని చెప్పారు. వినుకొండలో రషీద్ అనే యువకుడిని ప్రత్యర్థులు చంపేశారనీ, చనిపోయిన వ్యక్తి ఇంటికెళ్లి రాజకీయాలు వల్లెవేయడాన్ని చూస్తుంటే జగన్ మనిషేనా అనే అనుమానం కలుగుతోందన్నారు.

ఏపీ టూరిజం అభివృద్ధికి చేయూతనివ్వండి

- కేంద్రానికి మంత్రి కందుల దుర్గేష్ వినతి

న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టూరిజం అభివృద్ధికి చేయూతనివ్వాలని కేంద్ర టూరిజం శాఖ మంత్రి గజేంద్ర షకావత్‌ను రాష్ట్ర టూరిజం, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ కోరారు. ఆదివారం ఢిల్లీలోని గజేంద్ర షకావత్ క్యాంపు కార్యాలయంలో ఆయనతో దుర్గేష్ సమావేశమయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లో టూరిజం అభివృద్ధికి కావాల్సిన వనరులు పుష్కలంగా ఉన్నాయని దుర్గేష్ తెలిపారు. గత ఐదేళ్లుగా టూరిజం అభివృద్ధి కుంటుపడిందని, నిధులిస్తే టూరిజాన్ని కొత్త పుంతలు తొక్కిస్తామని ఆయన కోరారు. దీనిపై కేంద్రమంత్రి షకావత్ సానుకూలంగా స్పందించారు.

నచ్చింది కాదు.. ఉన్నదే చదవాలి!

- ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో సబ్జెక్టుల కలకలం

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో 2023-24 విద్యా సంవత్సరంలో సింగిల్ మేజర్ డిగ్రీ విధానం ప్రారంభమైంది. అంతకు ముందు డిగ్రీలో మూడు సబ్జెక్టుల విధానం ఉండేది. మూడు సబ్జెక్టులకు సమానమైన మార్కులు ఉండేవి. కానీ గతేడాది నుంచి సింగిల్ మేజర్ డిగ్రీ విధానం ప్రారంభమైంది. అంటే విద్యార్థి ఏదైన ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకోవాలి. ఆ తర్వాత మైనర్ సబ్జెక్టుగా మరో సబ్జెక్టును ఎంపిక చేసుకోవాలి. నాలుగేళ్లపాటు ఆ రెండు సబ్జెక్టులతోనే డిగ్రీ కోర్సును పూర్తిచేయాలి. గతంలో ఒక్కో సబ్జెక్టుకు ఒక లెక్చరర్ ఉంటే మేజర్ విధానంలో ఒక సబ్జెక్టుకు ముగ్గురు లెక్చరర్లు అవసరమవుతున్నారు. పెరిగిన సిలబస్ వల్ల ఈ అదనపు అవసరం పెరిగింది. ఈ క్రమంలో కొన్ని కాలేజీల్లో కొన్ని సబ్జెక్టులకే లెక్చరర్లు ఉన్నందున వాటినే మేజర్‌గా అధికారులు ఎంపిక చేస్తున్నారు. అది కూడా స్థానికంగా ఉన్న డిమాండ్ ఆధారంగా ప్రిన్సిపాళ్లు ఎంపిక చేయకుండా, కళాశాల విద్యాశాఖ అధికారులే దీనిపై నిర్ణయం తీసుకుంటున్నారు. జిల్లాలను యూనిట్‌గా తీసుకుని ఒక కాలేజీలో ఒక సబ్జెక్టు ఉంటే, మరో కాలేజీలో ఇతర సబ్జెక్టులు పెడుతున్నారు. దీంతో సమీపంలో కాలేజీ ఉన్నప్పటికీ విద్యార్థులు తాము కోరుకున్న సబ్జెక్టులను చదవలేని పరిస్థితి ఎదురవుతోంది. ఉదాహరణకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీల్లో ఫిజిక్స్‌ను చాలా వరకు ఎత్తేశారు. ఎంపీసీ నుంచి వచ్చేవారు ఇంజనీరింగ్‌కు వెళ్లిపోతున్నారనేది ఒక కారణమైతే, లెక్చరర్లు లేరంటూ దానిని తొలగించారు. కెమిస్ట్రీ కూడా చాలా తక్కువ కాలేజీల్లో మాత్రమే ఉంది. ఆర్ట్స్ గ్రూపుల్లోనూ నచ్చిన సబ్జెక్టును ఎంపిక చేసుకుని చదువుకునే స్వేచ్ఛ విద్యార్థులకు లేకుండా పోయింది. ఆ కాలేజీకి అధికారులు ఏ సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేస్తే విద్యార్థులు తప్పనిసరిగా దానినే చదవాలి. కచ్చితంగా ఆ సబ్జెక్టే కావాలనుకుంటే దూరంగా వెళ్లి చదువుకోవాలి. ఉదాహరణకు ఒక కాలేజీలో చరిత్ర మేజర్ సబ్జెక్టుగా ఉండి, ఇతర సబ్జెక్టులు మైనర్‌గా ఎంపిక చేసుకోవాలని ముందుగానే నిర్ణయిస్తే... విద్యార్థి పాలిటిక్స్‌ను మేజర్‌గా ఎంపిక చేసుకోవడం కుదరదు. అదే గత విధానంలో బీఏ తీసుకుంటే ఆ రెండు సబ్జెక్టులను ఒకే కోర్సులో చదువుకునే వీలుండేది. ఉన్నత విద్యామండలి సింగిల్ మేజర్ ప్రవేశపెట్టి ఆ వెసులుబాటును తొలగించింది.

లాభమా? నష్టమా?

సింగిల్ మేజర్ డిగ్రీ విధానంపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో విద్యార్థులు డిగ్రీలో మూడు సబ్జెక్టులు చదివేవారు. దానివల్ల మూడింటిలో ఏదో ఒక రంగంలోకి వెళ్లి స్థిరపడే పరిస్థితి ఉండేది. కానీ కొత్త విధానంలో విద్యార్థికి ఒక సబ్జెక్టు తగ్గిపోతోంది. ఆ రెండు సబ్జెక్టుల ఆధారంగానే పీజీ కోర్సులు చదవాలి. విద్యార్థులకు ఒక ఆప్షన్ తగ్గిపోయింది. అధికారులు మాత్రం సింగిల్ మేజర్‌తోనే త్వరగా ఉద్యోగాలు పొందే అవకాశం ఉందంటున్నారు. ఒక సబ్జెక్టును మేజర్‌గా ఎంపిక చేసుకుంటే దానిపై లోతుగా చదువుకునే వీలుంటుందని, ఇదొక స్పెషలైజేషన్ లాంటిదని చెబుతున్నారు. కొంతకాలంగా డిగ్రీలో అడ్మిషన్లు తగ్గిపోతున్నాయి. సింగిల్ మేజర్ డిగ్రీ విధానం వచ్చాక అది ఇంకా పెరిగింది. మొత్తంగా రాష్ట్రంలో 3.5లక్షల డిగ్రీ సీట్లు అందుబాటులో ఉంటే లక్షన్నర మాత్రమే భర్తీ అవుతున్నాయి. ఈ ఏడాది దరఖాస్తుల సంఖ్యే 1.2లక్షలు దాటలేదు.

మళ్లీ మారిన డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూలు

- 25 వరకు రిజిస్ట్రేషన్లు.. 3న సీట్ల కేటాయింపు

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): డిగ్రీ అడ్మిషన్ల షెడ్యూలు మళ్లీ మారింది. ఇప్పటికే ఒకసారి షెడ్యూలును మార్చిన ఉన్నత విద్యాశాఖ మళ్లీ తేదీలు మార్చింది. ఇటీవల మార్చిన షెడ్యూలు ప్రకారం ఈనెల 20 వరకు వరకు విద్యార్థులకు రిజిస్ట్రేషన్ అవకాశం ఇవ్వగా, ఇప్పుడు దానిని 25 వరకు పొడిగించింది. 23 నుంచి ఆప్షన్లు ఎంపిక చేసుకోవాల్సి ఉండగా దానిని 26వ తేదీకి మార్చింది. 26 నుంచి 29 వరకు ఆప్షన్లు పెట్టుకోచ్చని తాజా షెడ్యూలులో పేర్కొంది. ఆగస్టు 3న సీట్లు కేటాయించనున్నారు.

నేటి నుంచే అసెంబ్లీ

గవర్నర్ ప్రసంగంతో ఉభయసభలూ ప్రారంభం

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర శాసనసభ సమావేశాలు సోమవారం ప్రారంభం కానున్నాయి. ఉదయం 10 గంటలకు ఉభయసభలను ఉద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రసంగిస్తారు. ఆ తర్వాత స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడి అధ్యక్షతన సభావ్యవహారాల సలహా సంఘం (బీఏసీ) సమావేశమవుతుంది. సభలో చర్చించాల్సిన అంశాలు, ఎజెండా ఏమిటో ఖరారు చేస్తారు. 26వ తేదీ వరకు సమావేశాలు జరుగనున్నాయి. మంగళవారం రెండో రోజు గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై రెండు సభలూ చర్చించి ఆమోదిస్తాయి. తర్వాత వరుసగా మూడ్రోజుల పాటు శాంతిభద్రతలు, పరిశ్రమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడు శ్వేతపత్రాలను ప్రవేశపెట్టనున్నారు. అలాగే ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దు చేసే బిల్లును కూడా ప్రభుత్వం తీసుకురానుంది. ఇందుకు సంబంధించి అన్ని సన్నాహాలూ పూర్తి చేసింది. కాగా.. సోమవారం మధ్యాహ్నం 2.30 గంటలకు అసెంబ్లీ కమిటీ హాలులో తెలుగుదేశం శాసనసభాపక్షం (టీడీఎల్పీ) సమావేశం కానుంది. ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు హాజరవుతారు.

జెండా పట్టే కార్యకర్తలకు అండగా..

జనసేన క్రియాశీలక సభ్యత్వ నమోదు

81 మందికి చెక్కులు పంపిణీ చేసిన నాగబాబు

మూడేళ్లలో 349 మందికి రూ.19 కోట్లు సాయం



రూ.5 లక్షల ప్రమాదబీమా చెక్కులు అందిస్తున్న నాగబాబు

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): క్షేత్రస్థాయిలో జనసేన జెండా పట్టుకొని నిస్వార్థంగా పనిచేసే ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా నిలవాలనే సంకల్పంతో జనసేన అధినేత పవన్ కల్యాణ్ క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమానికి రూపకల్పన చేశారని ఆ పార్టీ ప్రధాన కార్యదర్శి కె. నాగబాబు అన్నారు. మంగళగిరిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం క్రియాశీలక సభ్యులకు సంబంధించిన బీమా చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల కాలంలో వేర్వేరు ప్రమాదాల్లో 81 మంది జనసేన క్రియాశీలక సభ్యులు మరణించారు. వారి కుటుంబాలకు నాగబాబు చేతులు మీదగా రూ.5 లక్షల చొప్పున చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా నాగబాబు మాట్లాడుతూ.. బీమా సౌకర్యం వల్ల మూడేళ్లుగా 349 కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచామని చెప్పారు. క్రియశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమం 2021లో ప్రారంభమైందని చెప్పారు. దురదృష్టవశాత్తు 2021 నుంచి ఇప్పటి వరకూ వివిధ ప్రమాదాల్లో 349 మంది మృత్యువాత పడ్డారపి అన్నారు. వారి కుటుంబాలకు రూ.17.45 కోట్లు, గాయపడిన 443 మందికి రూ.1.74 కోట్లు ఇలా మొత్తం రూ.19 కోట్లకుపైగా ఆర్థిక సాయం అందించామని చెప్పారు. క్రియాశీలక సభ్యత్వం వల్ల వారి కుటుంబాలకు ఎంతో కొంత ఆర్థిక భరోసా అందించి, అండగా నిలబడొచ్చని చెప్పారు. నాయకులు తలో చేయివేసి సభ్యత్వం నమోదు చేసి కార్యకర్తల భవిష్యత్తుకు భద్రత కల్పిద్దామని పిలుపునిచ్చారు. తాను కూడా తనకు చేతనైనంత మందికి సభ్యత్వం ఇప్పిస్తానని చెప్పారు. తనకు రాజకీయాల్లో ఎలాంటి పదవి కాంక్ష లేదని, బతికున్నంత వరకూ పవన్ కల్యాణ్ ఆశయ సాధన కోసం కృషి చేస్తానని చెప్పారు.

వైసీపీ వాళ్లు కుక్కల్లా మీద పడుతున్నారు

వైసీపీ అధినేత జగన్ తన జేబు నుంచి పది రూపాయలు తీసి ఇవ్వడం తాను చూడలేదని నాగబాబు అన్నారు. అబద్ధాలు చెప్పడంలో జగన్ డాక్టరేట్ పొందారన్నారు. వినుకొండలో పాత కక్షల వల్ల హత్య జరిగితే రాజకీయ రంగు పులుముతున్నారని విమర్శించారు. 'వైసీపీ వాళ్లు కూటమి ప్రభుత్వానికి 3నెలలు సమయం కూడా ఇవ్వకుండా కాట్ల కుక్కల్లా మీద పడుతున్నారు. వాళ్లకు యాంటీ రేబిస్ ఇంజక్షన్ వేసి సైలెంటుగా కూర్చొంబెడతాం. వైసీపీ హయాంలో అవినీతికి పాల్పడ్డ ఏ ఒక్కరూ తప్పించుకోలేరు' అన్నారు.

రాష్ట్రంలో రసవత్తరంగా రాజకీయ సినిమా!

కాంగ్రెస్ నేత తులసిరెడ్డి వ్యాఖ్య

తిరుపతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రాజకీయ సినిమా 'ఇద్దరు సవతుల ముద్దుల మొగుడు' రసవత్తరంగా సాగుతోందని కాంగ్రెస్ నేత డాక్టర్ ఎన్.తులసిరెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు, జగన్మోహన్‌రెడ్డిల ముద్దుల మొగుడు నరేంద్ర మోదీ అని వ్యాఖ్యానించారు. ప్రత్యేక హోదాకు బీజేపీ పంగనామాలు పెట్టిందని విమర్శించారు. వైసీపీ, టీడీపీ అధికారంలోకి వచ్చినా విభజన హామీలు నెరవేర్చుకోలేక పోయారన్నారు. జగన్ పాలనలో రాష్ట్రం రావణకాష్టంగా మారడం వల్లే జనం చిత్తుచిత్తుగా ఓడించారని చెప్పారు. అయితే, కూటమి పాలనలో ఇంకా దారుణమైన పరిస్థితులు నెల రోజుల్లోనే కనిపిస్తున్నాయన్నారు. సకాలంలో ఉద్యోగులకు జీతాలు, పెన్షన్లు ఇచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన సూపర్ సిక్స్ పథకాలను ఎప్పటిలోపు అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ నాయకులు మాంగాటి గోపాల్ రెడ్డి, ప్రమీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

అసెంబ్లీకి మొక్కుబడిగానే!

(మొదటి పేజీ తరువాయి)

ఢిల్లీ వెళ్లి ఈ అంశంపై మంగళవారం ధర్నా చేయబోతున్నారు. ఐదు రోజుల శాసనసభ సమావేశాలు సోమవారం మొదలుకానున్న నేపథ్యంలో.. జగన్ తొలిరోజున మొక్కుబడిగా హాజరవుతారు. ఉభయసభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసే ప్రసంగాన్ని అడ్డుకుంటామని ముందుగానే ఆయన ప్రకటించారు. అయితే అలా నిరసన తెలిపి ఇలా సభ నుంచి మధ్యలోనే వెళ్లిపోతారని వైసీపీ వర్గాలు అంటున్నాయి. ఢిల్లీలో బుధవారం వైసీపీ ధర్నా చేస్తున్న దరిమిలా మంగళవారం నాటికే అక్కడకు చేరుకోవాలని పార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు ఆయన హుకుం జారీ చేశారు. బుధవారం ధర్నా చేశాక.. గురు, శుక్రవారాల్లోనూ జగన్ ఢిల్లీలోనే ఉండే అవకాశాలు ఉన్నాయని పార్టీ నేతలు చెబుతున్నారు. బుధ, గురు, శుక్రవారాల్లో చంద్రబాబు ప్రభుత్వం అసెంబ్లీలో శాంతిభద్రతలు, పరిశ్రమలు, రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై మూడు శ్వేతపత్రాలను ప్రవేశపెట్టనుంది. శుక్రవారంతో శాసనసభ సమావేశాలు ముగుస్తాయి. అంటే మొత్తం సమావేశాలకు జగన్ డుమ్మా కొడతారన్న మాట.



అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో భద్రత నిమిత్తం వివిధ జిల్లాల నుంచి వచ్చిన పోలీసులకు దిశానిర్దేశం చేస్తున్న అధికారి

స్థానిక ఘటనలకూ రాజకీయ రంగు

జగన్ ఐదేళ్ల పాలనలో టీడీపీ నేతలు, కార్యకర్తల వరకు అనేక దాడులు జరిగాయి. తప్పుడు కేసుల్లో అచ్చెన్నాయుడి నుంచి చంద్రబాబు దాకా పలువురిని అక్రమంగా అరెస్టు చేశారు. ఇక రాజకీయ హత్యలు చాలానే జరిగాయి. టీడీపీ శ్రేణులపై ప్రాణాంతక దాడులు చేసి.. తిరిగి వారిపైనే అక్రమ కేసులు బనాయించారు. కరోనా సమయంలో మాస్కులు అడిగిన పాపానికి నర్సీపట్నం ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సుధాకర్‌ను.. చనిపోయేదాకా ఏ విధంగా జగన్ ప్రభుత్వం వేధించిందో ప్రజలు ప్రత్యక్షంగా చూశారు. సోషల్ మీడియాలో పోస్టు ఫార్వర్డ్ చేసినందుకు రంగనాయకమ్మ అనే వృద్ధురాలిపైకి సీఐడీని ప్రయోగించి విచారణ పేరిట వేధించారు. ఇక పోలీసులు టీడీపీ నేతల ఇళ్ల గోడలు దూకి బెడ్రూంలోకి కూడా వెళ్లి వారిని అరెస్టులు చేసిన ఘటనలు కోకొల్లలు. శాంతిభద్రతలపై అసెంబ్లీలో టీడీపీ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టే శ్వేతపత్రంలో ఇవన్నీ పొందుపరిచే అవకాశాలు ఉన్నాయని.. వీటికి సమాధానం చెప్పలేకే జగన్ ఢిల్లీ ధర్నా ఎత్తు ఎత్తారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తనకు జనం ఓట్లేయకపోవడాన్ని ఆయన జీర్ణించుకోలేకపోతున్నారని.. ప్రజాతీర్పును అసలు అంగీకరించడమే లేదని టీడీపీ నేతలు ఆక్షేపిస్తున్నారు. నూతన ప్రభుత్వానికి కొంత సమయం ఇద్దామని.. కొన్నాళ్లు వేచిచూద్దామన్న వైసీపీ ముఖ్య నేతల సలహాను జగన్ ఖాతరు చేయలేదు. కొత్త ప్రభుత్వం కొలువుదీరి రెండు నెలలు కూడా కాకముందే.. మొదటి రోజు నుంచే ఏదో జరిగిపోతోందని గగ్గోలు పెడుతున్నారు. వాస్తవానికి ఎన్నికల ఫలితాల తర్వాత ముగ్గురు టీడీపీ కార్యకర్తలను వైసీపీ మూకలు హత్య చేశాయి. వినుకొండలో ఇద్దరు వైసీపీ కార్యకర్తల మధ్య వ్యక్తిగత కక్షల కారణంగా రషీద్ హత్య జరిగితే.. టీడీపీ వాళ్లే చేయించారని ఆరోపిస్తూ అక్కడకు వెళ్లి రచ్చచేయడానికి ప్రయత్నించారు. గంజాయి గొడవతోనే ఈ హత్య జరిగిందని వైసీపీ నేతలు కూడా అంగీకరించారు. అయినా దీనిని పక్కదోవ పట్టించడానికి.. స్థానికంగా చిన్న చిన్న దాడులకు సైతం రాజకీయ రంగు పులిమి.. జగన్ ఏకంగా ఢిల్లీ వెళ్లి రాష్ట్రం పరువు తీసే ప్రయత్నం చేస్తున్నారని రాజకీయ వర్గాలు ధ్వజమెత్తుతున్నాయి.

గవర్నర్‌ను కలిసిన జగన్

చంద్రబాబు ప్రభుత్వంలో రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని.. రాష్ట్రపతి పాలన విధించాలంటూ రాష్ట్రపతికి, ప్రధానికి లేఖలు రాసిన జగన్.. ఆదివారం విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను కలిశారు. అదే డిమాండ్‌తో వినతిపత్రం సమర్పించారు. పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప నివాసంపై దాడి జరిగిందని.. అక్కడ పర్యటించకుండా తమ ఎంపీ మిథున్‌రెడ్డిని అడ్డుకుంటున్నారని, ఆయనపై హత్యాయత్నం కేసు నమోదుచేశారని అందులో ఫిర్యాదు చేశారు. వైసీపీ కార్యకర్త రషీద్ హత్యనూ ప్రస్తావించారు. వైసీపీ నాయకులను లక్ష్యంగా చేసుకుని టీడీపీ అరాచకాలు సృష్టిస్తోందన్నారు. వీటన్నిటినీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్రపతి పాలన విధించాల్సిందిగా కేంద్రానికి సిఫారసు చేయాలని గవర్నర్‌ను కోరారు. అనంతరం రాజ్‌భవన్ వెలుపల జగన్ మీడియాతో మాట్లాడతారని అందరూ భావించారు. కానీ శుక్రవారం వినుకొండ పర్యటన సమయంలో విలేకరులు వేసిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకపోయిన ఆయన.. ఆదివారం కూడా అలాంటి పరిస్థితే ఎదురవుతుందని భయపడినట్లుగా ఉంది. మీడియాతో మాట్లాడకుండానే వెళ్లిపోయారు.

అసెంబ్లీ వదిలేసి ఢిల్లీకా?

జగన్‌వి డైవర్షన్ డ్రామాలు: టీడీపీపీ

పోలవరం, అమరావతి నిర్మాణాలకు కేంద్రం చేయూతనివ్వాలి

లావు శ్రీకృష్ణదేవరాయలు వినతి



న్యూఢిల్లీ, జూలై 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అసెంబ్లీ సమావేశాలుంటే వదిలేసి ఢిల్లీ వచ్చి ధర్నా చేస్తానని చెబుతున్న జగన్ డైవర్షన్ డ్రామాలు ఆడుతున్నారని తెలుగుదేశం పార్లమెంటరీ పార్టీ (టీడీపీపీ) నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు మండిపడ్డారు. ఆయన ఐదేళ్ల పాలనలో ఇప్పటికే అమరావతి, పోలవరం, విద్యుత్, సహజ వనరుల దోపిడీపై నాలుగు శ్వేతపత్రాలు విడుదల చేశామని.. అసెంబ్లీ సమావేశాల్లో శాంతిభద్రతలు, పరిశ్రమలతో పాటు ఆర్థిక పరిస్థితిపై శ్వేతపత్రాలు ప్రవేశపెడతారని.. వీటిపై అక్కడ చర్చించకుండా హస్తిన వస్తాననడం హాస్యాస్పదంగా ఉందని అన్నారు. సోమవారం పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో ఆదివారమిక్కడ రక్షణ మంత్రి రాజ్‌నాథ్‌సింగ్ ఆధ్వర్యంలో అఖిలపక్ష సమావేశం జరిగింది. టీడీపీ తరఫున రాయలు హాజరయ్యారు. పార్లమెంటులో ఏపీ ఆర్థిక పరిస్థితిపై చర్చిస్తామని తెలిపారు. ఐదేళ్ల జగన్ జమానాలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని లోక్‌సభ వేదికగా దేశానికి వివరిస్తామన్నారు. అమరావతి, పోలవరం నిర్మాణాలకు కేంద్రం చేయూతనివ్వాలని కోరారు. సభలో తమ పార్టీ ఎంపీల్లో ఎక్కువ మంది యువత, కొత్తవారు ఉన్నారని, వారికి మాట్లాడేందుకు అవకాశమివ్వాలని విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష భేటీ అనంతరం సహచర ఎంపీ జీఎం హరీశ్ బాలయోగితో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. శ్వేతపత్రాలు, రాష్ట్ర సమస్యలపై అసెంబ్లీలో చర్చిస్తే ఆంధ్ర ప్రజలు వింటారని.. కానీ జగన్ హస్తిన వచ్చి నాటకాలు ఆడతామంటే విశ్వసించరని స్పష్టం చేశారు. ఐదేళ్లలో చేసిన తప్పులు బయటకు వస్తాయనే భయంతో.. వాటి నుంచి తప్పించుకోవడానికే జగ న్ ఢిల్లీలో డ్రామాలు చేయాలని చూస్తున్నారని విమర్శించారు. అభివృద్ధిని అడ్డుకోవడం, పొలిటికల్ డ్రామాలు ఆడడమే వైసీపీ పనని మండిపడ్డారు.

విధ్వంసం గురించి అందరికీ తెలియాలి..

గత ఐదేళ్లలో రాష్ట్రంలో జరిగిన ఆర్థిక విధ్వంసం గురించి దేశానికి తెలియాల్సిన అవసరం ఉందని.. ఇది తెలిస్తే అన్ని పార్టీలూ తమను సమర్థిస్తాయని రాయలు చెప్పారు. విభజన చట్టంలోని హామీలన్నీ నెరవేర్చాలని కోరారు. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు తాము సుముఖంగా లేమని చంద్రబాబు ఇప్పటికే చెప్పారని గుర్తు చేశారు. రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు వేయాలని, రైలు సర్వీసులు పునరుద్ధరించాలని కోరారు. ఇంటింటికీ కుళాయి నీళ్ల పథకం కూడా అలాగే తయారైందని, ఆ నిధులను పక్కదారి పట్టించారని విమర్శించారు.

ప్రత్యేక హోదా ప్రస్తావించాలి: బాలశౌరి

ఏపీలో శాంతిభద్రతలు అదుపులోనే ఉన్నాయని, కొందరు ఉద్దేశపూర్వకంగానే అసత్య ప్రచారం చేస్తున్నారని జనసేన లోక్‌సభా పక్ష నేత వల్లభనేని బాలశౌరి మండిపడ్డారు. ఆదివారమిక్కడ అఖిలపక్ష సమావేశం ముగిశాక ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీకి ప్రత్యేక హోదా గురించి పార్లమెంటులో ప్రస్తావించాలని, అంతేతప్ప అఖిలపక్ష సమావేశంలో అడిగితే ఏం ప్రయోజనమని ప్రశ్నించారు. పార్లమెంటులో సమావేశాల్లో ప్రతి ఒక్కరికీ తగినంత సమయం కేటాయించాలని కోరానన్నారు. జనసేన వందశాతం స్ట్రైక్ రేట్ కలిగిన పార్టీ అని ఆయన గుర్తుచేశారు.

ఎయిమ్స్ వైపు ఎంపీల చూపు

ముగ్గురికి నామినేటెడ్ పదవులకు అవకాశం

గుంటూరు, జూలై 21(ఆంధ్రజ్యోతి): మంగళగిరిలోని ఎయిమ్స్ బోర్డు మెంబర్ పదవులపై రాష్ట్ర ఎంపీలు దృష్టి సారించారు. ఈ బోర్డులో మొత్తం 17 మంది సభ్యులుంటారు. ఇందులో ఎన్‌టీఆర్ హెల్త్ యూనివర్శిటీ వైస్ చాన్సలర్‌గా ఎవరు ఉంటే వారు సభ్యునిగా కొనసాగుతారు. ఎక్స్ అఫిషియో సభ్యులుగా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ డైరక్టర్ జనరల్, మంగళగిరి ఎయిమ్స్ డైరెక్టర్ వ్యవహరిస్తారు. కాగా రాష్ట్రానికి చెందిన ముగ్గురు ఎంపీలను బోర్డు మెంబర్లుగా నియమిస్తారు. ఇప్పటి వరకు ఈ బోర్డులో వైసీపీకి చెందిన రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, తెలంగాణ ప్రాంతానికి చెందిన ఎంపీ ధర్మపురి అరవింద్, వైసీపీ మాజీ ఎంపీ బీశెట్టి వెంకట సత్యవతి బోర్డు మెంబర్లుగా కొనసాగారు. ఈ ముగ్గురు తప్పుకోవడంతో మంగళగిరి ఎయిమ్స్ బోర్డులో ముగ్గురు ఎంపీలను నియమించుకోవాల్సి ఉంది. రాష్ట్రానికి చెందిన టీడీపీ, బీజేపీ ఎంపీలు ఆ పదవులపై దృష్టి సారించారు. మూడింటిలో రెండు టీడీపీకి, ఒకటి బీజేపీకి దక్కనున్నాయి.

రాష్ట్రపతి పాలన పెట్టండి

ప్రత్యేక హోదా వచ్చేవరకూ పోరాటం: వైసీపీపీ

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రపతి పాలన విధించాలని వైసీపీ పార్లమెంటరీ పార్టీ నేత విజయ సాయిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా వచ్చేవరకూ పోరాడతామన్నారు. ఆదివారమిక్కడ అఖిలపక్ష సమావేశం ముగిసిన తర్వాత ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు కుప్పకూలాయని ఆరోపించారు. వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డి మాట్లాడుతూ.. ఏపీలో భయానక దాడులు జరుగుతున్నాయని తెలిపారు. రషీద్‌ది రాజకీయ హత్యేనన్నారు. రాష్ట్ర పరిస్థితులను జగన్ బుధవారం అన్ని పార్టీల దృష్టికీ తీసుకెళ్తారని చెప్పారు. పుంగనూరులో తనపై దాడి విషయాన్ని ప్రివిలేజ్ కమిటీ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

ప్రత్యేక హోదాపై టీడీపీ మౌనం: జైరాం రమేశ్

న్యూఢిల్లీ, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదాపై టీడీపీ మౌనం వహించిందని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఆరోపించారు. ఆదివారం అఖిలపక్ష సమావేశంలో బిహార్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని జేడీ(యూ), ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా కావాలని వైసీపీ డిమాండ్ చేశాయని.. విచిత్రమేమిటంటే ఈ విషయంపై టీడీపీ మౌనం వహించిందని 'ఎక్స్' వేదికగా తెలిపారు. అఖిల పక్ష సమావేశంలో జరుగుతున్నది ఆయన లైవ్ ట్వీటింగ్ చేస్తూ వచ్చారని.. ఈ దఫా సమావేశాలకు ఎవరైనా మంచి అనుభవజ్ఞుడిని పంపాలని బీజేపీ ఐటీ ఇన్‌చార్జి అమిత్ మాలవీయ కాంగ్రెస్ అధిష్ఠానానికి సూచించారు.

4 ఏళ్లుగా నిర్వహణ చార్జీలు చెల్లించలేదు

బకాయిలు చెల్లించాలి: ఏపీ ఇంజనీర్స్ అసోసియేషన్

అమరావతి, జూలై 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం మెటీరియల్ నిధులతో చేపడుతున్న ఇంజనీరింగ్ పనులకు చెల్లించాల్సిన 3 శాతం నిర్వహణ చార్జీలను నాలుగేళ్లుగా చెల్లించడం లేదని, ఈ నిధులు చెల్లించకుంటే ఉపాధి పనులు చేపట్టకుండా నిలిపేస్తామని పంచాయతీరాజ్ ఇంజనీర్లు హెచ్చరించారు. ఆదివారం ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ల అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సందర్భంగా కమిటీ పలు తీర్మానాలు చేసింది. రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లే క్రమంలో ఎన్డీయే కూటమి ప్రభుత్వానికి పంచాయతీరాజ్ ఇంజనీర్లు సంపూర్ణ సహకారం అందిస్తారని తీర్మానించారు.

ఐదు నెలలుగా జీతాల్లేవ్!

ఉద్యాన వర్సిటీ టీచర్స్ ఆవేదన

వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ పరిధిలోని వివిధ పరిశోధన స్థానాల్లో పని చేస్తున్న బోధన, బోధనేతర సిబ్బందికి నెలల తరబడి జీతాలు పెండింగ్ పెట్టడం బాధాకరమని వర్సిటీ టీచర్స్ అసోసియేషన్ కార్యదర్శి వెంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. అంబాజీపేట, పందిరిమామిడి, విజయరాయి, పెద్దాపురం పరిశోధన స్థానాల్లో ఐసీఏఆర్ ప్రాజెక్టుల కింద పని చేస్తున్న సిబ్బందికి సంబంధించి, గతేడాది ఆడిట్ యూసీలు దాఖలు చేయకపోవడం వల్ల గత నాలుగైదు నెలలుగా జీతాలు రాలేదన్నారు.

27 మంది భారతీయులకు సైబర్ ఉచ్చు నుంచి విముక్తి

కాంబోడియాలో 14.. లావోస్‌లో 13 మందిని కాపాడిన విదేశాంగ శాఖ

న్యూఢిల్లీ, జూలై 21: ఉద్యోగాల పేరుతో సైబర్ నేరాలు చేయించే చైనా ముఠాలకు చిక్కిన మరో 27 మంది భారతీయులను విదేశాంగ శాఖ కాపాడింది. కాంబోడియాలో 14 మంది, లావోస్‌లో మరో 13 మందిని కాపాడినట్లు ఆయా దేశాల్లోని భారత రాయబారులు వేర్వేరు ప్రకటనల్లో వెల్లడించారు. ఇప్పటి వరకు 650 మంది బాధిత భారతీయులను సురక్షితంగా స్వదేశానికి పంపినట్లు కాంబోడియాలోని రాయబార కార్యాలయం ఎక్స్‌లో పోస్టు చేసింది. 518 మంది భారతీయులను సైబర్ నేరాల ముఠాల ఉచ్చునుంచి రక్షించినట్లు లావోస్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. కాగా.. చైనాకు చెందిన సైబర్ ముఠాలు భారతీయులకు ఉద్యోగాల ఎరవేసి.. కాంబోడియా, లావోస్ వంటి దేశాలకు తరలించిన విషయం తెలిసిందే.!

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.